UNIVERSAL LIBRARY
OU_204004
UNIVERSAL LIBRARY

శ్రీ రస్తు.

ఆంధ్ర - విక్రమోర్వశీయనాటకము

కాళిదాస సంస్కృతనాటకమున కనువాదము.

వేదము వేంకటరాయశాస్త్రి ప్రణీతము.

ద్వితీయ ముద్రణము.

వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్,

4 మల్లికేశ్వరగుడిసందు, లింగిసెట్టివీథి,

జార్జిటౌను, మదరాసు.

All Rights Reserved.] [వెల రు. 1-8-0

ప్రథమముద్రణ విజ్ఞప్తి.

కడచినవత్సరము జూలై మొదలు ఆముక్తమాల్యదకు తత్పూర్వ లిఖితావశిష్టమైన టీకను వ్రాయుచుంటిని. అది నవంబరులో సమాప్తిం జెందినది. అందులకైన పరిక్లేశమువలన అనారోగ్యము పైకొనినది. తత్సహానోపాయముగా డిసెంబరు జనవరి నెలలో రత్నావళీవిక్రమోర్వశీయములను ఆంధ్రీకరించితిని.

ఆవృత్తాంతమును—పూర్వము మఱియు మాళవికకు ముద్రణవ్యయము నొసంగినవారు కావ్యనాటకాదివాఙ్మయరసజ్ఞశిఖామణులు విడవలూరుగ్రామవాస్తవ్యులు పంటకులావతంసులు సదాచారధురంధరులు

నెల్లూరిలో నిధిపతులు

శ్రీయుత - దొడ్ల రామిరెడ్డిగారు

విని, అత్యంతప్రీత్యుత్సాహములతో ఏతద్రచనంగూర్చి తమయభినందనముం దెలుపుచు ఏతద్గ్రంథద్వయముద్రణమునకు పర్యాప్తమైనధనమును నాకుం బంపినారు.

శ్రీ రామిరెడ్డిగారు 20 ఏండ్లకుముందు విక్రమోర్వశీయము నాంధ్రీకరింపుమని నన్ను హెచ్చరించిరి. వారి యాయిప్సితము నావలన ఇప్పటికి నెఱవేఱినది.

నాకు ప్రజ్ఞారిక్తగ్రథనమునకు ముద్రణార్థము అప్రార్థితముగాం దోడ్పడినట్టి యాపఃస్వతీసరస్వత్పుత్రీలాలితునికి అత్యంతకృతజ్ఞుండను.

ఆయత్తాకోడండ్రిరువురును శ్రీ రెడ్డిగారికి విద్యకన్న ఐశ్వర్యమును ఐశ్వర్యముకన్న విద్యయు పోటీలుమెఱసి యొసంగుచుందురుగాక.

అక్టోబరు, 1921 మదరాసు. వే. వేంకటరాయశాస్త్రి.

విక్రమోర్వశీయమందలి పాత్రములు

పురుషులు.

* సూత్రధారుఁడు.

* పారిపార్శ్వకుఁడు.

పురూరవుఁడు.—కథానాయకుఁడు.

మాణవకుఁడు.—విదూషకుఁడు.

చిత్రరథుఁడు.—గంధర్వరాజు.

ఆయువు.—పురూరవునికుమారుఁడు.

నారదుఁడు.—దేవర్షి.

లాతవ్యుఁడు.—కంచుకి.

వేధకుఁడు.—వేటకాఁడు.

పైలవుఁడు, గాలవుఁడు.—భరతశిష్యులు.

స్త్రీలు.

ఊర్వశి.—కథానాయిక.

చిత్రలేఖ, సహజన్య, రంభ, మేనక.—ఊర్వశిసఖియలు, అచ్చరలు.

ఔశీనరి.—పురూరవునిపట్టమహిషి.

నిపుణిక.—ఔశీనరిచేటి.

సత్యవతి.—తాపసి చ్యవనాశ్రమగత.

యవని.—శస్త్రధారిణి.

ఉపోద్ఘాతము.

కాళిదాసు.

అతని కాలము:—'కవికులగురువును', 'భారతీ విలాసుఁడు'ను నైన కాళిదాస మహాకవి కాలమునుగూర్చి పండితులలో భిన్నాభిప్రాయములు కలవు. మనవారు అతని ఖ్యాతినిబట్టియు కవితామహాత్మ్యమును బట్టియు అతఁడు చాల ప్రాచీనుఁడనియు మహనీయుఁడైన భోజరాజు నాస్థానివాఁడనియు ఏవేవో చెప్పుకొందురు. చారిత్రకవిమర్శ తలయెత్తినతర్వాత మన తొంటి యభిప్రాయములు పెక్కులు మార్పునుజెందినవి. పాశ్చాత్య పండితులు కాళిదాసుకాలము నిట్లు నిర్ణయించినారు. సర్ విలియం జోన్సు ప్రభృతులు క్రీ. పూ. మొదటి శతాబ్దమనియు, ల్యాస్సన్ మొదలైనవారు క్రీ. శ. రెండవ శతాబ్దమనియు, విన్సెంట్ స్మిత్, కీత్ పండితులు క్రీ. శ. నాలుగవ శతాబ్దమనియు, మాక్స్‌ముల్లర్ మ్యాక్డొనలు పండితులు క్రీ.శ. ఆఱవ శతాబ్దమనియు నభిప్రాయపడినారు. జ్యోతిర్విదాభరణమందలి 'ధన్వంతరిక్షపణకామరసింహ' ఇత్యాది శ్లోకముచేత నీతఁడొక విక్రమాదిత్యుని యాస్థానివాఁడనియు ఆవిక్రమాదిత్యుఁడు క్రీ. పూ. 57వ సంవత్సరప్రాంతముననుండిన శకారి విక్రమాదిత్యుఁడనియు అందుచే కాళిదాసుఁడు అప్పటివాఁడనియు శ్రీ జోన్స్‌గారి యభిప్రాయము. ఇతరులును విక్రమాదిత్య నామముమీఁదనే యాధారపడి ఆ నామధేయముగలరాజులను వెదకి ఏవేవో కారణములచేత కాలనిర్ణయమును చేసిరి.

కాని విక్రమాదిత్యుఁడనునది బిరుదనామము. దీనిని వహించిన వారు పలువురు. పైగా జ్యోతిర్విదాభరణము కాళిదాసీయ మగుట సందేహాస్పదము. ధన్వంతర్యాది నామములలో కొన్ని నామమాత్రములే. అమరసింహునికాలము ఇంకను నిర్ణీతము కాలేదు. వరాహమిహిరుఁడు క్రీ. శ 587 లో నుండినట్లు ఆతని వ్యాఖ్యాతచే తెలియుచున్నది. 'దిఙ్నాగానాం పథి పరిహరన్ స్థూలహస్తావలేపాన్' మొదలైన మేఘసందేశ వాక్యములంగొని వ్యాఖ్యాతలు కాళిదాసు దిఙ్నాగాచార్యుల సమకాలికుఁడని యొక చమత్కారమును వెలిబుచ్చిరి. 10 శతాబ్దిలోని వల్లభదేవుఁడు ఈ విషయమునే చెప్పెను. దక్షిణావర్త మల్లినాథులు (12, 14 శతాబ్దులవారు) ఈ విషయము నుగ్గడించుటచే నిది అనంతర కవికల్పితమని తలంపవలసియున్నది. బౌద్ధగ్రంథములు దిఙ్నాగ ధర్మకీర్తులను వారిని అసంగాచార్యుల శిష్యులనుగాను, అసంగాచార్యుని వసుబంధు పండితుని జ్యేష్ఠసోదరునిగాను చెప్పుటచేతను, వసుబంధుని గ్రంథములు చీనవాఙ్మయము లోనికి క్రీ. శ. 400 ముందే అనువదితము లగుటచేతను, కాళిదాసు దిఙ్నాగుని సమకాలికుఁడగునేని వరాహమిహిరుని సమకాలికుఁడు కాజాలఁడని తేలుచున్నది. ఇందుచే పై శ్లోకమందలి వారి సమకాలీనత సంశయనీయమగుచున్నది. మఱియు కాళిదాసు 'జామిత్ర' 'ఉచ్చ' శబ్దములను ప్రయోగించుటచేత క్రీ. శ. 499 లో నివసించిన ఆర్యభటుని తర్వాతివాఁడనియొక యభిప్రాయముకలదు కాని 'ఉచ్చ' రామాయణమందే ఉండుటయు, 'జామిత్ర'మునకు మనవారు 'జామిం దుహితరం, త్రాయతే' అనియు 'జాయాయాః మిత్రం' అనియు అర్థము చెప్పియుండుట

చేతను, మల్లినాథుఁడు 'లగ్నాత్ పష్ఠరంధ్రస్థానమ్' అని టీకించి యుండుటచేతను, ఈవాదము నిలువదు.

మఱికొందఱు కాళిదాసు అశ్వఘోషుని తర్వాతివాఁడుగా నుండవచ్చుననియు, బుద్ధచరితాది గ్రంథములనుండి కాళిదాసు భావములను గ్రహించినాఁడనియు వాదించిరి. గ్రంథములు పరికించువారికి కాళిదాసే పూర్వుఁడని తెలియగలదు. కథాంశ వర్ణనాదికములయందు కాళిదాసుని రచన చాల సహజమై అప్రయత్నపూర్వకముగానున్నది. ఆయా సందర్భములు చక్కఁగా పొందియున్నవి. శబ్దప్రయోగమునందును, అలంకారాదులలోను, వ్యాకరణ ప్రయోగములయందును పాండిత్యోద్ఘాటనకొఱకు కాళిదాసు పాటుపడినట్లు కానరాదు. అశ్వఘోషుని రచనయంతయు ప్రయత్నపూర్వకముగా నుండుటయే గాక అలంకార వ్యాకరణ ప్రయోగముల గారడీవిద్యలచే నిండి కొంత విసుగునుసయితము కలిగించుచున్నది

మఱి మాళవికాగ్నిమిత్రనాటకాంత భరతవాక్యమున కాళిదాసే తా నగ్నిమిత్రునకు సమకాలికుఁడైనట్లు వ్రాసికొని యున్నాఁడు. 'భూవరుఁడగ్నిమిత్త్రుఁడిలఁబ్రోచుచుఁగాచుచునుండ' అనువాక్యములే ప్రబలాధారముగా గైకొనఁదగును. పుష్యమిత్త్రునియజ్ఞము వాస్తవముగా జరిగినదేగాని కల్పితముగా దనియు ధనదేవుని అయోధ్యలోని శాసనమున తెలియుచున్నది. అది సముద్రగుప్తుని యశ్వమేధముగానుండునని కొందఱు తలంచినది పొరబాటు. వీనింబట్టియు, శాకుంతల విక్రమోర్వశీయ మాళవికాగ్నిమిత్రములయందలి ధర్మశాస్త్ర విషయక ప్రస్తావములచేతను, శైలీమార్దవముచేతను, అగ్నిమిత్రుని అప్పటి

పాలకునిగా పేర్కొనటచేతను ఈతనికాలము బహుశః క్రీ. పూ. 150 మొదలు 56 మధ్యకాలమని చరిత్రకారులయభిప్రాయమై యున్నది.

అతనిగ్రంథములు—శాకుంతల విక్రమోర్వశీయ మాళవికాగ్నిమిత్రములు, రఘువంశ కుమారసంభవ మేఘసందేశ ఋతుసంహారములు. జ్యోతిర్విదాభరణాది గ్రంథములు ఇతనికి ఆరోపితములు.

నాటకకథాసంగ్రహము.

చంద్రుని కుమారుఁడు బుధుఁడు. అతనికుమారుఁడు పురూరవుఁడు, షట్చక్రవర్తులలో నొకఁడు; సూర్యుని దౌహిత్రుఁడు, ఇళాపుత్త్రుఁడు ; మధ్యమ లోకపాలకుఁడు. గంగా యమునా సంగమతీరమున ప్రతిష్ఠాన నగరము ఈతని రాజధాని. ఇది 'స్థానాంతరమైనస్వర్గము.' దేవేంద్రుఁడు రాక్షసులతో తనకు 'పోరు ఆసన్నమైనప్పుడు మధ్యమలోకంనుంచి ఈయననే సగౌరవంగా రప్పించి విజయసేనమొనలో నియోగిస్తాడు' ఆ రాజర్షి రథము 'సోమదత్తము, లేడిజెండా తోటిది.'

మహేంద్రుని యప్సరసలలో ఊర్వశి చాల అందగత్తె. "అచ్చరలందఱును నారాయణఋషిని వలపింపవచ్చి అతనితొడ నుండి జనించిన యీ రమణినిగాంచి" సిగ్గుజెందిరి. ఈ 'యమృతోపమాంగిని' ఆమహర్షి దేవేంద్రునికి ఒసంగెను. ఒకప్పుడు ఊర్వశి కుబేరుని యాస్థానికిపోయి నాట్యసేవచేసి చెలులతో మరలి వచ్చుచుండఁగా హిరణ్యపురవాసి కేశియను దానవుఁడు ఆకస్మికముగాచూచి చిత్రలేఖతోకూడ చెఱఁగొనిపోయెను. అంతట మిగిలిన యప్సరసలెల్లరును, ఎవఁడైనను ఆకాశగమనము

గల దేవతలపక్షపాతి తమ్ము కాపాడునుగాక యని బిగ్గరగా ఆక్రందింపసాగిరి. ఏలయన హిరణ్యపురమునకు ఆకాశమార్గమున నేగవలయును

ఆసమయమున సూర్యభగవానుని సేవించి తనరాజధానికి పురూరవుఁడు మరలివచ్చుచుండెను అచ్చరల యార్తనాదము నాలకించి తనపేరుచెప్పి, ఆ రాక్షసుఁడు ఈశాన్యమువైపు పోయినాఁడని తెలిసికొని, వారిని హేమకూట శిఖరముపై నుండి ఎదురుచూడ నియమించి పురూరవుఁడు ఊర్వశీ చిత్రలేఖలను తెచ్చుటకుపోవును. క్షణములో ఆరక్కసుని జయించి ఊర్వశిని చెఱవిడిపించి చిత్రలేఖతో తోడ్కొనివచ్చును. పురూరవునికి కేశిదానవునిజయించుటకు చాలకాలముపట్టలేదు. ఏలన ఊర్వశిని పట్టుకొనఁగానే అప్సరసలు ఆక్రందనము చేసిరి. తక్షణమే దానివినిన పురూరవుఁడుపోయి ఆమెను విడిపించెను. మూర్ఛపోయిన యూర్వశి రథమందు తేరినది. అప్సరసల సంతోషము వర్ణనాతీతము. ఊర్వశి క్రమముగా మూర్ఛతేరి ఆ రాజునుచూచి, అతనిమీఁద ఆశజనింపఁగా, ఆ కారణముచేత రాక్షసులు తనకు వాస్తవముగానే ఉపకార మొనర్చినారని తలంచును. రథమందుండఁగనే ఊర్వశీ పురూరవులకు చక్షుఃప్రీతి మనస్సంగములు ఏర్పడును పురూరవుని వాక్యమునువిని 'ఇతనివాక్కు ఎంత నాణెముగా నున్నది' అని ఊర్వశి తలంచును. తర్వాత ఎగుడుదిగుడు ప్రదేశమున తేరికుదుపుచేత ఊర్వశిభుజము పురూరవుని భుజమునకు ఒరసికొని రాజుమనసునందు మదనవికారమును కలిగించును. ఊర్వశికి తగిలిన ఆభాగమే తనశరీరమందు ధన్యమునియు, అట్లు రథముదిగుట తన కుప

కారకమేయని పురూరవుఁడు తలంచును. రథమునుండి దిగఁగ తనే అచ్చరలు ఉర్వశిని కౌఁగిలించుకొందురు.

ఆసమయమున తూర్పుదిక్కున మిక్కుటమైన రథవేగంపు శబ్దము వినఁబడును. చూడఁగా చిత్రరథుఁడను గంధర్వరాజును ఆతనిసైన్యమును కేశిదానవుఁడు ఉర్వశిని చెఱఁబట్టినాఁడని నారదులవారివలన విని మహేంద్రుఁడు ఆమెను విడిపించుకొని రావలసినదని గంధర్వసేనకు ఆజ్ఞాపించినాఁడు. గంధర్వులు బయలుదేరివచ్చుచుండఁగా మార్గమధ్యమున చారణులవలన పురూరవుని విజయవృత్తాంతమునువిని ఆతనికడకువచ్చిరి. అదియే ఆరథశబ్దము. వచ్చుచునే గంధర్వరాజు చిత్రరథుఁడు పురూరవుని స్తుతించి ఇంద్రునికడకు ఉర్వశితో ఆతనినే రమ్మనికోరును. అతఁడు రాకపోఁగా ఉర్వశ్యాదులనుతోడ్కొని ఇంద్రలోకమునకు బయలుదేరిపోవును. తీగకొమ్మకు తనయేకావలి తగులొన్నదని ఉర్వశిక్షణమునిలిచి పురూరవుని సాభిప్రాయముగా చూచుచుపోవును దానియభిప్రాయము చిత్రలేఖ గ్రహించును. పురూరవుఁడును మదనవికారమునకు పాలగును.

పురూరవుని రాణి, కాశిరాజపుత్త్రి, ఔశీనరి, సూర్యోపస్థానమునుండివచ్చినదిమొదలు ప్రభువు అన్యాసక్తుఁడుగా నగపడుచున్నందున అందులకు కారణము వెదుకసాగును. చేటిని, నిపుణికను, విదూషకునితో మాటలాడి మెల్లగా నాతని నోటినుండి రహస్యమునులాగుకొని పంపును. విదూషకుఁడు రాజరహస్యమును దాచుకొనలేక కష్టపడుచుండును. నిపుణిక విదూషకునిసమీపించి మంచిమాటలతో ఇట్లుచెప్పును: 'ఎవతెమీఁద రాజు ఉత్కంఠితుఁడుగా నున్నాఁడో ఆమెపేర దేవిని పల

కరించినాడు' అని. ఆమాటవిని రాజే తనరహస్యమును బయలుపరిచినాఁడనితలంచి విదూషకుఁడు 'ఏమీ, ఉర్వశీ అని పిలిచినాఁడా, దేవిని' అని యడిగి రహస్యమును బయటవేయును. నిపుణిక రహస్యమును భేదించి సంతోషముతోఁ బోవును. విదూషకుఁడు రాజును చూడఁబోవును.

రాజు ఉర్వశినే తలంచుచుండును. విదూషకుఁడు అతనిని వినోదింపఁజేయుచుండును. 'రహస్యమును కాచుచున్నావా' యని రాజు అనుగఁగా విదూషకుఁడు ఆదాసి తన్ను మోసము చేసినదని గ్రహించును. తర్వాత కొంతసేపు ఉర్వశీవర్ణనతో నిరువురును కాలముగడపుచు ప్రమదవనమునకు పోవుదురు ఆవనమందలి వసంతశోభ పురూరవుని విరహవేదనను ఇనుమడింపఁజేయును.

ఇంతలో ఆకాశమార్గమున ఉర్వశి పురూరవుని కడకు బయలుదేరును. చిత్రలేఖ అనుగమించును పూర్వము కేశిదానవునికడనుండి విడువడి స్వర్గమునకు మరలివచ్చినప్పుడు, బృహస్పతి మరల ఇట్టి యాపదలు రాకుండ నామెకును చిత్రలేఖకును అపరాజితయను పేరి శిఖాబంధనవిద్యను ఉపదేశించెను. అందుచే మంత్రమును ఉచ్చరించుచు జుట్టు ముడివేసికొనినయెడల ఆముడి వీడనంతవఱకు దేవదానవులకు అలంఘనీయలగుదురు ఆవిద్యాబలముచే మరల అసురభయములేక వారు సంచరింప మొదలిడి పురూరవునికడకు తామే బయలుదేరుదురు క్షణములో నాకాశమార్గమున ప్రతిష్ఠాన నగరమునకువచ్చి రాజగృహమును ప్రవేశింతురు. పురూరవుని వెదకుచు నందనవనమును ప్రవేశించి పురూరవుని ప్రేమాలాపములను అంతర్ధానముగానుండి వినుదురు.

పురూరవుఁడు తన్నుద్దేశించి యిట్లుకష్టపడుచున్నాఁడని గ్రహించి ఉర్వశి సంతోషించును. పురూరవుఁడు విరహముచే ఏమేమో చెప్పుచుండఁగా ఉర్వశి ఆ మదనవాక్యములకుబదులు మదన లేఖనురచించిన భూర్జపత్రమును పురూరవునిముందు వేయును దానిని చదువుకొని పురూరవుఁడానందించి విదూషకునికిచ్చి భద్రపరుపుమని చెప్పును. ఉర్వశి ఆతనిచెంతకేఁగ తమకపడును. చిత్రలేఖ తాను ముందుగానేఁగి రాజునకగపడును; ఉర్వశి వలపును నివేదించి రాజుకడకు ఉర్వశిని కొనిపోవును. ఉర్వశీ పురూరవులు ఒకటిరెండుమాటలు ఆడుకొనులోపలనే దేవ దూత ఉర్వశీచిత్రలేఖలను త్వరగా ఇంద్రలోకమునకు పొమ్మని ఆకాశమునుండి పలుకును. ఏలయన భరతముని నేర్పిన ప్రయోగ మును చూడఁగోరుచు లోకపాలురును ఇంద్రుఁడును కాచు కొనియుండిరి. ఉర్వశీ చిత్రలేఖలు చింతతో రాజు ననుజ్ఞనంది వెడలిపోవుదురు

వారు అటుపోఁగానె రాజు ఉర్వశివ్రాసిన యాభూర్జ పత్రమును తెమ్మని విదూషకునియడుగును. విదూషకుని యజా గ్రతచేత ఆ మదనలేఖ గాలికికొట్టుకొనిపోవును రాజడుగఁగా నదిపోయినదని విదూషకుఁడు వెదకును. ఇంతలో పట్టమహిషి ఔశీనరి నిపుణికతో రాజునుచూడవచ్చి త్రోవలో భూర్జపత్ర మునుచూచి చదువుకొని రాజుకడకువచ్చి దానినే రాజునకిచ్చును. రాజు తనదోషమును కప్పుకొన యత్నించునుగాని రాణి కోప గించి వెడలిపోవును. రాజు స్నానభోజనాదులకు లేచును.

ఇంతలో దేవేంద్రునిమందిరమున నొకవిశేషముజరుగును. సరస్వతీదేవి స్వయముగా లక్ష్మీస్వయంవరమును నాటకమును

ప్రాయఁగా దానిని ఆడించుటకు భరతముని ఉర్వశ్యాద్యప్సరస లను శిక్షించి ఉర్వశిచేత లక్ష్మివేషము వేయించుచుండఁగా నొకపొరబాటు జరుగును 'ఎవరిమీఁద నీమనస్సు తగులుకొంటుంది' అనువాక్యమునకు 'పురుషోత్తమునిమీఁద' అనిబదులు చెప్పవలసియుండఁగా ఉర్వశి పురూరవధ్యానమున తనమనస్సులోని విషయమును వెలువరించి 'పురూరవునిమీఁద' అని చెప్పును. వెంటనే గురువుగారికి కోపమువచ్చి 'నీవు నా ఉపదేశమునుంచి అతిక్రమించిన కారణంచేత నీకు దివ్యస్థానం ఉండదు' అని శపించును. మహేంద్రుఁడు కనికరించి ఇట్లనుగ్రహించును, "ఎవనిమీఁద నీమనసు తగులుకొన్నదో అతఁడు నాకు రణసహాయుఁడు, రాజర్షి; అతనికి ప్రియముచేయవలెను కనుక నీవు, ఆయనను పురూరవుని, అతఁడు నీవలన సంతానవంతుఁడు అగునందాఁక యథేచ్ఛముగా కూడుము" అని ఇది ఉర్వశికి మంచిదేయైనది.

ఇచ్చట ప్రతిష్ఠానమున దేవి కాశిరాజపుత్రి ప్రియానుప్రసాదనము అను వ్రతమును పూని అలుక నుజ్జగించి రాజును అనుజ్ఞవేఁడి వ్రతమాచరించును సంధ్యాజపమును ముగించుకొని రాజు మందిరోద్యానమును ప్రవేశించుచుండ కంచుకియేఁగి దేవిమాటగా రాజును మణిహర్మ్యముమీఁద రోహిణీచంద్రసంయోగమగునందాఁక తన్ను (రాణిని) ఎదురుచూచుచుండ ప్రార్థించును. రాజు మణిహర్మ్యము కడకేగును.

చంద్రోదయానంతరము రాజు ఉర్వశీచింతాధీనుఁడుగా నుండఁగా ఉర్వశీచిత్రరేఖలు అచటికివత్తురు పురూరవుని యాలాపములను వినుచు ఆతని దరిసినుండునంతలో దేవి ఔశీనరి అచటికివచ్చును. ఉర్వశీచిత్రరేఖలు అంతర్ధానమునసనుండిచూచు

మండప రాతిచంద్రపాదములను పూజించి, విదూషకునికి స్వస్తి వాచనమిచ్చి రాజును పూజించును. తర్వాత ఇట్లు చెప్పును— 'నేను ఈ దేవతాదంపతులను రోహిణీహరిణాంకులను సాక్షీకరించి ఆర్యపుత్రుని అనుప్రసన్నుని చేస్తున్నాను. ఇది మొదలు ఏ వనితను ఆర్యపుత్రుడు వేడునో, ఎవతె ఆర్యపుత్రుని సమాగమానికి ఉవ్విళ్లూరుతుందో ఆ చెలువతో నేను ప్రేమబంధముతో వర్తింపవలయును" అని.

ఈమాటలను ఉర్వశి సంతోషాశ్చర్యముల పాలగును. రాజు ఇదేమో తెలిసికొనలేక దేవికి ఇంకను కోపమేమోయని యనుమానించును. కాని పతివ్రత కావున ఆమె భర్తను స్వతంత్రునిగా వదలివేసినది. రాజునకు ఉర్వశిమీఁద ప్రేమ మిక్కుటము. దేవి పోఁగానే ఉర్వశిని అతఁడు తలంచును. ఆపొంతనేయున్న ఉర్వశియును దానిని వినును. "ఉర్వశి తనయందెల రవళి చేవీనులకు వినఁబోనర్చునా, మెల్లగా నా వెనుక వచ్చి నా కన్నులు మూయునా" అని ఈవిధముగా రాజు తలంచుచుండగా ఆయచ్చర వెనుక ప్రక్కగా వచ్చి రాజు కన్నులను మూయును అంతట రాజు ఉర్వశిని గ్రహింపఁగా చిత్రలేఖ వెడలిపోవును తాను వేసవిలో సూర్యభగవానుని ఉపాసించవలసియున్నందున మాటికి సఖి దర్శనమునకు రావలనుకాదనియు తనచెలి స్వర్గమును స్మరింపకుండులాగున రాజు చేయవలసినదనియు పలికి వెడలిపోవును రాజు తనకోరిక తీరుటచే ఉర్వశితో సుఖములందేలుచుండును.

అచ్చరలు వంతు ప్రకారము సూర్యభగవంతుని ఉపాసింతురు ఆ ప్రకారము చిత్రలేఖ తన వంతు పని చేయుటకు పోఁగా నిచట ప్రతిష్ఠానమున పురూరవుఁడు ఉర్వశితో కూడి నానాభోగ

ములను అనుభవించుచు రాజ్యభారమును మంత్రులమీఁదనుంచి విహారార్థము ఒకప్పుడు గంధమాదనవనమునకు బయలుదేరి పోయెను. అచట మిన్నేటియిసుకతిన్నెలలో విహరించుచుండిన ఉదయవతియను విద్యాధరకన్యను ఆ రాజర్షి తేరిచూచును. అంతమాత్రమునకే ఉర్వశి అలిగి రాజు ఎంతబతిమాలుకొన్నను వినక, శాపవశమున, స్త్రీలు ప్రవేశింపఁగాని కుమారవనమును ప్రవేశించును. కుమారస్వామి ఆవనమున తపమొనర్చుచు అందు ప్రవేశించు స్త్రీలచే తనకు తపోభంగమగునని అటువచ్చు స్త్రీలెల్ల తీగెలగుదురనియు గౌరీచరణ సంజాతయుయిన మణిచేత తప్ప తొంటిరూపమును పొందరనియు శపించియుండెను. ఆప్రకారమే ఉర్వశి ఆవనమందు ప్రవేశించినంతటనే తీగెగా మారిపోయినది. రాజు ఈ విషయము తెలియక ప్రియతమను వెదకుచు ఉన్మత్తుఁడై ఆవనమందు సంచరింపఁదొడంగెను.

పురూరవుఁడు ఉన్మత్తుఁడై ఆవనమందు పరిభ్రమించుచు తరుగుల్మలతాదులను, పశుపక్ష్యాదులను, గిరినిర్ఝరములను తన కాంతస్థితి నడుగుచు కొంతకాలము గడపినయనంతరము ఎవఁడో 'భగవానుఁడు, మృగచారి' కనికరించి సంగమనీయమను పేరియామణిబొసంగి దానిచే "దయితజనసంగమంబు పరగుఁగా తోడ్తోఁగా" అని అనుగ్రహించిపోవును. మణినిగైకొని పురూరవుఁడు దానిమహిమచే ఏలతగా తన ప్రియమారినదో ఆలతనే ఉన్మత్తావస్థలో కౌఁగిలించికొనఁగా నయ్యది వెంటనే ఉర్వశీ రూపమును తాల్చును. ఉర్వశి పూర్వరూపమునంది తాను లతయైన విషయమును, కుమారస్వామిశాపమును, సంగమనీయమనుమణి చేతప్ప శాపావసానము లేమిని చెప్పఁగా పురూరవుఁడు

ఆమణినే ప్రియకుచూపి అదియే పునస్సమాగమకారణ మని వచించును. వెంటనే ఇరువురును సంతసించి ప్రతిష్ఠానమునకుం బోవుదురు.

ఈయిడుముగడచి కొంతకాలము సుఖముండఁగా ఊర్వశి గర్భముఁదాల్చెను ఆయమగర్భలక్షణములను చూచుచుండియు పురూరవుడు దానిని గ్రహింపలేదు. తరువాత నొకప్పుడు ఊర్వశి కృశించిన విషయమును గుర్తించెనేగాని ఆయమ ప్రసవించిన విషయమును మఱుంగలేదు. ఇందుకు కారణము ఊర్వశి తన గర్భధారణ ప్రసవాదులను పురూరవునకు తెలియకదాఁచుటయే పూర్వము దేవేంద్రుఁడు 'పుత్త్రోదయమైన కుమారుని పురూరవుఁడు చూచునందాఁక నీవు ఆ రాజునకడనుండుము' అని గదా యానతిచ్చెను. త్వరగా రాజును వదలుట కిచ్చగింపక కుమారజన్మవృత్తాంతమును రాజునకు తెలియనీయక దాఁచినది ఈమెకు ప్రసవమైన కాలమున నైమిశేయయాగమిషచే రాజీమెను ఎడఁబాయవలసివచ్చెను. ఈవిషయము రాజెఱుఁగడు ఆయువును పుట్టినప్పుడే చ్యవనమహాముని యాశ్రమమందుండు సత్యవతియను తాపసికడ తల్లి యుల్లడయుంచినది. 'క్షత్రియ కుమారునికి వలసిన జాతకర్మాది విధానమును సర్వమును అతనికి భగవానుఁడు చ్యవనముని గావించినాఁడు. ఇతరవిద్యలు నేర్పి ధనుర్వేదమందును నేర్పరింగావించినాఁడు.'

పురూరవునికి సకలైశ్వర్యములుండియు ఊర్వశీసహవాసముండియు కుమారుఁడు లేడనుచింత బాధించుచుండెను. ఒకానొక విశేషదినమున గంగా యమునా భగవతులకూడలిలో దేవేరులతో స్నానమాడి రాచగుడారముం బ్రవేశించును. రాజు

వస్త్రధారణము ముగించులోపల అంతఃపురములో పరిజనులు గోలయిడసాగిరి. సంగమనీయమను నామణిని బంగారపు దారములో కూర్చినదానిని విసనకఱ్ఱమీఁద తెల్లపట్టువస్త్రముపై నుంచి ఎవరో తెచ్చుచుండఁగా మాంసమనుభ్రమచే గ్రద్ద తటాలునవాలి తన్నుకొనిపోవును కలకలమునువిని రాజు వేషధారణము ముగియకయే వచ్చును. హారమును తన్నుకొనిపోవు గ్రద్దనుచూచి ధనుర్బాణములు తెమ్మని చెప్పును. అవివచ్చులోపల పక్షి చాలదూరముపోవును. బాణము అంతదూరము పాఱదని రాజు, సాయంకాలము గూటికివచ్చునప్పుడు ఆపక్షినిపట్టుమని నాగరికునికి ఆజ్ఞయిడును. ఆమణి కేవలము రత్నమాత్రమగుట చేతకాదుగాని సంగమనీయమగుటచేత రాజునకు చాల ప్రియమైనది.

ఇంతలో నెవరో బాణముతో ఆపులుగునుకొట్టిరనియు, పులుగుమణితో నేలఁగూలెననియు ఆబాణమును మణిని కంచుకి తెచ్చియిచ్చును. మణిని పదిలపఱుపనాజ్ఞాపించి ఆబాణమెవనిదో పరీక్షించి తనకుమారుఁడైన ఆయువుదని గ్రహించును. తనకు కుమారుఁడొకఁడుజనించి ఇంతపెద్దవాఁడైన విషయము ఆశ్చర్యమును కలిగించును. ఆలోచనమీఁద ఉర్వశియొకప్పుడు గర్భము దాల్చియుండినట్లును తర్వాత తటాలున నామెశరీరముకృశించి క్రమముగా వర్ధిల్లినదనియు నైమిశేయయాగ సమయమునదక్క తానామె నెడబాయలేదనియు జ్ఞాపకమునకు తెచ్చుకొనును. ఏకారణముచేత పుత్త్రజన్మవృత్తాంతమును ఆమెదాఁచియుండునో యని ధ్యానించుచుండఁగా రాజదర్శనమునకు చ్యవనాశ్రమము నుండి తాపసియొకతె రాజకుమారలక్షణు నొకబాలుని

తోడ్కొనివచ్చును. ఆబాలునింగన్నంతనే రాజునకు ఆతనియం దపారవాత్సల్యమును ఆతఁడే తనకుమారుఁడేమోయను సంశయమును కలుగును. తాపసి, ఆబాలుని జనించినవెంటనే ఏకారణముచేతనో ఉర్వశి తనకడ ఇల్లడయుంచినదనియు అతనికి సకల సంస్కారములను ఋషియే చేసెననియు పలికి ఇట్లు చెప్పెను. 'నేఁడు పుష్పసమిధలకొఱకు ఋషికుమారులతోఁగూడ ఇతఁడునువచ్చి ఆశ్రమవిరుద్ధమాచరించినాఁడు. మాంసముతెచ్చుకొని గ్రద్ద చెట్టుకొనను వాలుచుండఁగా ఇతఁడు దానిని కోలకు గుఱి చేసినాఁడు. అంతట ఆవృత్తాంతము నెఱింగి భగవంతుఁడు చ్యవనముని, నీచేతి యీయిల్లడను పంపివైవుమని యాజ్ఞాపించినాఁడు కావున నేను ఉర్వశిని చూడఁగోరుచున్నాను" అని చెప్పెను.

ఉర్వశి ప్రవేశించి తన పుత్త్రుంగని సంతోషించి తాపసికి మ్రొక్కెను. తాపసియు ఆయిల్లడను అప్పగించి వెడలిపోవును. ఇంతలో ఉర్వశిశాపావసానమును స్మరించియేడ్చును. రాజడుగఁగా "ఎప్పుడు ఈతడు నా ప్రియసఖుడు రాజర్షి నీయందు జనించిన వంశకరుని ముఖముచూస్తాడో అప్పుడు నీవు మళ్లీ నా సమీపానికి రావలశినది-అని మహేంద్రుడు ఆజ్ఞాపించెను. అందువల్ల నేను మహారాజవియోగానికి వెఱచినదాననై జాతమాత్రుని వీనిని విద్యాప్రాప్తి నిమిత్తమై చ్యవన భగవంతుని యాశ్రమపదంలో సత్యవతమ్మచేతిలో అప్రకాశంగా ఇల్లడవుంచితిని. ఇప్పుడు తండ్రిని కొలవడానికి సమర్థుడయినాడని ఆలోచించుకొని ఆమె మళ్లీ నాకు దీర్ఘాయువును అప్పగించింది. కనక నాకు ఇంతపాటియే మహారాజుతోటి సంవాదము" అని ఉర్వశి బదులుచెప్పి శోకించును.

ఉర్వశి రాజునువదలి ఇంద్రసేవార్థముపోనుండఁగా రాజు తపోవనమేఁగ సంకల్పించుకొని కుమారునికి యౌవరాజ్యాభిషేక ప్రయత్నములుచేయును. ఇంతలో నారదమహర్షి వచ్చి నమస్కరించిన యుర్వశీపురూరవులను 'ఎడబాయని దంపతుల రగుఁడు' అని యాశీర్వదించును. రాజు 'ఈయాశీర్వచనము నిజముకాఁగూడదా' యని కోరుచుండఁగా మహర్షి ఇంద్రసందేశము నిట్లుచెప్పును—'త్రైకాల్యదర్శులు మునులు ఆదేశించినారు-సురాసుర సంగ్రామముకలుగనున్నదని. నీవు నాకు యుద్ధములలో గడిదేరిన సహాయుఁడవు. కావున, నీవు ఇప్పుడు శస్త్రసన్న్యాసము చేయఁగూడదు. ఈయుర్వశియు యావజ్జీవము నీకు సహధర్మచారిణిగా నుండవలసినది" అని. అంతట ఇంద్రుఁడు పంపిన యౌవరాజ్యాభిషేక సంభారములను అప్సరసలు సంతోషమున తేఁగా మహర్షియే కుమారునకు యౌవరాజ్యాభిషేకము సేయఁగా శాశ్వతముగా నుర్వశినిపొంది పురూరవుఁడు ఇంద్రుని చెంతకేఁగి సుఖముండును.

కాళిదాసుని నాటకరచనకు ఆధారములు.

కాళిదాసు ఈనాటకమును రచించుటకు ఆధారములేవో ఊహింపవలసియున్నది. ఉర్వశీ పురూరవసంవాదము ఋగ్వేదమందే కలదు. (X. 95) అందు పురూరవుఁడు ఉర్వశిని వివాహార్థము ప్రార్థించును. విష్ణుపురాణమున కొన్ని వివరములు కనఁబడుచున్నవి. మిత్రావరుణులచే శప్తయై ఉర్వశి భూలోకమునకు వచ్చి పురూరవునివలచి కొన్ని నియమముల ప్రకారము ఆతని కడనుండ నంగీకరించెను. నియమము-ఉర్వశియొక్క రెండు మేషములను పురూరవుఁడు కాపాడుట, నిరంతరము ఉర్వశిని

ఎడఁబాయకుండుట, ఎప్పుడును నగ్నముగా ఆమెకు గోచరింప కుండుట, ఉర్వశి కేవలము నేతినే భుజించియుండుట కొప్పుకొనుట. కొంతకాలమునకు ఉర్వశిలేమిచే దేవతలు వెతఁజెంది మరల నామెను దివికి రప్పింపఁగోరిరి. విశ్వావసువు గంధర్వులతో నొకరాత్రి ఉర్వశీశయనాగారమును ప్రవేశించి ఆమేషములను హరింపఁబోఁగా నవి అఱచుటచే ఉర్వశీ పురూరవులు మేల్కొని విశ్వావసువును గంధర్వులను వెంబడించి మరల మేషములను తెచ్చుకొనిరి. మెఱుపులచే నీ సందడిలో వస్త్రహీనుఁడుగా త్వరచే వచ్చిన పురూరవుంజూచి నియమోల్లంఘనమైనదని ఉర్వశి ఆతని వదలిపోవును. దుఃఖముచే పురూరవుఁడు దేశములు సంచరించి తుదకు కురుక్షేత్రమునందుచూచి ప్రార్థింపఁగా సంవత్సరమునకు ఒకదినము ఆతనితో నుండుటకు ఉర్వశి ఒప్పుకొనెను. కాని శాశ్వతముగా ఉర్వశిని తానేపొందఁగోరి గంధర్వులను ప్రార్థింపఁగా వారొక అగ్నిస్థాలినిచ్చి దానిచే నిరంతరము సేవించుచుండిన ఉర్వశి అతనికి దక్కుననిరి దారిలో నాతఁడు విసుగుఁజెంది ఆస్థాలిని ఒకచోట పాఱవేసిపోయెను. మరల పశ్చాత్తప్తుఁడై పోయిచూడఁగా అచ్చట అశ్వత్థ శమీ వృక్షములు మొలచియుండుటనుచూచి వానిలోనుండి చెఱియొకకొమ్మను కొనిపోయి పెక్కుయజ్ఞములుచేసి మరల ఉర్వశిని శాశ్వతముగా పొందెను. తర్వాత వారలకు ఎనమండ్రు పుత్త్రులుదయించిరి.

కథాసరిత్సాగరమున నిట్లు కలదు—పూర్వము నందనవనమున ఉర్వశి విష్ణుభక్తుని పురూరవునిచూచి కామించెను. రాజును ఆమెయందు ఆసఁగొనెను. మహావిష్ణువంతట నారదునిపంపి

ఊర్వశిని పురూరవునికొసంగ దేవేంద్రుని కోరెను. ఇంద్రుఁడు అంగీకరించిపంపఁగా ఊర్వశీ పురూరవులు సుఖముండిరి. ఇంతలో మాయాధరుఁడను రాక్షసునితో ఇంద్రునికి యుద్ధమురాఁగా పురూరవుఁడుపోయి అసురులను జయించెను. విజయోత్సవ సందర్భమున రంభ నృత్యమొనరించుచుండ చూచి దోషమును కనిపట్టి పురూరవుఁడు ఇంచుకనవ్వెను. రంభ కోపగించి మనుష్యునికి నీకు దేవనృత్యమేమి తెలియునని ఆక్షేపింపఁగా, ఊర్వశీసహవాసముచే తనకు తుంబురునికన్నను విశేషము తెలియునని ఆ రాజు బదులుచెప్పెను అంతట తుంబురుఁడు కోపగించి మహావిష్ణువును తృప్తిఁబఱచునఁటకు ఊర్వశీవియోగము పురూరవునకు కలుగునట్లు శపించెను. అంతట రాజు బదరికాశ్రమమున మహావిష్ణువును తపస్సుచే ప్రసన్నునిచేసికొని మరల ఊర్వశిని పొందెను.

మత్స్యపురాణకథ – కాళిదాసీయమునకు చేరువుగానున్నది. పురూరవుఁడు అనుదినము ఇంద్రదర్శనమునకు ఏగుచుండెను. ఒకప్పుడు ఊర్వశీ ఘృతాచులను కేశిదానవుఁడు పట్టుకొనిపోఁగా వాయవ్యాస్త్రముచే వానినికొట్టి వారిని విడిపించి ఇంద్రునికి ప్రియమాచరించెను. అది మొదలు ఇంద్రునికి ఎక్కుడు స్నేహితుఁడాయెను. ఒకప్పుడు లక్ష్మీస్వయంవరమను నాటకమును భరతమహర్షి ఆడించుచుండగా పురూరవుఁడు చూచుచుండెను. అతనింజూచుచు ఊర్వశివలపుచే పాఠమెల్లమఱచి ఆటను పాడుచేయగా ఏబదియైదేండ్లు లతగానుండుమనియు అచటనే పురూరవుఁడు పిశాచముగానుండుననియు ఆచార్యుఁడు ఆమెను శపించెను తర్వాత ఊర్వశి పురూరవునింజేరి ఎనమండ్రుగురు కుమారులను కనెను.

ఈకథయే కాళిదాసుని నాటకకథకు చేర్పుగా నున్నది. కేశిదానవుఁడు ఇందునుకలఁడు. వానిని పురూరవుఁడా కొట్టినది వాయవ్యాస్త్రముతోనే. ఘృతాచికిబదులు చిత్రలేఖను కాళిదాసు పెట్టినాఁడు. చిత్రరథుఁడు, గంధర్వరాజు క్రొత్తపాత్ర. నారదుఁడు ఇందుకొంత పనిచేయును. కథాసన్నివేశములలో కొంతమార్పుకలదు. ఊర్వశీ పురూరవుల యనురాగము రథములో సాహచర్యముచే నేర్పడుట మనోహరము. లక్ష్మీస్వయంవర నాటకమును ప్రదర్శించునపుడు పురూరవుఁడు లేఁడుగాని పరధ్యానముగా నూర్వశి పురుషోత్తముఁడనుటకుబదులు పురూరవుఁడనుట చాల ఒప్పియున్నది. గురువర్యునిశాపము వేఱు తీరుగానున్నది—దివ్యత్వము మాత్రమే తప్పుట. ఇంద్రుఁడు పురుషాంతరవేది గావున, రాజునకు పుత్రదర్శనమగునందాక అతనికడనుండుమని కనికరము చూపును. ఈశాపము లాభకారియేయైనది. కుమారవనమున విహారమును కుమారశాపముచే ఊర్వశి లతగామారుటయు సంగమనీయమను మణిచే పునస్సమాగమమును, ఆయువు జనించుట, అతఁడు యుక్తవయస్కుఁడగు వఱకు చ్యవనాశ్రమమున సత్యవతికడ ఎదుగుటయు, గ్రద్దను కూలనేసినమిషచే రాజుకడకువచ్చుటయు, ఊర్వశి తనకుశాపము తీరినదని శోకించుటయు, ఇంద్రుఁడు మరల దేవాసుర సంగ్రామమునకు సహాయముచేయుటకై ఊర్వశిని స్థిరముగానే పురూరవునికిచ్చి వేయుటయు—అంతేయు చాల సహజముగా నేర్పడిన విషయములవలె కనఁబడుచు మనోహరముగా నున్నది. ఇట్టి కల్పన కాళిదాసునకేగాని అనితరసాధ్యమని తలపించుచున్నది.

నాటకమందలి స్త్రీపురుషుల విమర్శ.

పురూరవుఁడు కథానాయకుఁడు, చంద్రుని పౌత్రుఁడు బుధుని కుమారుఁడు, సూర్యుని దౌహిత్రుఁడు, షట్చక్రవర్తులలో నొకఁడు, మధ్యమలోకపాలకుఁడు. "యమునతో కూడడంచేత విశేషపావనములైన భాగీరథీ భగవతి నీళ్లలో తన్నుతాను చూచుకొంటూవున్న ప్రతిష్ఠానగరము ఈతని రాజధాని. ఇది "స్థానాంతరమైన స్వర్గము." "పోరు ఆసన్నమైనప్పుడు మహేంద్రుడు మధ్యమలోకంనుంచి ఈయననే సగౌరవంగా రప్పించి విజయసేన మొనలో నియోగిస్తాడు" ఆ రాజర్షి రథము సోమదత్తము, లేడిజెండాతోటిది "అతడు పోయినపనిని సాధింపక మరలడు." "మహేంద్రునితో సమానుడైన రాజర్షి" "వేల్పుల మీఁద పక్షపాతంగలవాఁడు. ఆకాశగమనంగలవాడు" ఇంద్రుని కడకు స్వయముగావచ్చి ఉర్వశిని అప్పగింపుమని చిత్రరథుఁడు కోరఁగా నిరాకరించెను కారణము ఇంద్రుఁడు చేయు మర్యాదలపై ఆశ లేకపోవుటయే. మహేంద్రుని ఉపకరించుటకు చాలిన పరాక్రమముండియు గర్వము లేనివాఁడు. 'ప్రియకళత్రుఁడు.' ఇతని వాక్కు 'నాణెము'గానుండును. ఉర్వశిపై ప్రథమ దర్శనముచేతను రథమందు స్పర్శచేతను అనురాగముదయించును. ఉర్వశియు తన యనురాగమును ప్రకటించుటచే నిది బలిష్ఠమగును. విదూషకుఁడు ఓదార్పుఁగా ఆతనియందు గౌరవమును చూపి 'బ్రాహ్మణవచనమును ప్రతిగ్రహించు'ను. ఉర్వశిమీఁద ఎంత వలపుండినను 'ఏలిక యానకు అడ్డుపడువాఁడు' కాఁడు, ఏలన ఉర్వశి నాటకమాడుటకు పోవలసివచ్చినప్పుడు అడ్డు చెప్పలేకపోయెను. కాని రాణియైన ఔశీనరియందు

గౌరవముగలవాఁడు. భూర్జపత్రము ఉర్వశీ స్వహస్తము రాణిచేతఁబడినప్పుడు రాజు రాణిని క్షమింప వేఁడును. రాణి కోపగించి వెడలిపోయిన వెనుక 'నీకిది అనుకూలమే' అని విదూషకుఁడు పలికినందులకు రాజు 'అట్లుగాదు. నామనసు ఉర్వశిని తగులుకొన్నను, నాకు దేవియందు ఆ యెప్పటిబహుమానమే. కాని నాప్రణిపాతమును అతిక్రమించి నది గావున నేను దేవివిషయమున ధైర్య మవలంబించెదను' అని బదులుచెప్పును. తర్వాత దేవి వ్రతమును ప్రారంభింపఁగా నది 'దేవి పశ్చాత్తాపంపొందినదై తన ప్రణిపాతపు ఉల్లంఘ నాన్ని వ్రతమిష చేత తుడిచివెయ్యడానికి కోరుతున్నది' అను విదూషకునిమాటను వాస్తవమని ఒప్పుకొనును దేవిని 'మహా నీయురాలు' అని పేర్కొనును. సాధారణముగా అన్యనాయి కలయం దాసక్తు లట్లుండరుగదా. 'ప్రేముడి ఒరులపాలయి నపుడు నాగరకులు అధికంగా దాక్షిణ్యముచూపుతారు' అని చిత్రలేఖ పల్కినను రాజునకు రాణియందు ఒకపాటి దాక్షి ణ్యము లేకపోలేదు. అట్లే ఉర్వశియందు ప్రేమయు తగ్గలేదు. దేవి పోఁగానే 'దేవి దూరముపోయియుండదు...మఱి ఉర్వశి యేమయినా' అని ఉర్వశిని తలంచును. ఉర్వశీసమాగమ ముచే చాల సంతోషించును. ఇంతటి గొప్పరాజర్షి గంధ మాదనవనమున విహరించుచున్న [illegible] "మిన్నేటి ఇసుకదిన్నె లలో క్రీడిస్తూ ఉన్న ఉదయవతి అనే విద్యాధరకన్యకను తేరిచూచినాఁడు" ఆపాటికే అలిగి ఉర్వశి 'కాంతుఁడు ఎంత బతిమాలుకొన్నా మెత్తబడక' కుమారవనముచొచ్చి తీగయై పోయినది ఆతఁడు ఆప్రియతమను వెదకుచు రేయుంబవలు

ఆవనమందు గడపి సంగమనీయముచే మరల ఊర్వశింబొంది తన రాజధానిం జేరును. ఇతనికి ప్రకృతులు అనుకూలురు. తుదకు సంగమనీయమును గ్రద్ధ తన్నుకొనిపోయి ఆ కారణముచే ఆయువు ఆశ్రమమును వదలుటయు ఊర్వశి తన్ను వదలి స్వర్గమునకు ఇంద్ర సేవార్థము పోవుటకు సంసిద్ధయగుటయు ననుపరిస్థితి యేర్పడఁగా పురూరవుఁడు తపోవనముఁ జేరుట కుద్యమించును. ఇంతలో నారదమహర్షి వచ్చి ఇంద్రసందేశమును తెలిపి పురూరవునికి శాశ్వతముగానె ఊర్వశి నొసంగును.

మాణవకుఁడు, విదూషకుఁడు; 'మహాబ్రాహ్మణుఁడు.' రాజునకు అనుచరుఁడు. నర్మసచివుఁడు. 'రాజరహస్యంచేత పైకి పిగులుచున్న' వాఁడై 'జనులుసిండినచోట తననాలికని కట్టివేసుకో' లేడు. "సన్నని గరికపోచకొననున్న మంచుబొట్టులాగ ఇతని నాలికలో రహస్యము చాలసేపు ఉండదు." "చెడుచేటినిచూడగానే ఆ రాజరహస్యము హృదయాన్ని భేదించుకొని వెడలు"ను. నిపుణికయు ఉపాయముగా రహస్యమును భేదించి వెడలును. రాజునుచూచినతర్వాత "రహస్యనిక్షేపమును కాచుచున్నావా" అని రాజడుగఁగా అప్పుడు ఆదాసి తన్ను మోసపుచ్చినదని తెలిసికొనును. రాజును వినోదపెట్టుటకు వంటయింటికి పొమ్మనును. ఇతనికి 'పంచవిధభక్ష్యాలని దానిదాని సంభారాలతో కూరుస్తూవుండడం చూస్తూవుంటే ఉత్కంఠ తీరుతుంది' ఎప్పుడుచు తిండిమీఁదనే దృష్టి. "మూఢుఁడు. అన్నిటను ప్రమాదియే" ఏలన రాజు దాఁచుటకిచ్చిన భూర్జపత్రమును గాలికి జారవిడుచును. దానిని రాజెప్పుడెప్పుడు అడుగునోయని దిగులొందును. రాజును విరహాతురుని నానా

సంభాషణలచే ఓదార్చుచుండును. రాణివచ్చి భూర్జపత్రమును చూపి రాజును నిందించునప్పుడు తన అవ్యక్తభాషణములచే రాజు దోషమునే వెలికివేయునుగాని వేఱేమియుచేయ సమర్థుఁడుగాఁడు. 'దొంగసొత్తుతో దొరికినదొంగకు ప్రతివచనం ఉంటుందా' అను నీమాటలచే నీతఁ డెంతబుద్ధిమంతుఁడో విస్పష్టము. అసందర్భముగా మాటలాడుచు నవ్వు పుట్టించుచుండును. నిరంతరము రాజు చెంతనేయుండి రాజును వినోదింపఁజేయుచుండును. ఈతనిమాటలచే రాజునకు ఉర్వశియందు ప్రేమ అభివృద్ధియగును.

ఊర్వశి 'నరసఖమునీంద్ర సూనుజ, నాకరమణి' అఋషి మహేంద్రునికి ఈమెను ఇచ్చెను. 'తపోవిశేషపరిశంకితుఁడైన మహేంద్రునికి కోమలాయుధము, రూపగర్వితయైన శ్రీకి గుండె తల్లడము స్వర్గానికి అలంకారము' కేశిదానవుఁడు పట్టుకొనినందున 'బిట్టు బెగ్గడిల్లినది' రాజు విడిపించినవెనుక చాల సేపటికి మూర్ఛతేరినది. మహేంద్రునితో సమానుఁడైన రాజర్షి తన్ను కాపాడెనని చిత్రలేఖ చెప్పఁగా ప్రౌఢనాయిక గావున రాజుపై ననురాగముంచి 'దానవులు నాకు ఉపకారంచేసినారు సుమా' అని తలంచును. రాజు మాటలనువిని 'ఇతనివాక్కు ఎంతనాణెముగానున్నది' అనియు చెప్పుకొనును. స్వర్వేశ్యగావున నీచేష్టితమెల్లను ఒప్పియున్నది 'తేరికుదుపుచేత' 'అంసమున అంసంబు' ఒరయుటయు ఉర్వశి చిత్రలేఖను 'ఓపరిల్లు'మనికోరఁగా చిత్రలేఖ 'నాకు శక్యంగాదు' అని చెప్పుటయు స్మితమును వేశ్యాజనసహజములుగా నున్నవి. శృంగారలజ్జచే ఉర్వశి తానే రాజుతోమాటలాడక చిత్రలేఖ.

మూలముగా మాటలాడుట రమణీయము; అనురాగస్ఫోరకము. గంధర్వులు మింటికెగయఁగా ఊర్వశియొక్క యేకావళి తీవకొమ్మను తగుల్కొనును. చిత్రలేఖచూచి చిఱునగవుతో 'దిట్టముగా తగులుకొన్నది. వదలింప నశక్యునితోస్తున్నది' అని భావగర్భితముగా చెప్పును. అనఁగా రాజుపై ఊర్వశిభావమును చిత్రలేఖ కనిపట్టినది. పోవునపుడు రాజునుగాంచి నిట్టూర్పు పుచ్చుచు నిష్క్రమించును. ఈమె వేశ్యగావున ఈవృత్తమెల్ల నీమెకు ఉచితముగానేయున్నది. అందుచేతనే ఊర్వశీ చిత్రలేఖలను రాజు విడిపించుకొని వచ్చినప్పుడు రంభాద్యప్సరసలు 'సచిత్రలేఖను ప్రియసఖ నూర్వశింతోడుకొని విశాఖాసహితుఁడు భగవంతుఁడు చంద్రుఁడువోలె రాజర్షి వచ్చినాడు' అని చెప్పుట. ఈతఁడు తర్వాత ఊర్వశికి భర్తకాఁగల విషయమును కూడ ఇది సూచించుచున్నది రాజు ఊర్వశీరాగాకృష్టుఁడై 'దుర్లభమందు తగులుకొల్పుచున్నాఁడు మన్మథుఁడు' అని తలంచును. తర్వాత రాజు ప్రమదోద్యానమందుండఁగా 'మదనుని నియోగముచేత' ఊర్వశియే, దివ్యగావున, బయలుదేరి పురూరవునికడకువచ్చును. పురూరవుని యాలాపమునువిని ఆతనికి భూర్జపత్రమందు మదనలేఖవ్రాసి తర్వాత ఆతనికగపడును. ఇంతలో భరతశిష్యుఁడు పిలుచుటచే నాటకప్రయోగమునకై ఇంద్రలోకమున కేగును.

లక్ష్మీస్వయంవరమను నాటకప్రదర్శనమందు పొరఁబాటున ఊర్వశి పురుషోత్తముఁడనుటకుబదులు పురూరవుఁడనుటయు నందుచే గురువు శపించుటయు ఇంద్రుఁడు శాపావసానము నను గ్రహించుటయు ఊర్వశికి అనుకూలములే యైనవి

ఊర్వశి మరల పురూరవునికడకు వచ్చినప్పుడు అతని రాణి ఔశీనరి, కాశిరాజపుత్రి, చెంత నుండెను. ఆమె రాజు ఉర్వశీలోలుఁడాయెనని ఎఱింగి తొలుత కోపగించినను తర్వాత ప్రియానుప్రసాదనమను వ్రతమొనరించి రాజును ఉర్వశికి వదలివేయుటచే ఉర్వశికి మరల మంచిదేయైనది; రాజుకును అనుకూలమే. ఊర్వశి రాజుకు ఔశీనరియందు అనురాగము మిక్కుటమని కొంత అసూయపడినను అసూయావిముఖముగా నిట్లు పలికినది–'ఈమె దేవీశబ్దము చేత ఉపచారమొందుట యుక్తమే. తేజులో శచికి ఏమాత్రము తక్కువపడదు' రాజు దేవిపై నభిమానముచూపినపుడు 'ఈమెయందు ఇతనికి బహుమానము మిక్కుటంగానున్నది' అని కొంత కష్టపడును. చిత్రలేఖ జవాబుచే శాంతించును. రాణి 'రాజు ఏ చెలువను కోరునో ఆ చెలువతో నేను ప్రేమబంధముతో వర్తింపవలయును' అని చెప్పినప్పుడు ఊర్వశి సంతోషాశ్చర్యముల పాలగును తర్వాత రాజునుపొంది యథేచ్ఛముగా కొంత కాలముండును.

రాజ్యభారమును మంత్రులమీఁదనుంచిన రతిసహాయుని ఆ రాజర్షిని తోడ్కొని ఊర్వశి విహారార్థమై గంధమాదనవనమున వెళ్ళినది. అచ్చట ఉదయవతియను కన్యను చూచినాఁడని రాజుపై అలిగినది. తర్వాత కాంతుఁడు ఎంతబతిమాలినను వినక స్త్రీలు చొరరాని కుమారవనమును చొచ్చి లతయైపోయినది. తర్వాత సంగమనీయమను మణిచే పునస్సమాగమము కలుగును. అప్పుడు సంతోషమున రాజుతో నగరికివచ్చును.

తర్వాత కొంతకాలమునకు ఊర్వశి గర్భముధరించును. గర్భలక్షణములు చూచుచుండియు రాజెఱుఁగలేదు. ఇంతలో

నాతఁడు నైమిశేయయాగ మొనరింపనేఁగఁగా ఈలోపల ఉర్వశి ప్రసవించి కుమారుని వెంటనే చ్యవనాశ్రమమున సత్యవతియను తాపసికడ నిల్లడయుంచి, రాజునకు ఈవిషయమే తెలియనీయక దాఁచెను. ఏలయన పుత్త్రముఖదర్శనము రాజునకాయెనేని వెంటనే ఉర్వశి పురూరవునివదలి ఇంద్రునికడ కేగవలసినట్లు నియమము. ఎంత కాలము పుత్త్రముఖదర్శనము రాజు చేయఁడో అంత కాలము మంచిది. ఇట్లు కొన్నిసంవత్సరములు గడచినయనంతరము ఆకస్మికముగా నొక విశేషదినమున రాజు గంగాయమునలకూడలిలో స్నానమాడి రాచగూడారము ప్రవేశించినవెంటనే సంగమనీయమను నామణిని సేవకులు తెచ్చుచుండఁగా గ్రద్ధ తన్నుకొనిపోవును. రాజు దానినేయఁబోఁగా నది దూరముపోవును. ఇంతలో చ్యవనాశ్రమమందలి ఋషికుమారులతో నేగియుండిన ఆరాజపుత్త్రుఁడు ఆయువు బాణముతో ఆగ్రద్ధనుకొట్టఁగా రాజభటులు మణినికొనిపోయి బాణముతోఁగూడ రాజునకిత్తురు. రాజు ఆబాణముమీఁదియక్షరములను చదువుకొని తనకుమారుఁడు పుట్టి పెద్దవాఁడైన విషయమును గ్రహించును. ఇంతలో చ్యవనాశ్రమమునుండి సత్యవతియేవచ్చి బాలుని అప్పగింపఁగా ఉర్వశి ఈయాకస్మిక సంభవములంజూచి విషాదమునందును. ఇంతలో నారదుఁడు రాజునకు ఇంద్రసందేశమునుచెప్పి ఉర్వశీ పురూరవులకు ఎడబాపులేకుండునట్లు చేయును. ఉర్వశిమాత్రము ఔశీనరిని మరచిపోలేదు. 'మీపెద్దమ్మకు నమస్కారముచేయుము' అని చెప్పును. తుదకంతయు సంతోషమే.

ఔశీనరి, కాశిరాజపుత్త్రి, రాణి. రాజు అన్యకాంతాసక్తుఁ డయినందున నీమెకు తొలుత స్త్రీజనసహజమైన ఈర్ష్య జనించినది. తర్వాత, పతివ్రతగావున 'ప్రియానుప్రసాదన' మను వ్రతమొనరించి రాజునకును ఉర్వశికిని స్వేచ్ఛావిహారమునకు అనుజ్ఞ నిచ్చెను. ఈమెయందు రాజునకు అభిమానము మిక్కుటము. 'తేజులో శచికి ఏమాత్రము తీసిపోదు' అని సవతి చేతనే చెప్పించుకొన్న గాంభీర్యవతి.

వేంకటరాయశాస్త్రులవారి

ఆంధ్రీకరణ ప్రకారము.

సంస్కృతాంధ్రములలో శాస్త్రులవారి పాండిత్యము సమగ్రము. పండితుఁడేగాక కవి. హాస్యరసము వంశక్రమాగతమైన ఆస్తి; పెట్టనిసొమ్ము, సహజము. 'హూణాణరూపకరసం బుదరంబు నిండారఁద్రావిన' రసద్రష్ట. ప్రతాపరుద్రీయాదినాటకములను నిర్మించిన రసస్రష్ట. లోకానుభవము సమగ్రము. వీనిచే నీనాటకమందు ఏర్పడినగుణములు—సాధుపాఠనిర్ణయము, మూలానుసరణము, అర్థసౌలభ్యము, పాత్రోచితభాష అనునివి.

సాధుపాఠనిర్ణయమువిషయమున, అలవడిన సంస్కృత వ్యాఖ్యలును, ఊహయు నాధారములు. ఇది విశేషముగా ప్రత్యేకవ్యాసముచే తెలుపఁదగిన విషయము. ఇంటర్మీడియేటు విద్యార్థుల కనవసరము. ఆయాశ్లోకములలోను పాత్రభాషితములలోను కవిహృదయమునుగుర్తించి ఔచిత్యము ననుసరించి సాధుపాఠమును నిర్ణయించుకొని అనువదించినారు. మూలానుసరణము చాల ముఖ్యమైనది. కాళిదాసుశ్లోకములలో చెప్పిన

భావములను పోనీయక ఆయాపదములలో మహాకవి ఏయే భావములను ఎట్లెట్లు పొందుపరచినాఁడో ఆస్వాద్యరస్యము వచ్చునట్లుగా శాస్త్రిగారు అనువదించినారు. అక్షరమక్షరమును మూలమునకు సరివచ్చునేగాని ఎచ్చటను తు. చ. తప్పదు. అర్థసౌలభ్యమువిషయమున నాటకమే ప్రమాణము. చదువరులకు, ఒకపాటిజ్ఞానము గలవారికి పద్యములు సులువే. ఈపద్యములలో శాస్త్రులవారు ప్రబంధముల ధోరణిం బాటింపక నాటకశైలిని అనుకరించినారు. అనఁగా పద్యములు పాత్రభాషితములు, నేరుగా మాటలాడిన ట్లుండవలయును గాని ఎవరో చెప్పిన ట్లుండరాదు. పైగా సంస్కృతశ్లోకమందలి భావగాంభీర్యమును పదప్రయోజనమును రావలయును. ఈ రెండంశములను మనస్సునసుంచుకొని పద్యములను చదివిన రసవంతముగానుండును. పాత్రోచితభాషలో శాస్త్రులవారి ప్రతిభ గోచరించును. పాత్రోచితభాష యననేమో మన పండితులకును కవులకును 1891-వ సంవత్సరమునకుముందు తెలియదు. ఆసంవత్సరము శాస్త్రులవారు నాగానందనాటకము నాంధ్రీకరించి సంస్కృతమూలములో ఉన్నట్లే ఉత్తమపాత్రలకు మంచిభాషయు, నీచపాత్రలకు అధమభాషయు, మధ్యమపాత్రలకు వారివారికి తగినట్లు భాషాభేదములనుచూపి ప్రకటించిరి. ఇది ఎంతయు మనోహరము. నాటకము దృశ్యకావ్యము; ఆడఁగా చూడఁదగినది. లోకవృత్తానుకరణము. అందఱును ఒకేవిధమైన భాషను మాటలాడుట అసహ్యము. పండితులు శాస్త్రులవారి పద్ధతికి సంతోషింపక 'గ్రామ్యశాస్త్రి' యని ఆక్షేపించిరి. వారిని తలఁద్రొక్కునట్లు 1896 లో శాకుంతలము నాంధ్రీకరించి 1897 ప్రతాప

రుద్రీయమునే రచించిరి. ఆతర్వాత ఆంధ్రకవిపండితసంఘము వారు శాస్త్రులవారి పాత్రోచితభాషను పనికిరాకుండ చేయవలయునని సభలు చేయఁగా ఆసభలలో శాస్త్రులవారు తమమతమే సరియైనదని పండితులకందఱకు మెచ్చఁజెప్పిరి. అదిమొదలు (1901) పాత్రోచితభాష ఆదరణీయమైనది. (విస్తరము శాస్త్రులవారి జీవితచరిత్రసంగ్రహమున చూ.) ఈనాటకమున విదూషకునివాక్యములు గ్రామ్యము. రాజాది పరిశుద్ధము ఉర్వశీ చిత్రలేఖాదులు ఉత్తమగ్రామ్యమును మాటలాడుదురు. నీచగ్రామ్యమున కిందు తావు లేదు.

ప్రకాశకులు.

శ్రీ

ఆంధ్ర - విక్రమోర్వశీయము.

శా. ఏనిం జాటుదు రోదసీభరితుఁ డానేకాత్ము వేదాంత, మో
హ్వానిం జెందెడి నీశ్వరాఖ్య యితరాప్రాప్తంబు సార్థారమై
ధ్యానింతు ర్మును లెవ్వనిన్ నియమితప్రాణాదులై ముక్తికై
తా నిశ్శ్రేయస మిద్ధభక్తివశుఁ డాస్థాణుండు మీ కిచ్చుతన్.

ప్రస్తావన.

నాంద్యంతమున

సూత్రధారుఁడు—అతివిస్తరము వలదు. [నేపథ్యము వైపు చూచి] మారిషా, ఇటు రావోయి.

[పారిపార్శ్వకుఁడు ప్రవేశించును.]

పారిపార్శ్వకుఁడు—వచ్చితిని బావా.

సూత్ర.—మారిషా, ఈ సభవారు పూర్వకవుల ప్రయోగబంధములను పెల్లుగా చిత్తగించియున్నారు, కావున, నే నిపుడు విక్రమోర్వశీయ మనెడి యపూర్వనాటకమును ప్రయోగించెదను. అందులకై పాత్రవర్గమును తమతమ పాత్రములయందు అప్రమత్తులుగా సిద్ధపడవలసిన దని హెచ్చరింపుము.

పారి.—బావ యాజ్ఞాపించినట్లు.

[అని నిష్క్రమించును.

సూత్ర.—ఇదె యిపుడు ఆర్యమిత్రులకు విన్నవించు కొనుచున్నాను. [ప్రణమిల్లి]

తే. ప్రణయవంతులమీఁదదక్షిణత నేని,
వస్తుపురుషులపై గౌరవమున నేని,
అవధరింపుఁడి సావధానాత్ములగుచుఁ,
గాళిదాసగ్రథితరూపకమును దీని. 2

[నే ప థ్య ము న]

కావరయ్యా కావరయ్యా! వేల్పులమీద పక్షపాతం గలవాడుగానీ, ఆకాశగమనం గలవాడుగానీ, కలడేని.

సూత్ర.—[చెవి యొగ్గి] ఏమి యిది! నేను విన్నపము చేసికొన్న వెంటనే గౌరవంక కొమ్మలరయుం బోలె ఆకసము నుండి నాదము వినఁబడుచున్నది! [ఆలోచించి] కానీ, తెలిసినది:—

తే. నరసఖమునీంద్రునూరుజ నాకరమణి
విత్తపునిమోలి *నాడి నివృత్తయగుడు,
నరపథమున నమరారు లాఁకఁగొనఁగ,
శరణుకై కుయి వెట్టు నచ్చరలగణము. 3

[అని నిష్క్రమించును.

ప్రస్తావన ముగిసినది.

---

*ఆడి - "కైలాసనాథ ముపసృత్య" అని పా. మదూహితము.

ప్రథమాంకము

[అంతట అప్సరసలు ప్రవేశింతురు.]

అందఱు.—కావరయ్యా కావరయ్యా! వేల్పులమీద పక్షపాతంగలవాడుగానీ, ఆకాశగమనం గలవాడుగానీ,కలడేని.

[అంతట రథము చేత రాజును సారథియు (అపటీక్షేపమున) ప్రవేశింతురు.]

రాజు.—మొఱ యిడవలదు, మొఱ యిడవలదు! సూర్యోపస్థానమునుండి మరలిన నన్ను పురూరవునిఁ దఱి యుండు; ఎందువలననుండి మిమ్ముఁ గావవలయునో చెప్పుఁడు.

రంభ.—అసురదర్పమునుంచి.

రాజు.—ఏమీ! అసురదర్పము మీకు ఎగ్గుచేసినదా?

మేనక.—అవధారు మహారాజా! ఎవతె తపోవిశేష పరిశంకితుడైన మహేంద్రునికి కోమలాయుధమో, రూపగర్వితమైన శ్రీకి గుండెతలడమో, స్వర్గానికి అలంకారమో, ఆ మా ప్రియసఖిని ఊర్వశిని కుబేరాస్థానినుంచి మరలవస్తూవున్న దాన్ని చిత్రలేఖాద్వితీయను హిరణ్యపురవాసి కేశి యనే దానవుడు ఆకస్మికంగాచూచి చెఱబట్టుకొనిపోయినాడు.

రాజు.—ఆజాల్ముఁడు ఏదిగ్విభాగమువైపు పోయినాఁడో ఎఱుఁగుదురా?

సహజన్య.—పూర్వోత్తరంవైపు.

రాజు.—అటయిన దిగులు మానుఁడు. మీసకిని తె
చ్చుటకు యత్నించెదను.

అచ్చరలు.—సోమునినుంచి ఒకటే ఎడమువాడ వైన
నీయంది దేమి యాశ్చర్యం?

రాజు.—నన్ను మీరు ఎచట ఎదురుసూచుచుండెదరు?

అచ్చరలు.—ఇదె యీ హేమకూటశిఖరముమీద.

రాజు.—సూతుఁడా! ఐశానదిక్కునకు గుఱ్ఱములను
వడి గొలుపుము.

సూతుఁడు.—ఆయుష్మంతునియాజ్ఞ.

[అని అట్లు చేయును.

రాజు.—[రథవేగమును రూపించి] బళిబళి! తేరు
పోవుచున్న యీవేగముచేత నేను ముందు తరలు గరుత్మంతుని
సయితము కలసికొనఁగలను. మఱి యీయింద్రాపకారిమాట
చెప్పవలయునా? అట్లే గదా.

చ. పొడిపొడి యాచుఁ దేరిమును
పోవు దుమారము వోలె మేఘముల్,
అడరెడినో యరిభ్రమి న
రాంతరపంక్తి యరాంతరంబులన్,
నిడివిగఁ జిత్రముల్బలె వి
నిశ్చలముల్ హయమౌళిఁ జామరల్,
పడగ చెలంగు యష్టితుదిఁ
బ్రాంతమునన్ సరి గాలితీవ్రతన్. 4

[రథముతో రాజును సూతుఁడును నిష్క్రమింతురు.

రంభ.—ఓసే, ఆరాజర్షి వెళ్ళినాడు. ఆ నిర్దిష్టప్రదేశానికే పోదాము రండి.

ఇతరలు.—సఖి, అట్లే చేతాము.

[అని అందఱు శైల మెక్కుట నభినయించి నిలుతురు.

రంభ.—ఆరాజర్షి మనహృదయశల్యాన్ని వెలువరించునా?

మేనక.—నీ కేల సంశయం? పోరు ఆసన్న మయినప్పుడు మహేంద్రుడు మధ్యమలోకంనుంచి ఈయననే సగౌరవంగా రప్పించి విజయసేనమొనలో నియోగిస్తాడు గదా.

రంభ.—తప్పకుండా యిపుడు విజయం పొందును గాక.

సహ.—[క్షణమాత్ర ముండి] ఓసి, ఊరడిల్లండి ఊరడిల్లండి. ఇదుగో నిగుడుతున్న లేడిజండాతోటిది ఆరాజర్షి రథము సోమదత్తము కనబడుతున్నది. అతడు పోయినపని సాధించక మరలడు గదా.

[అందఱు పైకి కన్నులెత్తి చూచుచున్నారు.

[అంతట రాజు, సూతుఁడును, చిత్రలేఖావలంబితహస్తయగు నిమీలితాక్షి ఊర్వశియు ప్రవేశింతురు.]

చిత్రలేఖ.—ఊరడిల్లు ఊరడిల్లు ప్రియసఖీ.

రాజు.—

తే. తొలఁగె భీరుక, సురరిపువలనిభయము,
వజ్రిమహిమ జగత్త్రయావనము గాదె?

కానఁ దెలివు వెడంద యాక్రాలుగన్ను,
నళిని ప్రత్యూషమున మహోత్పలముఁ బోలె. 5

చిత్ర.—అయ్యో! ఉచ్ఛ్వాససంమాత్రమే జీవచిహ్నంగా వున్నది! ఈమెకు ఇంకనూ చైతన్యం రాకున్నది;

రాజు.—మీసకి బిట్టు బెగ్గడిల్లినది. అట్లే గదా.

క. విడువద యిప్పటికి నదరు
పడఁతియెదను గుసుమసదృశబాధనమును, దె
ల్పెడి స్తనమధ్యోచ్ఛ్వాసిత
నడరెడుహారిచందనద్రవాంకము దీనిఁ. 6

చిత్ర.—ఒసే! మనస్సు నిబ్బరంచేసుకోవే, అచ్చరలంగ తోచకున్నావే! [ఊర్వశి తెలివిపొందును.

రాజు.—కోమలీ, నీచెలి మూర్ఛఁదేరుచున్నది. చూడు.

తే. శశి పొడవఁ జీకటి యడంగు నిశయుఁ బోలె,
సాంద్రధూమం బణఁగిన శాగ్నిజ్వాల వోలె,
లోనిమూర్ఛ యెడలుచుండఁ జాన దోఁచు
గట్టురిలినఁ గలఁగి తేరు గంగ వోలె. 7

చిత్ర.—సకీ, దిగులు మానవే. ఆవేల్పులపగతురు హతాశులు పరాహతులైనారుగదా.

ఊర్వశి.—[కన్నులు తెఱచి] మహేంద్రుడేమయినా తనప్రభావాన్ని చూపించినాడా!

చిత్ర.—మహేంద్రుడు గాడు, మహేంద్రునితో సమానుడైన యీరాజర్షి.

ఉర్వశి.—[*తన్నుం జూచుకొని, ఆత్మగతము] దానవులు నాకు ఉపకారం చేసినారు సుమా.

రాజు.—[ప్రకృతిస్థను ఉర్వశిని నిర్వర్ణించి, స్వగతము] అచ్చర లందఱును నారాయణఋషిని వలపింప వచ్చి అతనితొడనుండి జనించిన యీరమణిని గాంచి సిగ్గు చెందుట యుక్తమే సుమా. అట్లన నేల, ఈరూపము తాపసునిసృష్టి యనఁదగినదిగాదు. అట్లు గదా—

ఉ. పైదలిఁ జేయ నయ్యె విధి
      ప్రాప్తమహోజ్జ్వలకాంతి చంద్రుఁడో?
   ఆదిరసైకకంద మగు
      నయ్యసమాస్త్రుఁడో? పుష్పమాసమో?
   వేదజడుండు ప్రాఁదపసి
      వీతసమస్తకుతూహలుం డెటుల్
   శ్రీ దొలఁకఁగ మనోహరముఁ
      జేయఁగ నేర్చెడి నిట్టిరూపమున్. 8

ఉర్వశి.—చెలీ, ఆ సఖీజనము ఎక్కడ ఉండును.

చిత్ర.—అభయ మిచ్చినమహారాజె తెలుగును.

రాజు.—[ఉర్వశిని గాంచుచు] మిక్కుటపు నెగులులో నున్నది. నీవే యూహింపుము.

తే. సైర్వరముగ నీవు భామ, యవంధ్య మైన
   యెవని కనుమోడ్పుల నొకపరి యేని నిలుతొ,
   నిన్నడయ లేక యాతఁడే నెగులుఁ జెందఁ,
   జెలుల స్నేహారసార్ద్రతలఁ జెప్ప నేల? 9

---

* పా. రాజుంజూచుచు.

ఊర్వశి.—[అపవారించి] ఇతనివాక్కు ఎంత నాణెముగా నున్నది! కాకేమి! చంద్రునివల్ల అమృత మన్న ఆశ్చర్యమేమి? [ప్రకాశము] కనుకనే చూడడానికి నా హృదయము తమకపడుతూ ఉన్నది.

రాజు.—[చేతితో చూపుచు]

క. నీమొగముం జూచెద రిదె
కోమలి, నీచెలులు హేమకూటస్థలతలై,
గాముం బాసినరాతిరి
సామిం బ్రత్యాగతప్రసాదం బోలెన్.

[అని ఊర్వశిని సాభిలాషముగాఁ గనును.

చిత్ర.—సఖీ, చూడు.

ఊర్వశి.—[రాజును ఆసతోఁ గాంచుచు] సమదుఃఖత చేత నన్ను కన్నులతో త్రాగుతున్నట్లు తోచేని.

చిత్ర.—[సాకూతముగా] ఎవరు?

ఊర్వశి.—ఇదె ప్రణయిజనము.

రంభ.—[హర్షముతోఁ గాంచి] సఖి, సచిత్రలేఖను ప్రియసఖి నుర్వశినితోడ కొని విశాఖాసహితుడు భగవంతుడు చంద్రుడువోలె రాజర్షి వచ్చినాడు.

మేనక.—[చూచి] సఖి, మనకు ఇపుడు రెండు ప్రియములు. మన ప్రియసఖిని ఊర్వశిని తేవడమున్ను, మహారాజు అక్షతశరీరుడుగా కావడమున్ను.

సహజన్య.—సఖి, సరిగా చెప్పితివి. దానవులు దుర్జయులుగదా.

రాజు.—సూతుఁడా, ఇదే ఆకొండశిఖరము, రథమును డిగ్గ నడుపుము.

సూతుఁడు.—ఆయుష్మంతుని యాజ్ఞ.

[అని అట్లే చేయును.

రాజు.—[చక్రోద్ఘాతమును రూపించి, ఆత్మగతము]

ఆహా! రథము విషమముగా కొండమీఁద దిగుట నాకు ఉపకారమే అయినది.

ఆ. తేరికుదుపుచేత నీరథాంగశ్రోణి
రోమవిక్రియాభిరామముగను
అంసమున మదీయ మంసంబు నొరయుట
యించువిల్తుఁ డంకురించుట బలె! 11

ఉర్వశి.—సకి, కొంచె మట్లు ఓసరిల్లవే.

చిత్ర.—[స్మితముతో] నాకు శక్యం గాదు.

రంభ.—రండి రాజర్షిని సంభావింతము.

[అందఱు సమీపింతురు.

రాజు.—

తే. సూత, నిలుపుము రథము నిచ్చోట నిముసము,
ఉత్సుక లగుసకులతో సముత్సుకతను,
లతలతోఁ గూడ నా త్రవలక్ష్మి వోలె,
నీమదిరనేత్ర వెండి కూర్పనయుదాఁక. 12

[సూతుఁడు అట్లే చేయును.

రంభాదులు అందఱు.—ఆహా! మహారాజు విజయము చేత వర్ధిల్లుచున్నాఁడు!

రాజు.—మీరును మీసకి వచ్చుటచేత.

ఉర్వశి.—[చిత్రలేఖ కేలూఁత యియ్యఁగా తేరినుండి దిగి] సఖులారా, రండి, నన్ను గాఢంగా కౌఁగిలించుకోండి; మళ్ళీ సఖులముఖాన్ని చూస్తానన్న ఆశ నాకు లేకపోయింది గదా.

సత్వరముగా కౌఁగిలించుకొందురు.

రంభ.—తప్పకుండ మహారాజు నూర్లకొలది యేండ్లు భూమిని పాలించుచుండునుగాక.

సూతుఁడు.—ఆయుష్మంతుఁడా, తూర్పు దిక్కు నుండి మిక్కుటంపు రథవేగంపుశబ్దము వినఁబడుచున్నది.

క. డిగియెడి నెవ్వఁడో యీతఁడు
గగనంబుననుండి తప్తకనకాంగదుఁడై
నిగనిగని మెఱుపు లోలసెడి
జిగిమొగులుం బోలె నద్రిశిఖరంబునకున్. 13

[అచ్చరలు చూచుచుందురు.

అచ్చర లందఱు.—అహో! చిత్రరథుఁడు!

అంతట చిత్రరథుఁడు ప్రవేశించును.

చిత్రరథుఁడు.—[రాజును గాంచి గౌరవముతో] అహాహా! నీవు మహేంద్రుని ఉపకరించుటకుఁ జాలినపరాక్రమముతో వర్ధిల్లుచున్నావు!

రాజు.—ఓహో! గంధర్వరాజు! [తేరు డిగి] ప్రియమిత్రునికి స్వాగతము.

ఒండొరులచేతులం గైకొందురు.

చిత్రర.—కేశిదానవుఁడు ఊర్వశిని చెఱఁబట్టినాఁ డని నారదునివలన విని మహేంద్రుఁడు ఆమెను విడిపించుకొని రమ్మని గంధర్వసేనకు ముదలవెట్టినాఁడు. అంతట మేము మధ్యమార్గమున చారణులవలన నీజయోదాహరణమును విన్నవారమై ఇట నున్న నిన్నుఁ దర్శించితిమి. నీవును ఈమెను ముందిడుకొని మాతోఁగూడ దేవేంద్రుని దర్శించుట తగవు. మహానుభావునికి దేవేంద్రునికి నీవు మహత్తర మయిన ప్రియమును ఆచరించితివి గదా. చూడుము,

కం. మును పొసఁగెను నారాయణ
మునియీయమ్మతోఁ సహాయగఁ బురుహూతునికిన్,
దనుజునికయినుండి మోడిచి
యనుఁగుంజెలి నీ విపుడు సమర్పించితివే. 14

రాజు.—అట్లు గాదు.

తే. అశనిధరు తేజము గదయ్య యతనికిపుడు
నతనిపక్షమువారలు హతులఁ జేఁత;
భూమిధరకందరంబుల మ్రోఁగునట్టి
సింగపుం బ్రతిశబ్దంబు చెండుఁ గరుల. 15

చిత్రర.—ఇది యుక్తమే. గర్వము లేమి విక్రమాలంకారము గదా.

రాజు.—సఖుఁడా, నాకు శతక్రతుని దర్శించుటకు ఇది అవసరముగాదు. ఈమెగారిని నీవు ప్రభువుకడకుం గొనిపొమ్ము.

చిత్ర.—నీవు ఇచ్చగించినట్లు. [అచ్చరలనుగూర్చి] ఇటు ఇటు మీరు. [అచ్చరలు తరలుదురు.

ఉర్వశి.—[జనాంతికము] సఖి, చిత్రలేఖా, ఉపకారి నైనను రాజర్షిని ఆమంత్రింప నేరకున్నాను. నీవు నాముఖమవు గమ్ము.

చిత్ర.—[రాజును దఱిసి] వయస్యుడా, ఉర్వశి విన్నవిస్తున్నది. 'మహారాజుచేత అనుజ్ఞ పొంది యీ సఖిని బోలె మహారాజుకీర్తిని మహేంద్రుని లోకానికి కొనిపోవడానికి కోరుతున్నాను.' అని.

రాజు.—పోవుదుగాక, మరల దర్శనమునకు.

[స్త్రీలు అందఱు, సగంధర్వులు నింగికెగయుట నభినయింతురు.

ఉర్వశి.—[ఉత్పతనభంగము రూపించి] అహో! నా యేకావళి తీగకొమ్మకు తగులుకొన్నది. [వెనుకకు మరలి] చిత్రలేఖా, దీన్ని వదిలించు.

చిత్ర.—[చిఱునగవుతో] దిట్టముగా తగులుకొన్నది. వదిలింప నశక్యమని నాకు తోస్తున్నది. అయినా యత్నిస్తాను.

ఉర్వశి.—నీ వన్న యీమాట మఱచిపోకు.

చిత్రలేఖ వదలించుట నభినయించును.

రాజు.—[స్వగతము]

క. ప్రియ నైతి లతిక, నాకుఁ
బ్రియపయనమునకు నిమేషవిఘ్నము సేఁతన్;
నయనాంతేక్షణఁ గంటిని
బ్రియఁ బరివృత్తార్ధముఖిని వెండియుఁ గానన్. 16

సూతుఁడు.—ఆయుష్మంతుఁడా,

ఆ. వాసవునికి నెగ్గు సేసిన దైత్యుల
నుప్పుఁగడలిలోన సురల నైచి
మరలఁ జొచ్చె నీదు మారుతాస్త్రము పొదిఁ
గలుఁగునను మహోరగంబు మాడ్కి. 17

రాజు.— మఱి రథమును చేరఁ బట్టుము. ఎక్కెదను.
[సూతుఁడు రథమును చేరఁ బట్టును; రాజు నాట్యమున రథమును ఎక్కును; ఉర్వశి రాజును గాంచి నిట్టూర్పు పుచ్చుచు సఖితోఁగూడ నిష్క్రమించును. చిత్రరథుండును.

రాజు.— ఏమి యిది! దుర్లభమందు తగులుగొల్పుచున్నాఁడు మన్మథుఁడు!

తే. నా యొడలినుండి సుందరి నా మనమును
దండ్రి మధ్యమపదమునకై తా నెగయుచు
నాఁచికొనె రాజహంసి లూనాగ్రమైన
కమలనాళంబునుండి సూత్రమును బోలె. 18

అందఱు నిష్క్రమింతురు.

(ప్రథమద్వితీయాంకముల నడుమ)

ప్రవేశకము.

[అంతట విదూషకుఁడు ప్రవేశించును.]

విదూషకుఁడు.— హీహీహీ! నిమంత్రణైకపరవశుఁడయిన బ్రాహ్మణునిలాగు రాజరహస్యంచేత పైకి పిగులుచున్నవాఁడనై జనులు నిండిన యీచోట నానాలుకని కట్టివేసుకో

లేకున్నాను. కనక ఆయనగారు నా ప్రియవయస్యుడు కార్యాసనమునుంచి లేచేదాకా జనసంపాతము తక్కువగా వున్న యీవిమానపరిసరంలో ఉంటాను. పరిక్రమించి నిలుచును.

చేటిక. — ప్రవేశించి దేవీ కాశీరాజకూతురు నన్ను ఆజ్ఞాపించింది; "ఒసే నిపుణికా, సూర్యభగవానుని ఉపస్థానం చేసి వచ్చినప్పటినుంచి ఆర్యపుత్రుడు శూన్య హృదయుడుగా కనబడుతున్నాడు. కనక ఆయన ప్రియవయస్యుణ్ణి మాణవకయ్యని అడిగి ఆయనకి ఉత్కంఠాకారణ మేమో అడిగి తెలుసుకొనిరావే" అని. ఆ బ్రహ్మబంధుణ్ణి నే నేలాగ కంగిస్తాను? కంగించ కేమి? సన్ననిగరికపోచకొనసనున్న మంచు బొట్టులాగ ఇతని నాలికలో రహస్యము చాలసేపు ఉండదు. మఱి యితనినే వెతుకుతాను. పరిక్రమించి చూచి, ఇదుగో మాణవకయ్య కదలక మెదలక చిత్తరువులోని కోతిలాగ నిలుచున్నాడు. ఇతనికాడికి వెళ్తాను. [సమీపించి] అయ్యా, దండము.

విదూ. — నీకు మేలు కలుగునుగాక. ఆత్మగతము ఈ చెడుచేటిని చూడగానే ఆరాజరహస్యము హృదయాన్ని భేదించుకొని వెడలుతూ వున్నది. ప్రకాశము నిపుణికా, సంగీత వ్యాపారము మాని ఎక్కడికి వెడలినావు?

నిపుణిక. — అయ్యా, దేవిపంపున నిన్నే చూడడానికి.

విదూ. — దేవి యేమి ఆజ్ఞాపిస్తున్నది?

నిపు. — ఆర్యుడు ఎప్పుడున్ను నాయందు పక్షపాతి. నేను అనుచితవేదనచేత దుఃఖిస్తూ ఉంటే ఉపేక్షించడు.

విదూ. [సవితర్కము] నావయస్యు డేమయినా ఆమెకి ప్రతికూలం చేశినాడా!

నిపు.—అయ్యా, ఎవ తెనిమిత్తమె భర్త ఉత్కంఠితుడుగా ఉన్నాడో ఆమె పేర దేవిని పలకరించాడు.

విదూ.—[స్వగతము] స్వయముగానే ఆయనగారు రహస్యము వెలిబుచ్చినాడు. మఱి యిక నే నెందుకు నాలికని కట్టిపెట్టుకొని కష్టపడడము? [ప్రకాశము] ఏమి? దేవిని ఉర్వశీ అని పిలిచినాడా? ఆమెని చూచినందువల్ల ఆయన వేదురుగొని వినోదములు మానుకొని నన్ను కూడా మిక్కిలీ పీడిస్తూవున్నాడు.

నిపు.—[ఆత్మగతము ప్రభువుయొక్క రహస్యదుర్గాన్ని నేను భేదించితిని. [ప్రకాశము] అయ్యా, దేవికి ఏమి ఉత్తరం మనివి చేయను ?

విదూ.—నిపుణికా, ఆమెగారితో ఈలాగు విన్నపించు "నేనున్న వయస్యుణ్ణి ఎండమావులనుంచి మళ్ళించడానికి యత్నించిన తర్వాత దేవిముఖం చూస్తాను," అని.

నిపు.—అయ్యా చెప్పినట్టు చేస్తాను.

[అని నిష్క్రమించును.

[నేపథ్యమున వైతాళికుడు.]

ఉ. నీకును హేళికిన్ సరిగ
నెక్కొనె గార్యభరాధికారముల్,

లోకతమః ప్రవృత్తి ప్రజ
లోఁ బరిలూనము మీాకృతంబునన్;
ఏకనిమేష మాఁగును గ
హేశ్వరు డంబరమధ్యమంబునన్,
నీకును షష్ఠకాలమున
నీమది చొప్పున వర్తిలం దగున్. 19

విదూ.— (చెవి యొగ్గి) పిడుగో వయస్యుడు, కార్యాసనంనుంచి లేచి ఇటువైపే వస్తున్నాడు. ఇతనికి పార్శ్వవర్తిని అవుతాను. (అని నిష్క్రమించును.

ప్రవేశకము ముగిసినది.

ద్వితీయాంకము

[అంతట ఉత్కంఠితుండై రాజు ప్రవేశించును, విదూషకుఁడును.]

రాజు.—

క. **చూచియుఁ జూడక మున్నే**
నాచిత్తము నిర్జరాంగనామణి సొచ్చెన్,
ఏచి వలరాచపాదుష
హా చేసిననారసంపు ద్వారమున నసన్. 20

విదూ.—[ఆత్మగతము] పాపము కాశిరాజపుత్రి మిక్కిలి వెత జెందివున్నది.

రాజు.—రహస్యనిక్షేపమును కాచుచున్నావా ?

విదూ.—[విషాదముతో ఆత్మగతము] అయ్యో! అయ్యో! ఆదాసి నన్ను మోసగించినది! కాకపోతే వయస్యుడు ఈలాగు అడగడు.

రాజు.—[సాశంకము] ఏమి? నీవు బదులు చెప్పకున్నావు ?

విదూ.—ఈలాగు నీవు కూడా బదులుచెప్పనట్టుగా నేను నాలికని కట్టిపెట్టుకొని వున్నాను.

రాజు.—సరి. మఱి యిప్పు డెచ్చట ఆత్మను వినోద పెట్టుకొందును ?

విదూ.—వంటయింటికి వెళ్దాము.

రాజు.—ఏమక్కడ ?

విదూ.— అక్కడ పంచవిధభక్ష్యాలని దానిదాని సంభారాలతో కూరుస్తూవుండడం చూస్తూవుంటే ఉత్కంఠ తీరుతుంది.

రాజు.—[చిఱునవ్వు నవ్వుచు] అక్కడ ఈప్సితసంవిధానముచేత నీవు అలరుదువు. నాకోరిక తీరునట్టిది గాదు, నాకు అచట వినోద మేల కలుగును?

విదూ.—నీవు ఆమహానుభావురాలికి ఉర్వశికి కంటబడినావా?

రాజు.—అయిన నేమి?

విదూ.—అయినా, ఆమె దుర్లభ అని తలవనే తలవను.

రాజు.—పక్షపాతముచేత నిట్లు పలుకుచున్నావు.

విదూ.—నీవు ఇంత చెప్పినందున నాకు కుతూహలం కలిగినది. ఏమి? ఆభాగ్యవంతురాలు ఉర్వశి నాలాగు సురూపంలో సాటిలేనిదిగా వుంటుందా?

రాజు.—మాణవకుడా, ఆరమణిని ప్రత్యవయవ వర్ణన సేయుట అశక్యమని యెఱుంగుము. మొత్తముగా విను.

విదూ.—అవధానంతో వింటున్నాను.

రాజు.—

తే. భూషణమునకు మేలివిభూషణము, ప్ర
సాధనవిధికి మహితప్రసాధనంబు;
అమరసుందరివపువు పొంపారెడి నుప
మానమున కెల్ల ప్రత్యుపమాన మగుచు. 21

విదూ.—అందువల్లనే నీవు దివ్యరసానికి ఆశించినవాడవై చాతకవ్రతం గ్రహించినావు.

రాజు.—ఉత్కంఠితునికి విదిక్తముకన్న వేఱే శరణము లేదు. కావున నీవు ప్రమదవనమార్గము జూపుము.

విదూ.—[ఆత్మగతము] ఏమి గతి? [ప్రకాశము] ఇటు ఇటు. [పరిక్రమించి ఈ దక్షిణవాయువు ప్రమదవనము పంపున ఆగంతుకునికి నీకు ఎదురు వస్తున్నట్లు ఒప్పుతూ వున్నాడు.

రాజు.—[చూచి] ఈ వాయువునకు అభిశేషణము తగినదే. ఏలన,

ఆ. మాధవిని నిషేకమంజులం జేయుచు;
గొండ్లి నేరుపుచును కుందలతకు,
స్నేహదక్షిణతల నెఱపుచు నీతఁడు
కామి వోలె నాకుఁ గానఁబడెడి. 22

విదూ.—నీయభినివేశం కూడా ఇటువంటిదే అగుగాక. [పరిక్రామితకముచేత] ఇదే ప్రమదవనద్వారము. నీవు ప్రవేశించు.

రాజు.—నీవు ముందు ప్రవేశింపుము.

[ఇరువురును చొత్తురు.

రాజు.—[ఎదురం గాంచి] వయస్యుఁడా, ప్రమదోద్యానప్రవేశము నాయాపదకు ప్రతీకారమని నేను తలంచితినే, అది పొరఁబాటు.

క. కోరితిని నేను జొరఁ బ్రమ
దారామము; గాని, శాంతి యలరదు దానన్;
బోరన జక్కఁర కొని పో,
నేరి కయిన శక్య మగునె యెదు రీఁదంగాన్. 23

విదూ.—అదేలాగు?

రాజు.—

చ. దొరకనివస్తువున్ వలచి
నుండఁగ నైనమదీయచేతమున్,
మరుఁ, డర లేక, మున్నె, పరి
మార్చుచు నుండెఁ; మఱిప్పు డన్ననో,
తర మిడి పాండుపత్త్రముల
దక్షిణమారుత మూడ్చఁ, దోఁట నం
కురములఁ జూపఁ జాగినవి
క్రూరత మావు లిఁకేమి చెప్ప నా! 24

విదూ.—ఎందు కేడుస్తావు? త్వరలోనే అనంగుడే నీ యిష్టాన్ని సమకూర్చి నీకు సుఖము గలిగిస్తాడులే.

రాజు.—బ్రాహ్మణవచనమును ప్రతిగ్రహించితిని.

[పరిక్రమింతురు.

విదూ.—చూడవోయి నీవు వసంతావతారసూచకాన్ని ప్రమదవనముయొక్క సొంపును.

రాజు.—అంతటను చూచుచున్నాను, ఎట్లనిన నిట—

ఉ. శ్రీసఖపాటలాగ్రములు
కృష్ణము లౌనిరుపాళ్ళఁ గోరఁటల్,
కానఁగ నౌ భిదోన్ముఖము
గాఁగ నశోకముపోఘరాగమై,
మానగు నూత్నమంజరులు
మావి రజోలవపింగళాగ్రముల్,
పూనె వసంతలక్ష్మి సఖ,
ముగ్ధకుఁ బ్రౌఢకు మధ్యపాయమున్. 25

విదూ.—ఇదే బంతిగురివెందతీగమంటపము, నీకై స్వయముగా ఉపచారములు సిద్ధపఱిచిన దనే లాగ తేంట్లసమ్మర్ధంచేత రాలినపువ్వులతోడి మణిశిలాపట్టముగలదై, నిన్ను ఎదురుచూస్తూ వున్నది. కనక, దీనిని అనుగ్రహించు వయస్యుడా.

రాజు.—నీకు రుచించునట్లు చేసెదను.

విదూ.—ఇక్కడ నీవు సుఖంగా కూర్చుని, అందంపు లతలు నీ నేత్రాలను విందుగొల్పుతూ వుండఁగా, ఉర్వశిమీఁది నీయుత్కంఠను తీర్చుకో.

రాజు.—నిట్టూర్చి,

తే. జాతకుసుమలైన నను శ్యామలంగ
నమ్రవిటపలయం దిది నాదుదృష్టి
రతి భజింపద యాదేవరమణిరూపుఁ
గన్నకారణమున దుండగము వహించి. 26

కావున నాకోర్కె తీరునట్టియుపాయము నరయుము.

విదూ.—[నవ్వి] ఓయి, అహల్యాకాముకునికి ఇంద్రునికి సచివుడు వజ్రమున్ను ఉర్వశీలాలసునికి నీకు సచివుణ్ణి నేనున్ను ఇద్దఱము వెఱ్ఱులము.

రాజు.—అతిస్నేహముచేత కార్యమార్గముతోఁచును.

విదూ.—ఇదె ఆలోచిస్తాను, నీయేడ్పులచేత నాసమాధిని భంగపఱచకు. [చింతను రూపించును.

రాజు.—[నిమిత్తమును సూచించి, ఆత్మగతము]

తే. సకలశశిమండలాస్యయో సాధ్యగాదు!
ఇయ్యు మదనునిచేష్టిత మేమొ యేమొ!
ఐనఁ బ్రాఁతిత మభిముఖం బైనభంగి,
నున్నయట్లుండి నిర్వృతి నొందె మనము. 27

[జాతాశుఁడై యుండును.

[అంతట ఆకాశయానమున ఉర్వశియుం చిత్రలేఖయు ప్రవేశింతురు.]

చిత్ర.—సఖి, ఎక్కడికే కారణం లేకుండానే యీపోవడం ?

ఉర్వశి.—సఖి, అప్పుడు హేమకూటశిఖరాన తీవకొమ్మచేత నాయాకాశగమనము క్షణము విఘ్నముపొందగా నన్ను పరిహసించినదానవు, ఇప్పుడు ఈలాగు అడుగుతావేమి?

చిత్ర.-ఏమి? ఆరాజర్షి పురూరవునికడకు తరలినావా?

ఉర్వశి.—ఇది లజ్జను వంచించిన నాజతనము.

చిత్ర.—సఖి, ఎవరిని మరి ముందుగా పంపితివి?

ఉర్వశి.—నాహృదయమునే.

చిత్ర.—అయినా చక్కగా ఆలోచించు.

ఉర్వశి.—మదనుడు నన్ను నియోగిస్తున్నాడు, ఇకను ఆలోచన కేమున్నది?

చిత్ర.—ఇక నేను బదులు చెప్పలేను.

ఉర్వశి.—అట్లాయితే సఖ్యలో విఘ్నము కలగకుండా నాకు దారిచూపు.

చిత్ర.—సఖి, భయపడకు, భగవానుడు దేవగురువు అపరాజిత యనే ఆశిఖాబంధనవిద్యను ఉపదేశించి మనలని దేవవైరులకు అలంఘనీయులనిగా చేశినాడుగాడా?

ఉర్వశి.—అహాహా! నాహృదయము దాన్ని మఱచినది!

* (సిద్ధమార్గములోనికి వచ్చి) ఇరువురు భ్రమణము రూపింతురు.

చిత్ర.—ఇదిగో యమునతో కూడడంచేత విశేషపావనములైన భాగీరథీభగవతి నీళ్ళలో తన్ను తాను చూచుకొంటూ వున్న ప్రతిష్ఠానపురానికి శిఖాభరణ మయిన రాజగృహమునకు వచ్చితిమి.

ఉర్వశి.—[చూచి] చెలీ, స్థానాంతరగత మయిన స్వర్గము అని చెప్పవలెను. ఆయాపన్నశరణ్యుడు ఎక్కడ ఉండును?

చిత్ర.—నందనవనఖండమువంటి యీ ప్రమదవనంలో దిగి తెలుసుకొందాము. [ఇరువురు దిగుదురు.

చిత్ర.—[చూచి సంతోషముతో] సఖి, ముందుదయించిన చంద్రుడు వెన్నెలనుంబోలె ఇతడు నిన్నెదురు చూస్తున్నాడు.

ఉర్వశి.—[చూచి] సఖి, యిప్పుడు ప్రథమదర్శనమునకన్నా సాతిశయప్రియదర్శనుడుగా మహారాజు అవుపడుతున్నాడు.

చిత్ర.—యుక్తమే, కనుక రా, చెంతకు పోదాము.

ఉర్వశి.—తిరస్కరిణిచేత దాగి ఈయనచెంతనే ఉండి విందాముగానీ, ఈ యేకాంతంలో పార్శ్వవర్తియైన వయస్యునితో ఈయన ఏమిమాటలాడుతున్నాడో.

చిత్ర.—నీయిచ్ఛప్రకారము. [అట్లు చేయుదురు.

విదూ.—ఓయ్యోవు, ఆలోచించినానోయి నేను దొరకని ప్రియని పొందడానికి ఉపాయాన్ని. [రాజు ఊరకుండును.

ఉర్వశి.—ఎవతెగా నుండును ఆచెలువ, ఈయన్ని వలపుపాలుచేసి తన్ను పొగిడించుకొంటున్నది?

చిత్ర.—ఏమి మానుషవృత్తము నవలంబించితివి.

ఉర్వశి.—తటాలున ప్రభావంచేత తెలుసుకోడానికి భయపడుతున్నాను.

విదూ.—ఓయి, చెప్పుతున్నాను గదా ఉపాయమాలోచించితి నని.

రాజు.—అటయిన చెప్పుము.

విదూ.—నీవు స్వప్నసమాగమకారిణి యగు నిద్రను సేవించు. అటుగాకపోతే ఆమహానుభావురాలు ఉర్వశియొక్క పటము వ్రాసి చూస్తూ వుండు.

ఉర్వశి.—[సహర్షము] లఘుసత్త్వమా, హృదయమా, ఊరడి ల్లూరడిల్లు.

రాజు.—ఉభయమును నసిపడదు.

చ. అనయము కాముసంపఱకు
నయ్యె సశల్యము చిత్త, మెట్లుగా
నెనయుదు నిద్ర స్వప్నమున
నిందుముఖిన్ సమకూర్పునెచ్చెలిన్,
కనుఁగొనఁ జిత్రమం దయినఁ
గాంతను నోఁచన యగతి, నెట్లనన్,
మునుపడి యశ్రు లుబ్బి కను
ముంచెడి వ్రాఁత ముగింపనీయకే. 28

చిత్ర.—సఖి, నీవు విన్నావా ?

ఉర్వశి.—వింటిని, కాని, హృదయానికి తనివి తీఱకున్నది.

విదూ.—ఈపాటియే నా బుద్ధివిశేషము.

రాజు.—[నిట్టూర్చుచు]

చ. తెలియదొ దేవభామ యతి
తీవ్రము మద్హృదయాభిషంగమున్?

తెలిసియు శక్తిచేత నవ
　　ధీరణ సేయునో నాకుఁ గూరిమిన్?
లలనఁ గుఱించి తదయుఁ
　　లబ్ధఫలోదయనీరసంబులన్
గలయిక కోరుకాలం బెనిచి
　　కాముఁడు తా సుఖ మొందుఁ గావుతన్. 29

చిత్ర.—విన్నావా?

ఉర్వశి.—అయ్యో! అయ్యో! నన్ను ఇటువంటిదాన్నిగా భావిస్తున్నాడు! ఇతనియెదుట బడి బదులు చెప్పడానికి అసమర్థురాలినిగా ఉన్నాను. ప్రభావముచేత భూర్జపత్రము నిర్మించి అందులో దీనికి బదులువ్రాతామని కోరుతున్నాను.

చిత్ర.—నాకు సమ్మతమే.

[ఉర్వశి సంభ్రమముతో యథోక్తము గావించి ఆ శమ్మను వైచును.

విదూ.—[చూచి ఓ యమ్మో! ఓయి బాబో! ఇదేమిటి యిది? పాము కుబుసం లాగ మనయెదట పడినది?

రాజు.—[చూచి] భూర్జపత్త్రమందు అక్షరపంక్తులు.

విదూ.—కనబడకుండా ఉండి అనుహానుభావురాలు ఉర్వశి నీమాట ఆలకించి సమానప్రేమను సూచించే యక్షరాలు వ్రాసి, వేశి ఉండరాదా?

రాజు.—కోరికలకు అందరాని ఉండదు. [పుచ్చుకొని చదువుకొని హర్షముతో] సఖుడా! నీయూహా ప్రసన్నముగానే ఉన్నది.

విదూ.—నీవున్ను ప్రసన్నుడవు అవు. ఇందులోని వ్రాత వినగోరుతున్నాను.

ఉర్వశి.—బళ్ళీ, అయ్యా, నాగరకుడవయ్యా !

రాజు.—విను చదువును.

క. స్వామీ, సంభావించితి
వే మని నను నీవు తలఁతు, కే నట్లు లేనిఁ,
అమృదితకల్పతల్పము
నీమెయి నందనసమీర మేలా యేఁచుఁ. 30

ఉర్వశి.—ఇప్పుడు ఏమి చెప్పనో?

చిత్ర.—తామరతూండ్లలాగ అవుతూవున్న అవయవాలచేత చెప్పనే చెప్పినాడు గదా.

విదూ.—బళ్ళీ! ఆకలిగొన్న నాకు స్వస్తివాచనంలాగ నీకు ఓదార్పు దొరికింది.

రాజు.—ఏమి ! ఓదార్పనియా వచించెదవు?

మ. అనురాగంపుసమత్వ ముట్టిపడఁగా,
నర్థంపులాలిత్యముం
దనుకఁ, జేయసి యీయుదాహరణముఁ
దానింపఁ బత్త్రంబునఁ,
దనరెం బో మదిరాక్షిమోము యిది యు
త్ప్రేక్షంపునామోముతో
ననుషక్తం బయినట్టు లట్టముగ నా
కర్పించు చానందముఁ. 31

ఉర్వశి.—ఇందు మా ప్రీతి సమవిభాగములుగానున్నది.

రాజు.—వయస్యుఁడా, వ్రేళ్ళచెమరుచేత అక్షరములు చెడును. దీనిని ప్రేయసీ స్వహస్తమును పదిలముగానుంపుము.

విదూ.—[కైకొని] ఏమి మఱి ఆమహనీయురాలు ఉర్వశి నీకోరికలకు పువ్వుచూపి పండువిషయంలో కికురిస్తూ వున్నది !

ఉర్వశి.—సఖీ, సరసకు పోవడానికి భయపడుతూ వున్న నాహృదయాన్ని నేను కుదుటబడ జేసుకొనే లోపల నీవు ముందుగా ఆయనకు అగపడి నాకై తగిన మాటలు పలుకవే.

చిత్ర.—అట్టే. [అని తిరస్కరిణిని మాని రాజును దఱిసి] జయము జయము మహారాజునకు.

రాజు.—[సహర్షము] స్వాగతము నీకు కల్యాణీ,

క. చెలితోఁ గనఁబడుదానవు
చెలిఁ దేరక యుంత ప్రీతి సేయవు నాకుఁ,
అలకూడలిలోఁ జూచిన
కళిందభవ గంగ లేక కనఁబడినగతిఁ. 32

చిత్ర.—తొలుత మబ్బుబారున్ను తర్వాత మెఱుపు తీగానున్ను గదా అగుపడును.

విదూ.—[అపవారించి] ఏమి ! ఈమె ఉర్వశి కాదా? ఆమహానుభావురాలికి సహచరియైన నెచ్చెలియా ?

చిత్ర.—ఉర్వశి మహారాజును శిరస్సుతో ప్రణమిల్లి విన్నవిస్తున్నది.

రాజు.—ఏమి ఆజ్ఞాపించుచున్నది?

చిత్ర.—"నాకు రక్కసునివల్ల కలిగిన యిక్కట్టులో మహారాజే శరణమాయెను. ఆనేను నీదర్శనమువల్ల ఏచిన మన్మథునిచేత మిక్కిలి బాధపడుచుండగా మళ్ళీ మహారాజే కనికరించవలసినదానిగా నున్నాను." అని.

రాజు.—భద్రముఖి,

తే. పలికెదవు ప్రియదర్శనబాళి నీవు,
అరయవు పురూరవసునిఁ దదర్థ మాస్తు;
మరుని కిది మాయిరువురయుమ్మడి ప్రణయము
తప్త మగునిన్ను సుఘటంబు తప్తమునకు. 33

చిత్ర.—[ఉర్వశిని దఱిసి] సఖీ, రావే, నీమీఁదికంటె మదనుడు ప్రియవయస్యుడిమీఁద క్రూరంగా వుండడం చూచి, నేను ప్రియవయస్యునిదూతినై నీకడకు వచ్చినాను.

ఉర్వశి.—[తిరస్కరిణిని తొలఁగించి] అహాహా! ఎంతలో నన్ను వదలివేసితివి!

చిత్ర.—ఇక ముహూర్తములో తెలుస్తుందిలే, ఎవరు ఎవరిని వదలుతారో. ఆచారమును జరుపు.

ఉర్వశి.—[లజ్జతో] జయము జయము మహారాజునకు.

రాజు.—సుందరీ,

తే. జయమనంగ నాదె, యేనీదుజయపదంపుఁ
బ్రాప్తి లేదో సహస్రాక్షునకన్నఁ బెఱుకు,
అజయపదంబు మోదమానాత్మ వగుచుఁ
చెలువ, నాకిప్పు డుచ్చరించితివి గాన. 34

[కేలం గొని ఆమెను కూర్చుండఁ బెట్టును.

విదూ.—ఏమమ్మా! రాజు యువస్యుడికి బ్రాహ్మణుడికి మొక్కరేమి ? [ఉర్వశి స్మితముతో ప్రణమిల్లును.

విదూ.—స్వస్తి నీకు.

[నేపథ్యమున—చిత్రరేఖా, ఉర్వశిని వడిగొల్పు.]

తే. భరతముని యష్టరసముల నిరవు కొల్పె
నే ప్రయోగంబు మీయందు, నెలమి దానిఁ
గనఁగ లలితాభినయము దాఁ గాంక్షసేయు
లోకపాలురును సహస్రలోకుఁ డిపుడు. 35

[అందఱు చెవి యొగ్గుదురు. ఉర్వశి విషాదము నటించును.

చిత్ర.—నెచ్చెలీ, దేవదూతవచనమును విన్నావా? మహారాజును సెలవడుగు.

ఉర్వశి.—నాకు వాక్కు లేదు.

చిత్ర.—మహారాజా, ఈజనము పరవశంగదా. అందుచేత మహారాజువల్ల అనుజ్ఞ పొంది దేవతలయెడల అపరాధించక మెలగడానికి వేడుతున్నది.

రాజు.—[ఎట్టకేలకు వాకుట్నను తెచ్చుకొని] మీ యిరువురయెడ ఏలికయానకు అడ్డపడుచుండను గాను. మఱి యీజనుని స్మరింపవలయును.

[ఉర్వశి వియోగదుఃఖమును రూపించుచు సఖతో విమర్శించును.

రాజు.—[నిట్టూర్పుతో] మిత్రుఁడా, ఇప్పుడు కంటికి వ్యర్థతవలె.

విదూ.—[పత్రమును చూపఁగోరి] ఓయి, ఇదుగో; [అని సగముమాటలో, ఆత్మగతము] అయ్యో! అయ్యో! ఉర్వశీదర్శనాశ్చర్యమగ్నుణ్ణై నేను నాచేతులోనుంచి ప్రమాదమున ఆపత్రము జాఱిపోవడం ఎఱుకఁబోతిని.

రాజు.—భద్రుఁడా, ఏమో చెప్పవచ్చితివే?

విదూ.—నీవు దేహాన్ని వదలకు. నీమీఁద ఉర్వశి గట్టిగా భావమును కట్టిపెట్టి ఉన్నది. ఆమె యిక్కడ నాటుకొన్నయనురాగాన్ని సళ్ళించదు.

రాజు.—నామనస్సు కూడ అట్లే తలపోయుచున్నది. ఏలన తరలునపుడు స్నేహము.

క. తనవశము గానిమెయితో
జనుచు న్నామీఁద నునిచె స్వవశంబు నెదఁ
స్తనకంపకృత్యలక్ష్యం
పునిదుదక్రొవ్వేఁడియూరుపులచేతబలెఁ. 36

విదూ.—[ఆత్మగతము] ఏక్షణములో ఈయనగారు ఆభూర్జపత్రాన్ని పేర్కొంటాడో అని నాగుండె తటతట కొట్టు కొంటూ వున్నది.

రాజు.—ఇపుడు దేనితో నాదృష్టిని లాలింతును? [స్మరించి] ఆ! ఓయి, ఆభూర్జపత్రమును తేవోయి.

విదూ.—[విషాదము నటించి] అయ్యో! అగపడదే! ఓయి, ఆభూర్జపత్రము దివ్యము, కనక ఉర్వశితో కూడానే పోయింది.

రాజు.—మూఢుఁడు, అన్నిటను ప్రమాదియే. వెదక వోయి వెదకు.

విదూ.—[లేచి] ఇదుగో ఇక్కడ ఉంటుంది, ఇక్కడ ఉంటుంది. [అని వెదకుట నభినయించును.

[అంతట సపరివార దేవి కాశీరాజపుత్త్రి ప్రవేశించును.]

దేవి.—ఒసే నిపుణికా, నీవు చెప్పితివే! 'మాణవ కయ్యతో గూడ ఆర్యపుత్రుఁడు ఈతీగయింట ప్రవేశిస్తుండగా చూస్తి' నని, ఆమాట నిజమేనా?

నిపు.— నే నెప్పుడయినా లేనిదానిని భట్టినికి విన్న వించి ఉంటినా?

దేవి.— అటయితే తీగలచాటున ఉండి విందాముకానీ, ఇతనినమ్మకపు సంభాషణలని; నీవు చెప్పినగుట్టు సత్యమవునో కాదో అని.

నిపు.—భట్టిని ఆజ్ఞాపించినట్లు.

దేవి.—[పరిక్రమించి] ఒసే నిపుణికా, ఇదేమిటే పాతవేలికలాగ దక్షిణపుగాలికి ఇటు కొట్టుకొని వస్తూవుంది?

నిపు.—[వి.. వించి భట్టిని, దొం డంలో పొడకట్టుతూ వున్న అక్షరాలతోటిది భూర్జపత్రము సుమా యిది. ఆహా! భట్టినియందే మొనకే తగులొన్నది. కైకొని] ఏమి? చదువుదునా ?

దేవి. — నీలో నీవు చదువుకో, విరుద్ధము కాదేని నాకు వినిపించు.

నిపు.— అల్లే చేసు భట్టిని, ఆగు.. అని తోస్తున్నది. భర్తను గూర్చి ర్వశి .. స కవ..ధంగా కనపడుతూ వున్నది. మాణవకేయ్యప మాదంమూలాన మన చేతులో పడ్డది.

దేవి. — అటయితే దానియర్థాన్ని తెలుసుకొంటాను.

[రాజు మున్ను చదివినదానిని నిపుణిక చదువును.

దేవి.—ఇక్కడ ఇదే చేకానుకగా అచ్చరకాముకుని దర్శిస్తాను. [అని పరిజనసమేతముగా తీవయింటి కరుగును.

విదూ.—ఓయి వయస్యా, ఏమిటి ఇది? ప్రమదవనము చెంగటి ఆటకొండ పర్యంతాన కనబడుతున్నది ?

రాజు.—[లేచి] భగవానుఁడా, వసంతప్రియుఁడా, దక్షిణమారుతుఁడా,

ఉ. తావికినై హరింపుము ల
తాసుమఘూళి వసంతసంభృతం,

బీవగ నాకుఁ గూర్చి హృద
  యేశ్వరిపంపుస్వహస్త మంటుదే!
ఈవహి యావినోదముల
  నే మదనార్తునిప్రాణ ముండు నం
చీవ యెఱుంగు దంజన క
  హీనత మేల్పడి ప్రాణిప్రాణమా. 37

నిపు.—భట్టిని, దీన్నే వెతుకుతున్నారు.

దేవి.—చూస్తున్నాను.

విదూ.—ఓయి, మాసిపోతూవున్న కేసరాలకాంతి తోడి నెమలిపురిచేత మనము మోసపోతిమి.

రాజు.—ఎల్ల విధములను చెడితిని.

దేవి.—[సమీపించి] ఆర్యపుత్రుడా, ఆకులపడకు, ఇదుగో ఆభూర్జపత్రము.

రాజు.—[సంభ్రమముతో] అహా దేవి! స్వాగతము దేవికి.

విదూ.—[అపవారించి ఇపుడు దురాగతము అయినది.

రాజు.—వయస్యుఁడా, ఇపుడు ఇందాలకు ఏమి ప్రతి సేయవలయును?

విదూ.—దొంగసొత్తుతో దొరకిన దొంగకు ప్రతివచనం ఉంటుందా?

రాజు.—దేవి, నేను దీనిని వెదకుచుండలేదు, వేఱొక దానిని వెదకుట యి.

దేవి.—తనసౌభాగ్యమును ప్రచ్ఛాదించడం తగినదే.

విదూ.—అమ్మా, ఈయనకు పైత్యోపశాంతి చేయగలభోజనం త్వరగా సిద్ధం చేయించు.

దేవి.—నిపుణికా, బ్రాహ్మణుడు శోభనముగా వయస్యుని ఆశ్వాసిస్తున్నాడు.

విదూ.—అమ్మా, చూడు మఱి, పిశాచం కూడా భోజనంచేత ఆశ్వసిల్లుతుంది.

రాజు.—మూర్ఖుఁడా, నన్ను బట్టి అపరాధినిగా తెలుపుచున్నావు.

దేవి.—నీయందపరాధము లేదు. నేనే ఇందులో అపరాధను; ఏలన, నేను ప్రతికూలదర్శనయై నీయెదుట నిలుచుచున్నాను. నేనిటనుండి వెళ్తాను. [కోపము నటించి తరలును.

రాజు:—

తే. ఏ నగుదుఁగాక యపరాధి నే క్షమింపు,
ముదుగు సంరంభగతిని రంభోరుకాండ,
సేవ్యజన మిట్లు కోపంబు చెంది యుండ
దాసునికి నెట్లు నిరపరాధిత ఘటించు. 38

[అని పాదములం ద్రెళ్ళును.

దేవి.—[ఆత్మగతము] మెత్తమనసు దానిని నేను ఈ బతిమాలడంచేత ఉబ్బకుందునుగాక. కాని, నిర్దాక్షిణ్యము వహించునందుకు కలిగె పశ్చాత్తాపానికి వెఱుస్తాను.

[రాజును విడిచి పరివారముతో నిష్క్రమించును.

విదూ.—వర్షానదివలె అప్రసన్నగానే వెళ్ళినది దేవి. లేవోయి లే.

రాజు.—(లేచి) ఇది అనుపపన్నము గాదు. చూడు:—

తే. ఊసరసము లౌ ప్రియోక్తులు నూత్నమైనఁ
ప్రియునియనునయంబు ప్రియల కెపుడుఁ
దాఁక నేర దెదను దద్విదులకుఁ గృత్రి
మంపుటెఱుపువన్నె కెంపువోలె. 39

విదూ.—నీ కిప్పు డిది అనుకూలమే. కళ్ళు కలగిన వాడు ఎదట దీపశిఖను ఓర్వలేడు గదా.

రాజు.—అట్లు గాదు. నామనసు ఉర్వశిని తగులుకొన్నను, నాకు దేవియందు ఆమెప్పటిబహుమానమే. కాని, నా ప్రణిపాతమును అతిక్రమించినది గావున నేను దేవివిషయమున ధైర్య మవలంబించెదను.

విదూ.—నీధైర్యముమాట అటుండనీ, ఆకలిగొన్న బ్రాహ్మణుని ప్రాణములను కాపాడడానికి నీవు యత్నించు. స్నానభోజనాలు కానీయడానికి ఇది సమయంగదా.

రాజు.—(మీఁదికి చూచి) పగలు సగము కడచినది.

తే. ఉలికి వేఁడికి నెమలి గూర్చుండు సరగ
వలిఁ దోలఁకుతరుమూలాలవాలమందు,
కొండగోఁగుల ముకుళింపుఁగోసను దెఱచి
లోన నిందిందిరమ్ము తా లీన మగును.

తే. కాఁగినజలంబు విడ దన్ని కన్నె లేడి
గట్టునను మొట్టదామరచెట్టుఁ జేరె;

కేళిగృహమునఁ బంజరకీర మదిగో
వినుము క్రాంతమై సారెకు వేఁడు జలము. 40

[అందఱు నిష్క్రమింతురు.]

ద్వితీయాంకము ముగిసినది.

మిశ్ర విష్కంభకము.

[అంతట ఇద్దఱు భరతశిష్యులు ప్రవేశింతురు.]

ప్రథముఁడు.—చెలికాఁడా, పైలవుఁడా, మహేంద్ర మందిరమునకు పోవుచు ఉపాధ్యాయులవారు నీచేతికి ఆసన మిచ్చిరి. నన్ను గృహసంరక్షణకై నిలిపిరి. కావున నడిగెదను. గురువుగారి ప్రయోగమును దేవసభ మెచ్చుకొన్నదా?

ద్వితీయుఁడు.—గాలవా, మెచ్చుకొన్నదో లేదో చెప్పలేను. మఱి, సరస్వతి రచించిన లక్ష్మీస్వయంవరం అనే ఆ కావ్యబంధంలో ఆయా రసాంతరాలలో సభ తన్మయమై పోయింది. కాని,

ప్రథ.—ఏమో తప్పు సంభవించినదని చెప్పనున్నావు.

ద్వితీ.—అవును, అందులో ఉర్వశివాక్కులో పొరబాటు కలిగింది.

ప్రథ.—ఎట్లు?

ద్వితీ.—లక్ష్మీవేషంలో ఉన్న ఉర్వశిని వారుణీవేషంలో ఉన్న మేనక అడిగింది:—'సఖీ, త్రైలోక్యమహాపురుషులు సకేశవులు లోకపాలురు వీరె వచ్చిఉన్నారు; ఇందులో ఎవరిమీద నీమనస్సు తగులుకొంటున్నదో చెప్పు;' అని.

ప్రథ.—తర్వాత తర్వాత ?

ద్వితీ.—అంతట ఆమెనోటినుండి 'పురుషోత్తముని మీద' అని రావలసియుండగా, 'పురూరవసునిమీద' అని వాక్కు వచ్చినది.

ప్రథ.—ఇంద్రియములు కానున్నదానిని అనుసరించునవి. అందుకే ఆమెమీఁద గురువు కోపగింపలేదా?

ద్వితీ. — ఆమెని బ్రహ్మ శపించినారు. మఱి మహేంద్రుడు ఆమెని కనికరించినాడు.

ప్రథ.—ఎట్లు?

ద్వితీ.—'నీవు నాఉపదేశమును అతిక్రమించినకారణంచేత నీకు దివ్యస్థానం ఉండదు.' అని బ్రహ్మశాపము. మఱి, ఆట ముగిసినతర్వాత లజ్జతో తలవంచుకొనియున్న ఉర్వశికి మహేంద్రుడు ఈలాగు చెప్పినాడు:—'ఎవనిమీద నీమనసు తగులుకొన్నదో, అతడు నాకు రణసహాయుడు రాజర్షి; అతనికి ప్రియంచేయవలెను. కనుక నీవు ఆయనను పురూరవుని అతడు నీవల్ల సంతానవంతుడు అయ్యేదాకా యథేచ్ఛంగా కూడు.'

ప్రథ—పురుషాంతరవేదికి మహేంద్రునికి తగియున్నది.

ద్వితీ.—[సూర్యుని చూచి] మాటల ఆసక్తిలో మనము బ్రహ్మగారి స్నానవేళను తప్పినాముగదా. రా మరి, ఆయన ప్రక్కనే ఉందాము. [అని నిష్క్రమింతురు.

మిశ్ర విష్కంభకము ముగిసినది.

తృతీయాంకము

[అంతట కంచుకి ప్రవేశించును.]

కంచుకి.—

ఉ. వేకువఁ బ్రాయమం దనుభ
వింపుదు రెల్లకుటుంబు లర్థముల్,
లోకములం దనంతరము
ద్రోచి భరంబు భజింతు దూఱటన్;
మా కయినన్ శరీరమును
మాల్చుచు నిచ్చలు వార్ధకంబునన్
గాకొను సేవ యంచుఁ జెఱ!
పైదలులం దధికార మకటా! 41

[పరిక్రమించి] నియమస్థురాలు కాశిరాజపుత్రి నన్ను ఆదేశించినది ఏమనఁగా— "నేను వ్రతము నెఱవేర్చుకొనుదాననె అలుక ఉజ్జగించి నిపుణికముఖముగా మహారాజును పూర్వము వేడియున్నాను. దానినే నీవు నామాటవలన విన్నవింపుము." అని. నేనును ఇప్పుడు సంధ్యాజాప్యమును ముగించుకొన్నమహారాజును చూచెదను. [పరిక్రమించి, చూచి,] రాజభవనమందు దివసావసానవృత్తాంతము రమణీయముగదా. ఎటన, నిచట,—

మ. నిలుచున్ మచ్చెనయుక్త మనిగడలన్
నిద్రాలసంబుల్ శిఖుల్,

వలభుల్ వెలిసె జాలధూపములచేఁ
బారావతౌఘ్యక్కి యగ్గ,
బలిపుష్పాంచిత వేదికావృలను బ్ర
జ్వాలంబులఁగ సాంధ్యమం
గళదీపంబులఁ బంతు రాచరణని
ర్తికల్ వృద్ధయంతఃపురిఁగ. 42

[నేపథ్యమునందు సూచించి] ఓహో మహారాజు ఇట్లే వచ్చుచునాఁడు.—

తే. చుట్టురాఁ గర దివ్వెలఁ బట్టి కేల
నూడిగపుఁగాంతలు గొలిచి రా, నొప్పు నితఁడు,
కొండగోఁగులు తటములనిండఁ బూవ,
జట్టుపలుపోమిఁ జరియించు శైల మనఁగ. 43

ఈయనను దృష్టిపథములో నిలిచి ఎదురుసూచెదను.

[అంతట యథోక్తపరివారుఁడగు రాజు ప్రవేశించును, విదూషకుఁడును.]

రాజు.—[ఆత్మగతము]

తే. పనులలోఁ జొచ్చి యుత్కంఠ వెనుక కుంచి
పవలు గడపితి సంతగా బాధపడక,
అకలితవినోదములఁ జిరయామ మగుచు
నొంచురాతిరి నెట్లు వేగించువాఁడ. 44

కంచుకి.—[సమీపించి] జయము జయము దేవరకు. దేవేరి విన్నవించుచున్నది:—"మణిహర్మ్యముమీఁద చంద్రుఁడు ఎంతయు మనోహరముగా నగపడును. అచట సన్నిధి

యొసంగు దేవరతోఁగూడ రోహిణీసంయోగము దాఁక ఎదురు చూచుచుండఁ గోరుచున్నాను.'' అని.

రాజు.—ఆర్యుఁడా, లాతవ్యుడా, దేవితో 'సీయిచ్చ' అని విన్నవింపుము.

కంచు.—ఏలినవారి యాజ్ఞ. [అని నిష్క్రమించును.

రాజు.—వయస్యా, దేవేరియారంభ మిది, ఏమి పార మార్థికముగా వ్రతము నిమిత్తమే అగునా?

విదూ.—ఓయి నాకు తోస్తుంది-దేవిగారు పశ్చాత్తాపంపొందినది నీ ప్రణిపాతప్పు ఉల్లంఘనాన్ని వ్రతమిషచేత తుడిచివెయ్యడానికి కోరుతున్నది-అని.

రాజు.—ఉపపన్నముగనే నీవు చెప్పితివి. అట్లే గదా.

క. ప్రణతిఁ లంఘించి తోఁ
వెనుకం దాపంబు నొంది వినిగూఢముగా
ననునయము లొసఁగి యునికి
మనస్వినులు మాన్పికొంపు మదిలోని త్రప. 45

కనుక మణిహర్మ్యముమీఁదికే మార్గము చూపుము.

విదూ.—ఇటు ఇటు. గంగాతరంగాలలాగు శోభిస్తూ వున్న యీ స్ఫటికమణి మెట్లమీఁదుగా ప్రదోషావసరరమణీయాన్ని మణిహర్మ్యాన్ని ఎక్కవయ్యా.

రాజు.—నీవు ముందుగా ఎక్కు.

[అందఱు మెట్లెక్కుట నభినయింతురు.

విదూ.—[చూచి] ఓయి చంద్రోదయం కానున్నది. కనుకనే చీకటి వదలుతున్న పూర్వదిక్కు—మొగము వెలుతురు చేత సొం పెక్కు—తూ వుంది.

రాజు.—నీవు సరిగానే చెప్పితివి.

ఆ. ఉదయతటిమఱుఁగున నున్న యిందునికాంతి
తమము నచటినుండి దవ్వ తఱుమ,
గుంతలములు దీర్చుకొన్న తీరున నాదు
కనుల నింద్ర దిశ్ముఖంబు తనువు. 46

విదూ.—హీహీ! ఓయి! ద్విజాతులకే డితడు కల కండమోదకపుసిరిగలవాడు ఉదయించినాడు.

రాజు.—[స్మితముతో] ఉదరపరాయణునికి ఎల్లయెడలను తిండిమీఁదనే లోకము. [చేతులు మోడ్చి ప్రణమిల్లి] భగవంతుఁడా, యామినీరమణా!—

తే. సాధువులకి యజ్ఞె నీవు సవితఁ జొత్తు,
సుధ యొసఁగి తనియింతువు సురలఁ బితల,
రేలు పర్వేడుతమము ... రింతువయ్య,
గిరిశచూడాహితాత్మ, మొక్కె-దను నిన్ను. 47

[అని లేచును.

విదూ.—బ్రాహ్మణునినోటితో పలుకుచున్న నీపితామహునిచేత అభ్యనుజ్ఞాతుడవై నీవు ఆసనపరిగ్రహం చెయ్యి, నేనున్ను సుఖాసీనుడ నౌతాను!

రాజు.—[అట్లే విదూషకునిమాట నంగీకరించి కూర్చుండి పరిజనముం గాంచి] పట్టపగలుగా వెన్నెల గాయుచుండఁగా దివ్వటీ లేల? చెలువలారా, మీరు విశ్రమింపుఁడు.

పరిజనము.—ఏలినవారి యాజ్ఞ.

(అని నిష్క్రమింతురు.

రాజు.—[చంద్రుని గాంచి] వయస్యుఁడా, ఇక నొక ముహూర్తమునకు దేవి వచ్చును. కనుక ఏకాంతమున నా యవస్థను వచించెదను.

విదూ.—ఎందుకూ? అగపడుతూనేవున్నది అది. అయినాగాని, అటువంటి యనురాగం చూడగా ఆసముడిచేత ఆత్మను నిలుపుకోవడం శక్యమే.

రాజు.—అట్లే ఇది. కాని; నామనస్సులోని యభితాపము కడిఁదిగా నున్నది.

ఆ. విషమశిలలచాలు వేగంబు నడఁపిన
యేటిజాలు వోలె నిరోధితోఁడి
పొందు విఘ్ననిహతిఁ బొందినకతమున
శతగుణత్వ మొందు స్వాంతశయుఁడు. 48

విదూ.—అంగములు కుస్సిపోవుచున్నను అధికంగా శోభిస్తున్నావు. అందువల్ల నీకు ప్రియాసమాగమము చెంతనే ఉన్నదని తలుస్తాను.

రాజు.—[నిమిత్తమును సూచించి] వయస్యా,

క. గురుశోకాతురు నను ఁ
నెరకోరుకలు గొల్పునుడుల నీ వెటులో యటుల్
కర మాశ్వాసించు బలే!
స్ఫురణములఁ దక్షిణంబు భుజ మిది మిత్రా. 49

విదూ.—బ్రాహ్మణునివచనం తప్పదు గదా.

రాజు సప్రత్యాశముగా నుండును.

[అంతట ఆకాశయానమున అభిసారికావేష ఉర్వశియు, చిత్రలేఖయు ప్రవేశింతురు.]

ఉర్వశి.—[తన్ను తాను చూచుకొని] సఖి చిత్రలేఖా, అల్పాభరణభూషితము నల్లని నీలాంశుకముతోడి యీయభిసారికావేషము నీకు అందగిస్తూ ఉన్నదా?

చిత్ర.—వర్ణించడానికి నాకు వాగ్వైభవము లేదు. ఇట్లు తలుస్తున్నాను, నేను పురూరవుణ్ణి అవుదును గాక, అని.

ఉర్వశి.—సఖి, మదనుని ఆన నీకు, నన్ను శీఘ్రంగా ఆసొబగుని యింటికి కొనిపొమ్మని.

చిత్ర.—ఇదుగో, మలిచిన కైలాసశిఖరంలాగ ఒప్పుతున్న ప్రియమిత్రుని భవనాన్ని దరిసితివి.

ఉర్వశి.—అయితే, ప్రభావంచేత తెలుసుకోవే ఆయన నాహృదయచోరుడు ఎక్కడ ఉన్నాడో ఏమి చేస్తున్నాడో.

చిత్ర.—[ధ్యానించి, ఆత్మగతము] కానీ, ఈమెను కొంచెము ఆడిస్తాను. [ప్రకాశము] సఖి, ఈయన మనోరథ

ప్రాప్తమయిన ప్రియాసమాగమసుఖాన్ని అనుభవిస్తూ ఉపభోగక్షమమైన ప్రదేశంలో ఉన్నాడు.

ఉర్వశి విషాదము నటించును.

చిత్ర.—ఓసి గోలా, ప్రియసమాగమానికి వేళే చింత యేమున్నది?

ఉర్వశి.—(ఊరడిల్లి) అదక్షిణము నామీద సందేహ పడినది.

చిత్ర.—(చూచి) అదుగో మణిహర్మ్యమువిూద వయస్యమాత్రసహాయుడు రాజున్నాడు. రా నుఖే అతనిని సమీపింతాము.

ఇరువురు దిగుదురు.

రాజు.—వయస్యుడా, రాత్రితోగూడ మదనబాధ పేర్చుచున్నది.

ఉర్వశి.—అస్పష్టముగా పలుకబడిన యీ వచనంతో నా గుండె తల్లడిల్లుతున్నది. ఏ గ పడకుండిదో విందాము గాక మన సంశయము తీరిందాకా, వీరి నమ్మకపు సుఖులు.

చిత్ర.—నీ కిచ్చవచ్చినట్లు.

విదూ.—ఓయి అమృతమయమైనటు తున్న యీ చంద్ర పాదాలని సేవించు.

రాజు.—వయస్యుడా, ఈ వ్యాధి, యిట్టి సాధనములకు కుదురునది గాదు. చూడు:—

చ. సుమశయనంబు సూతనము,

సోమునినిండుమరీచిపింఛము, దే

హామున నలందుచందనము,
నచ్చుపుము త్తైపుఁబే, ర్లివన్నియుఁ
కుసుమములు గావు నామన
సిజాతరుజఁ గుదియింప; శక్తి యా
యమరియునఁ—

ఉర్వశి.—మఱి యన్య ఎవతె?

రాజు.—

వివి క్తమున
వ్యాహ్రియమాణము తత్కథాళియుఁ.

ఉర్వశి.—హృదయమా, నన్ను వదలి ఇతనిం గూడి నందుకు ఫలమును నీవు ఇప్పుడు అనుభవించితివి.

విదూ.— అవును. నేనున్ను మిష్ట మయిన లేడిమాంసం తిన దొరకనప్పుడు దానిని వేడుతూ కీర్తిస్తూ ఊరడిల్లుతాను.

రాజు.—ఇది నీకు ఘటించును.

విదూ.—నీకున్ను అది త్వరలోనే ఘటించును.

రాజు.—సఖుడా, ఇట్లు తలంచెదను.

చిత్ర.—ఓసి! అసంతుష్టురాలా, విను.

విదూ.—ఎట్లు?

రాజు.—

క. ఆయింతి తేరికుదుపున
క్కై యేయీయంస మొత్తె నాత్మాంసముఁ,

నాయంగ మిది యొక్కఁడె నా
కాయమునఁ గృతార్థమా, మిగత భర మిలకుఁ. 51

చిత్ర.—ఇప్పుడు తామసింప నేల?

ఉర్వశి.—[తటాలునఁ దటిసి] సఖి, నేను దరిసి ఎదుర నిలిచినా మహారాజు ఉదాసీనుడుగా నున్నాడే?

చిత్ర.—[స్మితముతో] మరీ వేగిరముచేత తిరస్కరిణిని తొలగింప నైతివి.

[నేపథ్యమున]

భట్టిని ఇటు, ఇటు.

[అందఱు చెవి యొగ్గుదురు. ఉర్వశి సఖితోఁగూడ విషాదము చెందును.

విదూ.— ఓహో! వచ్చినది దేవి! కనక వాచంయము డవుగా వుండు.

రాజు.—నీవును గుట్టు దాఁచి యుండుము.

ఉర్వశి.—సఖి, ఇపు డేమి చేతాము?

చిత్ర.—దిగులు పడవద్దు. మనము మఱగియున్నాము. రాజర్షి పట్టపుదేవి ఉపవాసవ్రతకృశగా కనబడుతున్నది. కనక ఈమె యిక్కడ చాలాసేపు ఉండదు.

[అంతట ఔపహారికహస్తకరిజన దేవి ప్రవేశించును.]

దేవి.—[పరిక్రమించియు చూచియు] ఓసే, నిపుణికా, వీడుగో భగవానుడు చంద్రుడు, రోహిణింగూడి అధికంగా శోభిస్తున్నాడు.

చేటి. - మతిదేవితోఁ గూడితే భర్త విశేషరమణీయుడు గాడా ? [పరికించును.

విదూ. — [చూచి] ఓయి నాకు స్వస్తివాచనం ఇస్తుందో, కాక, నీకు వ్రతమిష తరోషము మాని ప్రణిపాతలంఘనాన్ని తుడిచివేసుకో గోరి యున్నదో, ఎఱుగను, గాని, ఇపుడు నాకండ్లకు శుభదర్శనగా ఉన్నది దేవి.

రాజు. — [స్మితముతో] ఉభయమును ఘటిల్లును. అయినను నీవు పిమ్మట చెప్పితివే అది సన్నగుటించినదిగా తోఁచుచున్నది. ఏలన ఈమహనీయురాలు —

ఉ. ధౌతదుకూలయుగ్మమును
దాలిచి మంగళమాత్రభూషణై
పూతము లైన లేగఱికె
మోసులఁ జూర్ణకచాళిఁ జెర్వియుఁ
జేతములో నిగర్వ మప
చిత్యపదేశమునన్ త్యజించియుఁ
గాతర నేత్ర నాపయిని
గన్నప్రసాదముఁ దెల్పు మేననే. 52

దేవి. — [తటిసి] జయము జయము ఆర్యపుత్రునికి.

విదూ. — దేవిగారికి స్వస్తి.

రాజు. — దేవికి స్వాగతము.

ఆమెను చేత బట్టి కూర్చుండఁబెట్టును.

ఉర్వశి.—సఖీ, ఈమె దేవీశబ్దము తన ఉపచారము నొందుట యుక్తమే. తేజులో శచికి ఏమాత్రము తక్కువపడదు.

చిత్ర.—బళి, అసూయావిముఖంగా పల్కితివి.

దేవి.—ఆర్యపుత్రుని పురస్కరించుకొని నే నొకానొక నోము నోచవలసి ఉన్నది. అందుకై ముహూర్తముసేపు ఆకను సహింపవలెను.

రాజు.—అట్లనవలదు. ఇది ఆక యెట్లు? అనుగ్రహము గదా.

విదూ.—స్వస్తివాచనము కలదైన యిటువంటి నిర్బంధము తరుచుగా కలుగును గాక.

రాజు.—దేవి చేసెడి యీనోము పే రేమి?

[దేవి నిపుణికం గాంచును.

నిపు.—దేవరా, దీనిపేరు ప్రియానుప్రసాదనము.

రాజు.—[దేవిని చూచి అట్లని

తే. గాత్రమును బిసమృదువు నకారణముగ
నీవ్రతముచేఁ గల్యాణి యేల వాడ్చ?
చాఁచు నెవఁడంజలిని నీప్రసాదమునకు
ననునయింతువె యాదాసజనుని నీవు? 53

ఉర్వశి.— ఈమెయందు ఇతనికి బహుమానము మిక్కుటంగా నున్నది.

చిత్ర.—ఓసిబేలా, ప్రేముడి ఒరులపా లయినపుడు నాగరకులు అధికంగా దాక్షిణ్యము చూపుతారు.

దేవి.—[సస్మితముగా] హలే యీనోము నోచడం వల్ల ఈప్రభావము; ఏమన, ఆర్యపుత్రుడు ఈపాటియేని పలుకరించినాడే.

విదూ.—ఊరుకోవమ్మా! మంచిమాటను నిరాకరించగూడదు.

దేవి.—పిల్లలారా, పూజాద్రవ్యాలని తెండి, మణిహర్మ్యమందున్న చంద్రపాదములను పూజిస్తాను.

పరి.—ఇదుగో, గంధము పువ్వులు లోనైన యుపహారము.

దేవి.—[నాట్యమున గంధపుష్పాదులతో చంద్రపాదములను అర్చించి] ఒసే, ఈ యుపహారమోదకాలని మాణవకయ్యకు సమర్పించండి.

పరి.—దేవియాజ్ఞ. మాణవకయ్యా, ఇదుగో ఇది నీకు.

విదూ.—[మోదకాలపళ్ళెరముం గైకొని] అమ్మా, నీకు స్వస్తి. నీయుపవాసము బహుఫలము అగుగాక.

దేవి.—ఆర్యపుత్రుడా, ఇటు.

రాజు.—ఇదె ఉన్నాను.

దేవి.—[నాట్యముచే రాజును పూజించి, చేమోడ్పుతో మొక్కి] ఇదుగో నేను ఈ దేవతాదంపతులను రోహిణీహరిణాంకులను సాక్షికరించి ఆర్యపుత్రుని అనుప్రసన్నుని చేస్తున్నాను. ఇది మొదలుకొని ఏచెలువను ఆర్యపుత్రుడు వేడునో; ఎవతె ఆర్యపుత్రుని సమాగమానికి ఉవ్విళ్ళూరు

తుందో, ఆచెలువతో నేను ప్రేమబంధముతో వర్తింపవలయు నని.

ఉర్వశి.—అహా! ఈమాటకు అభిప్రాయమేమో ఎఱుగకున్నాను. నాకు మఱి హృదయము విశ్వాసముచేత విశదమైనది.

చిత్ర.—సఖీ, మహానుభావురాలు పతివ్రత నీకు అనుజ్ఞ యిచ్చింది, ఇక నిర్విఘ్నంగా నీకు ప్రియసమాగమం కలుగుతుంది.

విదూ.—[అపవారించి చేయి తెగిన చెంబడివాడు చేప తప్పించుకొని పోగా 'ఇందువల్ల నాకు ధర్మం కలుగుతుంది' అని చెప్పాడు. [ప్రకాశము] అమ్మా, ఏమి నీకు అట్టి ప్రియుడా ఈదొడ్డవాడు?

దేవి.—మూర్ఖా, నేను నాసుఖమును మానుకొని ఆర్యపుత్రుని సుఖితశరీరుని చేయడానికి కోరుతున్నాను. అందువల్ల తెలుసుకో ప్రియుడా కాడా అని.

రాజు.—

క. ఈఁగలవాఁ డొకతెకుఁ బ్రే
కోఁగల పిదాసు నీవు కొమ్మ; ప్రియుఁ జనన్,
నేఁ గానట్టిఁడ నెట్టినిఁ
గాఁ గొంటివా నను నకాండకాతరమతి వై. 54

దేవి.—అవునువో కాదో, ఉద్దేశించిన ప్రకారము ప్రియానుప్రసాదనవ్రతము నెఱవేఱినది. పిల్లలారా రండి వెళ్దాం. [దేవి తరలినది.

రాజు.—ప్రేయసీ, ఇపుడు నన్ను వదలిపోయెదేని నేను ప్రసాదితుఁడను గాను.

దేవి.—ఆర్యపుత్రుడా, నే నెప్పుడు నియమమును ఉల్లంఘించినదాన్ని కాను.

[దేవి సపరివార నిష్క్రమించును.

ఉర్వశి.—సఖీ, రాజర్షి ప్రియకళత్రుడు, మఱి నేను హృదయాన్ని ఆపుకోలేక ఉన్నాను.

చిత్ర.—అయితే, నీవు నిరాశవై నివర్తిస్తావా ?

రాజు.—[ఆసనముం బొంది] వయస్యా, దేవి దూరము పోయి యుండదు.

విదూ.—చెప్పదలచుకొన్న మాటను జంకు లేకుండా చెప్పు. రోగము అసాధ్యమని వైద్యుడు రోగిని విడిచివేశినట్లు, నిన్ను ఆయిల్లాలు స్వచ్ఛందవర్తినిగా వదలివేశింది.

రాజు.—మఱి ఉర్వశి యే మయినా,—

ఉర్వశి.—కృతార్థురాలు అగునా!

రాజు.—[కుళకము]

తే. లీనస్వాయ యందెరవళిమాత్రాన నాదు
వీనుదోయికి విందుగావించునో కొ ?
వెనుక కల్లన వచ్చి నావీక్షణములఁ
ముగ్ధకరపంకజములతో మూయు నో కొ?

తే. హార్మ్యతలమున నిచటఁ దా నవతరిల్లి
మలసి మందాక్షమందాయమాన యగుచు

నడు గడుగు గాఁగఁ బెట్టించి గడుసుఁజెలియ
బలిమిఁ దేర నాకడకుఁ దా వచ్చునోకో? 55

ఉర్వశి.—సఖీ, ముందుగా, ఇతని యీకోరికను తీరుస్తాను. [వెనుకకుఁ బోయి చేతికన్నులను మూయును.

చిత్రలేఖ విదూషకునికి సన్న సేయును.

రాజు.—[స్పర్శ సూచించి] చెలికాఁడా, ఈవరారోహ నారాయణునితొడనుండి జనించినట్టిది.

విదూ.—నీవు ఎట్లు తెలిసికొంటివి ?

రాజు.—ఇందు తెలియని దే మున్నది?

క. స్మరశరజర్జరితం బీ
శరీర మిఁక నెవతెచేతిస్పర్శకుఁ దనియుఁ?
హరిణాంకాంశువులకు బలెఁ
దరణికిరణములకుఁ గలువ దాల్పదు తనువుఁ. 56

ఉర్వశి.—[చేతుల నెడలించి లేచి కొంచెము ఆవలికి జరిగి] జయము జయము మహారాజుగారికి.

రాజు.—సుందరీ, స్వాగతము.

[తనతో ఏకాసనమందే కూర్చుండఁ బెట్టును.

చిత్ర.—వయస్యునికి సుఖమా ?

రాజు.—నిశ్చయముగా సమకూడినది.

ఉర్వశి.—సఖి, మహారాజును దేవి యిచ్చినది, అందువల్ల ప్రణయినివలె ఈయనతో శరీరసంపర్కం పొందితిని; అంతే గాని నాయందు సౌభాగ్యగర్వాన్ని సమర్థించకు.

విదూ.— ఏమి! ఇక్కడనే మీకు పొద్దు కుంకినదా?

రాజు.—[ఉర్వశిని చూచి]

క. దేవి యొసంగిన దనియే
యీావపువున వ్యాప్తిఁ బొంది వహించెద వేనిఁ,
ఏ పరియనుమతంబున
నీవు తొలుత స్పృశించితి హృదయంబుఁ? 57

చిత్ర.—వయస్యా, ఈమె చెప్పగల ఉత్తరము లేదు. ఇపుడు నావిన్నపము నాలకించుము.

రాజు.—అవహితుఁడను.

చిత్ర.—వయస్యుడ, ఆమనితర్వాత వేసవిలో నేను సూర్యభగవంతుని ఉపాసించవలశివున్నది. కనక ఈనాప్రియ సఖి స్వర్గాన్ని స్మరించకుండా వుండేలాగు వయస్యుడు చేయవలెను.

రాజు.—కల్యాణి.

తే. వర్ణనాతీతసౌఖ్యము వలుదు దివము,
దాని మఱపింప నెవ్వాఁడు దంట యగును?
ఈరమణి కైన వినుమీ పురూరవుండు
దాసుఁ డగుఁ దానసన్యసాధారణుండు. 58

చిత్ర.—అనుగృహీతనైతిని. సఖి ఉర్వశీ, అలందురక నన్ను వీడ్కొల్పుము.

ఉర్వశి.—[చిత్రలేఖను కౌఁగిలించి సఖి, నన్ను మఱవకుమా.

చిత్ర.—(స్మితముతో) వయస్యునితోఁ గూడిన నిన్నే నేను అట్లు వేడుకోవలసినదానను.

(అని రాజునకుం బ్రణమిల్లి నిష్క్రమించును.)

విదూ.—ఆహా! కోరిక తీరడంచేత నీవు వర్ధిలుతున్నావు.

రాజు.—ఎంత వర్ధిల్లుచున్నా ననఁగా, చూడు.

శా. నాకేశాతపవారణం బిడ దటుల్ నానావనీరాజ చూ
డాకల్పోజ్జ్వలరత్నసిపదపీఠాప్తాధిరాజ్యంబు దాన్,
ఈకంజేక్షణపాదపీఠమున నే నేకాంతసేవాకృతి [ముర్వ
శ్రీకిం బాత్రమ నౌట యొప్పెడునొ పూర్తిన్ జెందు ధన్యత్వ

ఊర్వశి.—ఇంతకన్న ప్రియతరము పల్కడానికి నాకు విభవం లేదు.

రాజు.—ఊర్వశిని కేలఁ బట్టి అహహా! ఈప్సితలాభ మనఁగా విరుద్ధములు పెరుఁగుటు గదా.

శా. ఆపాదంబులె క్రొందవంబులు పరా
హ్లాదం బిడున్ మేనికిన్,
ఆపుష్పవబాణసంతతులె పె
ల్లానంద మొందించెడిన్,
ఏపుం జూపుచు నేది యేది మును స
న్నెంచెన్ సఖీ, యిష్టదే
ప్రాపయ్యెన్ నినుఁ గూడ నా కనునయ
ప్రాప్తంబు వోలెన్ వెసన్. 58

ఉర్వశి.—విలంబముచేత ఆర్యపుత్త్రునియెడ అపరాధిని నైతిని.

రాజు.—కాదు అట్లు గాదు.

తే. ఎట్టకేలకుఁ గృచ్ఛ్రాప్తిన నెనసినట్టి
సుఖమె రసవత్తరం బయి శోభఁ జెందు,
వడకు సోకినతఱిని నిర్వాణ మొసఁగుఁ
జెట్టునీడ నరునకు విశేషముగను. 60

విదూ.—ప్రదోషరమణీయమైనచంద్రపాదాలని సేవించినావు. ఇప్పుడు నీకు పడకటిల్లు చేరడానికి సమయము.

రాజు.—అట్లయిన, నీసఖికి మార్గము చూపుము.

విదూ.—అమ్మా, ఇట్లు ఇట్లు. [అని పరిక్రమింతురు.

రాజు.—ఇది ఇప్పుడు నాప్రార్థన.

ఉర్వశి.—ఏ పని?

రాజు.—

ఆ. శతగుణితయుఁ బోలె జరిగె మున్ను త్రియామ
యనుపగతమనోరథునకు నాకు,
అట్లె జరుగునేని యంభోజపత్త్రాక్షి
నీసమాగమమున నేను కృతిని. 61

[అని అందఱు నిష్క్రమింతురు.

తృతీయాంకము సమాప్తము.

ప్రవేశకము.

క. అనుఁగుసఖిఁ బాసి వనటం
బనవు సఖియుక్త హంసి వ్యాకులమతియై,
ఇనకరసంస్పర్శకు వి
చ్చినచిత్తామరలకొలనిసీమలయందుం. ౧

[అని చిత్రలేఖాసహజన్యల ప్రావేశికి ఆక్షిప్తిక.]

[అంతట విమనస్క చిత్రలేఖయు సహజన్యయు ప్రవేశింతురు.]

చిత్రలేఖ ప్రవేశాంతరమున ద్విపదికతో దిక్కులుసూచి]

[గేయము]

సఖి కనఁబడనియంత,
సరసునఁ గ్రందిలు వంత,
అశ్రులు వెల్లువ గాఁగ,
హంసీయుగము మది గ్రాఁగ. ౨

సహజన్య.—సఖి, చిత్రలేఖా, వాడిపోతూవున్న నూఱు రేకుల తామరపూవులాగు ఉన్న నీ ముఖంయొక్క ఛాయ నీ హృదయంలోపలి అస్వస్థతని తెల్పుతున్నది. నీదుఃఖానికి కారణ మేమో చెప్పవే. నీతో సమదుఃఖను కాగోరుతున్నాను.

చిత్ర.—సఖీ, సహజన్యా! అచ్చరలవంతువరుసను ఇక్కడ సూర్యభగవంతునికి పాదములసేవ నేను చేయవలసి వున్నాను. అందుచేత ఉర్వశికోసము అధికంగా ఉత్కంఠితురాలి నై యున్నాను.

సహ.—ఎఱుఁగుదును మాయానోర్వశ్యప్రేమను. తర్వాత తర్వాత ?

చిత్ర.— అంతట ఈదినములలో దానివృత్తాంత మేమో అని సంయమమున చూడఁగా అత్యాహితము కనబడినది.

సహ.— ఆవేగములో? ఏలాగు ?

చిత్ర.—ఊర్వశి రాజ్యభారమును మంత్రులమీఁద ఉంచిన రతిసహాయుణ్ణి ఆరాజర్షిని తోడుకొని విహారార్థమై గంధమాదనవనానికి వెళ్ళినది.

సహ.—అటువంటిసలములలో కలిగేది ఏదో అదే గదా సంభోగ మనగా తర్వాత తర్వాత ?

చిత్ర.—అక్కడ మిన్నేటి యిసుక న్నెలలో క్రీడిస్తూ వున్న ఉదయవతి అనే విద్యాధరకన్యకను ఆరాజర్షి తేరి చూచినా డని ఊర్వశి అలిగినది.

సహ.—సరే. మిక్కుటమైన ప్రేమకు సహనముండదుగదా. తర్వాత తర్వాత ?

చిత్ర.—అంతట, కాంతుడు ఎంత బతిమాలుకొన్నా మెత్తబడక ఉపాధ్యాయశాపహతహృదయ యై స్త్రీలు చొరరానిదైన కుమారవనం చొచ్చినది. చొచ్చినవెంటనే కారణాంతరముచేత ఈమెరూపము తీగగా మారిపోయినది.

సహ.—విధికి అసాధ్యములేదు. అటువంటి అనురాగానికి ఆకస్మికంగా ఇటువంటి యీ యనర్థపరిణామము! ఇప్పుడు ఆరాజర్షి యవస్థ యేమి ?

చిత్ర.—ఆయన ఆకాసలోనే ప్రియతమను వెతుకొంటూ రేయింబగళ్ళు గడుపుతూ వున్నాడు; ఏతరాగులకు కూడా ఉత్కంఠను కలిగించే యీ మేఘోదయంచేత అనర్థముపా లయి పోయ్యేని.

[అనంతరము జంభలిక

[గేయము

సఖి కనుబొమలు వంతె,
సరసుల గండులు వంతె,
అశ్రులు వెల్లువ గాఁగ,
హంసీయుగము ముదిగాఁగ, 3

సహ.—సఖి, అందుమంటికి ఆకృతివిశేషములు చిరకాలము దుఃఖభాజనములు కానేరవు. తప్పకుండ ఏదో అనుగ్రహరూప మనసినిమిత్తము నాయకసమాగమకారణమవుతుంది. రా మరి, పోదువనుష్ఠ ప్రేమస్వప్నమును సేవింతాము.

[అనంతరము ఖండధార

[గేయము

చింతావిదూరమానసము
స్నిగ్ధాదర్శసలాలసము
వికచపద్మాంచితసరము
విహరించు హంస కాసారము. ౪

[అని నిష్క్రమింతురు

ప్రవేశకము ముగిసినది.

చతుర్థాంకము

[గేయము]

క. కరిపతి సొచ్చెవని ప్రియా
విరహోన్మాదంబువలనివికృతిఁ దెలుపుచున్
తరుపతితకిసలయసుమో
త్కరమండిత మగుచు భూరికాయమ్మొప్పన్. ౫

[అని పురూరవుని ప్రావేశికి ఆక్షిప్తిక.]

[అంతట ఉన్మత్తవేషముతో రాజు ప్రవేశించును.]

రాజు.—ఆ! ఓరిపాపిష్ఠ రక్కసుడా, నిలునిలు. నా ప్రేయసిం గొని యెట కేఁగెదవు? ఆ! కొండకొమ్మునుండి మింటి కెగసి నామీఁద బాణాలు కురిపించుచున్నాఁడు [బెడ్డ కై కొని కొట్టుటకు పరువిడుచు, అనంతరము ద్విపదికచే దిక్కులు చూచి]

[గేయము]

స్వాంతము సకి వగ యేర్చన్
సరసిఁ దాఁ జట్టుప లార్చన్
అశ్రుపూరితనయనుండై
హంసతరుణుఁడు దీనుండై. ౬

[పరికించి]

మ. ఇది సన్నద్ధము సూత . గిదము, గాఁ
డింద్రారి గర్వాంధుఁడై;
య్యది యింద్రాయుధ మౌను గాని, శ్రవణాం
తాకృష్టమౌర్వీలతా గాఁ;
దిది యూసారము గాని, కుల్కి తతి గాఁ
దీహైమకాషాభ నా
హృదయాధీశ్వరి గ్రమ్మ యున్నదియుఁగా
దే, శంప యూ [illegible]! 62

[అని మూర్ఛిల్లి పడు. స్వస్థుడై లేచి నిట్టూర్చి.]

క. మదిరేక్షణను హరించెన్
మదమున రక్కసుఁ, [illegible] మం బడితిని నే,
నది సూడ గ్రొ [illegible]
వ దళత్తళ లాండ [illegible] చెడినే.

[ఆలోచించి] రంభాదులు ఎటకేఁగియుండును ?

మ. కినుకన్ శత్రత దిచ్చెమో నుయుఁ దో?
కినుకం జరం బూనదే;
చనెనో నాకము గూర్చి నాయెడ గదన్
స్వాంతంబు భావించి మూఁ;
కొని పో నాయెదురన్ దెగింపుకరె ర
క్షోవీరు లైనన్ సఖిన్ ?
కనుక [illegible] యయత్తినుకె! నిట్టలున్
గారింతువే దైవమా! 63

[అని ద్విపదికచే] [దిక్కులం గాంచి, నిశ్వాసముతో] [అశ్రువులతో] దైవము విపరీతమయినవారికి దుఃఖము వెంట దుఃఖము సంభవించును. ఎట్లన:—

ఆ. వచ్చె నిపుడె నాకుఁ బ్రాణనాయికతోడ
నోపరాని విరహతాపభరము,
అభినవాంబుధరము లాతపద్ధి నడంప
హితము లగుదినములు నివె తోడంగె. 64

[అనంతరమున చర్చరి]

క. జలద, కినియకుము, ముదల; యవి
రళధారాధౌతభాసురదిశాముఖుఁడా;
ఇల గందునేని సకి, న
న్వల నీ వేమి పటిపిన నవారణ సైతున్. ౧

[విహసించి] వ్యర్థముగా నేను నామనస్సులోని పరితాపవృద్ధిని ఉపేక్షించుచున్నాను. మునులుకూడ చెప్పుదురు గదా, 'రాజు కాలమునకు కారణము' అని. కనుక నే నేల మేఘర్తువును మాన్పి వేయఁగూడదు.

[అనంతరమున చర్చరి]

[గేయము]

గంధోన్మత్తమధుకరకలగానము
వాద్యమానపికవాద్యధ్వానము
పవనోద్వేల్లితపల్లవపూరము
ఆడెడిఁ గల్పక మభినయసారము. ౨

[అని వర్తించి] వలదు. వార్షికచిహ్నములచేతనే నాకు రాజోపచారములు ఇపుడు జరుగుచున్నవి. ఎట్లన,—

తే. మించుఁబొన్నించుమేఘంబె మేలుకట్టు,
వీచుఁ బూరెమ్మ చామరల్ వేతసములు,
వందు లగు ఘర్మ మఱి నెలుం గొందుశిఖులు,
సెలసరులఁ గానుక లిడెడు బేగు లగు గిరులు. 65

కానీ, ఇట్లు నాపరిచ్ఛదమును శ్లాఘించుకొన్న నేమి ఫలము ? ఈయడవిలోనే ఆ ప్రియను వెదకెదనుగాక.

[మరల చర్చరీపాతాంతమున భిన్నకము]

[గేయము]

అబలావిరహితుఁ డతిదుఃఖితుఁడు
దైవము దూరుచు స్తంభితుఁడు
భూధరవనమునఁ బుష్పోజ్జ్వలమున
గజరాజే గడి క్షీణగమనమున. ౧౦

[చూచి] అయ్యో, వెదకఁ దొడంగిన నాకు సందీపనమువలె అయినది. ఏలన,

తే. గర్భజలము లార కత్తెఖములు నయిన
పుష్పములచేత నిదె నవభూమికదళి
కినుక నంతరశ్రువులె నవనితకనుల
నుత్కలికతోడ స్మరియింప నూన్చె నన్ను. 66

ఈదారిని బోయియుండినను ఆమహానీయను ఎట్లు కనిపట్ట నగును ?

తే. అడుగు లిలమీఁద మోపె నే నాసుగాత్రి
వానఁ దడియుసు నైన యీవనతలమున,
శ్రోణిభరమున మడమలు క్రుంగఁ బాఱు
యావకపుఁజారుపదపంక్తి యగపడెడిని. 67

[ద్విపదిక :] [పరికించి:చూచి హర్షముతో] దొరకినది గుర్తు, దీనిచేత ఆకోపనమార్గమును ఊహింప నగును.

తే. మగ్ననాభి రుమాసంభ్రమగతి నడువఁ
గాఱునశ్రుల మోవిరాగంపుగుర్తు
లైనది యిది శుకోదరశ్యామలంబు
చ్యుతము నిస్సంశయము స్తనాంశుకము! బళిరె. 68

[అరసి] ఏమి! ఇంద్రగోపములతోడి క్రొత్తపచ్చిక బయలు ఇది. ఈనిర్జనవనమున యీవృత్తాంతము ఎట్లు తెలియును? [చూచి] అహా! జడివానకు ఉబ్బినశిలాజతుస్థలి పాషాణము నెక్కి,—

ఆ. తూర్పుగాలిజుట్టుఁ ద్రోచుచు నుండంగ
నంబుదముల నెమలి యట్టె గాంచు,
గర్భమందు గేక గాలుకంఠంబును
సాఁగినంతపయికి సాచికొనుచు. 69

[సమీపించి] దీని నడిగెదను.

[గేయము]

సంప్రాప్తాపద్భారుం డై,
క్షణహతపరేభవారుం డై,

కాంతాదర్శనలాలసుఁ డై,
కరిపతి విస్మితమానసుఁ డై. ౧౧

[దానితో ఖండకాంతమున చర్చరి]

[గేయము]

కేకిసార్వభౌమ, లోకానందన,
కేల్మోడ్చి నిన్ను వేఁడెదను,
ఈకానలోఁ గంటె యెందేని నాప్రియఁ
జెప్పుమి దయఁ బూనియెదను
వినవయ్యా చెప్పెద వనితను గనిపట్ట
స్పష్ట మయినయానవాలు,
రాకాచంద్రానన రాజహంసయాన
యీపాటియే నీకుఁజాలు. ౧౨

[చర్చరికచే కూర్చుండి ప్రాంజలి యై]

తే. కల దయా నాకు నుత్కంఠ కాలకంఠ,
ఆయతాపాంగ నోసితాపాంగ నీవు
చూచుకన్నోయి తనియనిసొగసుకత్తె
వనిత నొకర్తెఁ గంటివో వనతలమున.

[చర్చరికతో చూచి] ఏమి? బదులు పలుకకయె నర్తింపం దొడంగినది! దీనికి హర్షకారణ మేమి? [చింతించి] కానీ యిది తెలిసినది.

ఉ. నాప్రియ కానరానికత
నన్మృదువాతవిభిన్నబర్హ మై

యేపున నిస్సపత్నత వ
హించెడి నీయహిభోజి యిప్పు; డో
రా! ప్రియ కేశపాళి పురు
షాయిత కేళివిశీర్ణ బంధమై
ప్రాపితపుష్పదామముల
భాసిల, మౌళిల ని దేమి సేయునో? 71

కానీ ఒరులవ్యసనముచే సంతసించెడి దీనిని అడుగను. [ద్విపదికచే దిక్కులు సూచి] [పరిక్రమించి] ఇది కోయిల కోమలి, ఎండల కనంతరము మదమేచి నేరేటి చెట్టున నెల కొన్నది. పక్షులలో ఈజాతి పండితము. దీనిని ప్రార్థింతునుగాక.

[అనంతరమున ఖురకము]

[గేయము]

విద్యాధరవనలీనుం డై,
విపులబాష్పనయనుం డై,
గజపతి యడలునఁ గలఁగుచు,
గగనము గొల్చుచు మెలఁగుచు. ౧౩

[ఖురకాంతమున చర్చరి]

సఖి ! సఖి !

[గేయము]

నందనవనిని స్వచ్ఛందగామినీ
కలవాణీ పికకామిని,

నాతోఁ జెప్పవె నఖ్యలి యొప్పంగఁ
బ్రియుఁ గంటేని నే నుప్పొంగ. ౧౮

[దీనినే స్మరించి వలంతికచేఁ దటెసి మోఁకరించి]
అమ్మా,

తే. కాముదూతి వటంచు నిర్గామిజనులు,
మానహరణాప్రతిహతాస్త్రమంత్ర మీవు;
ప్రియతమను నాకడకు నేని వేగ తెమ్ము,
కొనుము కలవాణి నన్నని కొమ్మకడకు. 72

*వామకముచే ఇంచుక మరలి ఏమనెదవమ్మా నీవు?
'నిన్ను ఇంత యనురక్తుని విడిచి ఎట్లు పోయినది' అని అడిగె
దవా? చెప్పెదను వినవమ్మా.

తే. కోప మూనిన దేని యాకోపమునకు
హేతు వొకటియు నాయందు నే నెఱుంగ;
ప్రియతములయం దెటును నపేక్షితములు
ప్రభుత భావస్థలితములు ప్రమినులకు. 73

ఏమి! కథాచ్ఛేదము కావించి తనపనిలోనే చొచ్చినది.

తే. ఒరులవగ పెంతయినఁ జల్ల నుంట నిజమె,
ఇదుమవా లైననాయాజ్ఞ నెడఁగఁ ద్రోచి
ఆను నభినవపాక మియ్యది మదాంధ
రాజజంబూఫలము నధరమును బోలె. 74

ఇట్లయినను నాప్రియవలె మంజులస్వన యగుటంబట్టి
ఈమెయందు నాకు కోపము లేదు. ఇచటినుండి నేను [ద్విప

దిశచే] [పరిక్రామితకముచేత చెవి యొగ్గి] అహో! దక్షిణమున ప్రియాచరణన్యాసమును అందెరవళి తెల్పుచున్నది! కానీ, అట కేఁగెదను. [పరిక్రమించి

[గేయము]

దయితావిరహాతాంతవదనుఁడు,
అవిరళబాష్పనయనుఁడు,
శోకభారవిసంష్ఠులగమనుఁడు,
గురుతాపదీపితతనుఁడు,
కరిపతి దూనుఁడై గవి నున్నవాఁడు
కానలోఁ దిరుగుచున్నాఁడు. ౧౫

[అని కకుభముచే ఆఱు ఉపభంగములు; అనంతరమున ద్విపదికచే దిక్కులు సూచి]

[గేయము]

ప్రియకరిణీవిశ్లేషితుఁడై,
గురుశోకానలదీపితుఁడై,
బాష్పజలావిలలోచనుఁడై,
కరిపతి దిరుగు దీనాననుఁడై. ౧౬

అయ్యో! ఇసీ ఇసీ!

*క. జలదముల నిర్ఘోషనుది
కుఱలఁ గన్గొని మానసమునకు సముత్సుకతఁ

---

*క. ఘనముల నిర్ఘోష నెడిఁ క | లను గని మానసమునకును లాలసతోఁ దఱి
జనుఁ గోరు రాజహంసునిధ్వని | యిది మంజీరశింజితము గాదు కటా?

వెలలేడిమదకలహంసల
కలరుత మిది, యందెరవళి గాదాయెఁ గటా! 75

కానీ, మానసోత్సుకము లయిన యీపక్షులు సరస్సు నుండి ఎగిరిపోకమునుపే వీనివలన ప్రియావృత్తాంతమును తెలిసికొనవలయును. [వలంతిక చేత సమీపించి] ఓహోయి జలవిహంగమరాజా,

తే. పోవుదువు గాక మానసమునకు వెనుక,
వదలు బత్తెంపుబిసముఁ గొనెదవు పిదప,
తీర్తు గాక నావగ ప్రియవార్త దెలిపి,
తనపనికి మున్నె కృతి చెలిపనిని జేయు. 76

నీవు తలయెత్తి మిన్ను సూచటచేత 'మానసోత్సుకుఁ డను నేను చూడ నయితిని' అని పల్కెదవా? [కూర్చుండి చర్చరి]

[గేయము]

తస్కర, హంసా, దాఁతువు రా

[అని నర్తించి లేచి]

తే. సువదనను నాదు ప్రియతమఁ జూచి తీవు
కొలనిదరి నంచ, కానిచోఁ గొంటి వెట్లు
మదవిలాసపదముఁ దద్గమనము నెల్లఁ,
దెక్కలివి, లేదు కా దనఁ దెగువ గలవు. 77

[గేయము]

గతిచేతన నేఁ గంటిని రా.

[చర్చరికతో సమీపించి కేలు మోడ్చి] అందువలననే

క. నాకొమ్మ నిమ్ము హంసమ,
కైకొంటి తదీయ మైనకాంతగతంబుఁ,
ఏకాంశము కనఁబడుచో
నీకొని యభియుక్త మెల్ల నియ్యాన వలయుఁ. 78

[మరల చర్చరి]

[గేయము]

కఱచితి వెట నీగతి గతిలాలస ?
సకిని గంటివి పో జఘనభరాలస. ౧౭

మరల చర్చరి] 'నాకొమ్మ' ఇత్యాది పఠించి] [ద్విపది కచే నిరూపించి] [విహసించి] ఇది దొంగలను దండించువాఁడు రాజు అని భయముచేత ఎగిరిపోయినది. [పరిక్రమించి] ఇది యిట ప్రియాసమేతము చక్రవాకము. దీని నడిగెదఁగాక.

[అనంతరమున కుటిలిక]

[గేయము]

మత్తరరణితకచారువున [మల్లఘుటి—]
కుసుమితపల్లవితతరువున, [చర్చరి—]
దయితావిరహోన్మాదమున
కరిపతి త్రిమ్మరు గహనమున. ౧౮

[ద్విలయాంతమున చర్చరి]

[గేయము]

గోరోచనాకుంకుమవర్ణాంచిత జక్కవరాణి నాప్రియను,
ఆమనిపవల విహారము సల్పఁగఁ గంటేని చెప్పుము దయను.

[చర్చరికతోఁ దఱిసి మోఁకారించి.]

క. ఓయీ రథాంగ, యీరథి
ప్రేయసిఁ బాసెను రథాంగవిజయిశ్రోణిన్
నీయెడ ననుయోగంబున్
జేయు మనోరథశతంబుచే వ్యతుఁ డగుచున్. 79

ఏమి! 'కః కః' అన్నదే, ఇది నన్ను తెలిసికోలేదా?

క. ఎవనికి రవియున్ శశియున్
దవుదురొ మాతామహుఁడుఁ బితామహుఁడును నై,
ఎవని వరించిరో యిరువురు
ధవు గా న్వయ ముర్వరయును దా నుర్వశియున్. 80

ఏమి ఊరకున్నది! కానీ, దీనిని చీవాట్లు పెట్టెదను.

చ. సరసిని దామరా కొకటి
చాటగుమాత్రన నీవు నీసకిన్
బోరయక దూర మేగ నని
పొక్కుచు బెల్లెలుగిత్తు, నీ కిటుల్
పరఁగుఁ బ్రియానురాగమున
బాసి వసించు భయంబు, ప్రేయసీ
విరహికి నాకు నీక్రియ బ్ర
వృత్తిపరాఙ్ముఖతన్ వహింతువే! 81

ఎల్లప్రకారములను నాయదృష్టవిపర్యాసము ప్రభావము సూపుచున్నది. వేఱవకాశము చూచుకొనెదను. [పదాంతరమున నిలిచి] కానీ, ఇటనుండి జరుగను. [ద్విపదికచే పరిక్రమించి, అవలోకించి]

ఆ. లోనఁ దేఁటి యులియఁగా నొప్పుసీతమ్మి
యేఁగనీదు నన్ను నిచటు దలఁగి,
నేను మోవి చుఱుకుగా నొక్కు సీత్కార
ముగ్ధమైనకాంతముఖము వోలె. 82

కానీ, కమలాధ్యాసి యైన యీమధుకరమునుగూర్చి యే యాచకుడ నయ్యెదను. ఇటనుండి పోయి పశ్చాత్తాప పడనేల ? [దీని యంతరమున అర్ధద్విచతురస్రకము]

[గేయము]

క్రమవృద్ధగురుప్రేమరసంబున
ఆడుఁ గోడెహంస కామరసంబున. ౨౦

[చతురస్రకముచేత దఱిసి కేలు మోడ్చి]

ఆ. మధుపమా, వచింపు మదిరాక్షివార్తను,
[విభావించి]
వలవ దీవు నాదువనిత గనవు ;
అవదనపుటూర్పు దావి యానితి వేని,
ప్రీతి గొనుదె పుండరీకమందు ? 83

చనియెదనుగాక. [ద్విపదికచేత] [పరిక్రామితకముచేత] ప్రీఁడ కరిరాజు తొండమును ఇప్పమాఁనిపలవమీఁదఁ బెట్టి

కరిణీసమేతుఁడై యున్నాఁడు. ఇతనివలన ప్రియావృత్తాంతము నెఱింగెదను. [సమీపించెదను.] [కుటిలిక చేత]

[గేయము]

దయితావిరహోత్తాపమున

[మల్లఘటి.]

గంధాక్తమధుపుఁడు గహనమున ౨౧

[దానియంతరమున] [చూచి] కానీ, త్వరపడఁ గూడదు.

తే. అభినవోద్భిన్నదళమును నిభవిభుండు
ఆసవసురభిరసము హస్తాగ్రమునను
నోర వల్లభ యిడినయందుగు రివటను
ఆస్వదించును గాక సమగ్రముగను. 84

[క్షణమాత్ర ముండి] ఆహా! ఇతఁడు ఆహ్నికమును నెఱవేర్చుకొన్నాఁడు, మఱి యడిగెదను.

[గేయము]

చేమో డ్ప్రెదను జెప్పుము గజపతి
లలిత ప్రహతిశకలితవృక్షతతి,
దూరవిజితకమలారికాంతిని
వీక్షించితె నా వేలుపుటింతిని ? ౨౨

తే. మదకలుఁడ సుందరిని జాంద్రమసకలాభ,
యూధికాశబలాలకయూథనాథ,

కానవే స్థిరయౌవనఁ బ్రాణదయిత
హర్షదాలోక నోయి దీర్ఘావలోక? 85

[హర్షముతో] ప్రియాప్రవృత్తిని చెప్పెడి యీ స్నిగ్ధగంభీరగర్జితముచేత సమాశ్వాసితుఁడ నైతిని. సాధర్మ్యముచేతఁ గూడ నీయందు నాకు మహాప్రేమ.

మ. ననుఁ బేర్కొండ్రు నృపాధిరా జని నినున్
నాగాధిరా జండ్రుగా,
గొన బా నీకును బానధారధుని నా
కున్ యాచకౌఘంబునన్,
కొని న న్నుర్వశి నిన్ను నీవశయు ధ
న్యం జేసి రీస్త్రీమణుల్,
కన నన్నోర్చెలియునుం బ్రియావిరహదుః
ఖం బొంద కీ వుండుతన్. 86

నీవు సుఖముండుము. నేను పోయివచ్చెదను. [పార్శ్వమున చూడ్కి నిగిడించి] ఆహా! సురభికందర మను పేరిది విశేషరమణీయము ఈకొండ యగపడుచున్నది. ఇది అచ్చరలకు ప్రియమైనదియు; నాసుతనువు దీని నెత్తమున దొరకునా? [పరికించి చూచియు] అయ్యో! నాపాపములపంటచేత మేఘము శంపాశూన్యము అయినది. అయినను ఈకొండను అడుగక నివర్తిల్లను. [అనంతరము ఖండిక]

[గేయము]

ఖరఖురదళితక్ష్మాతలుఁడై,-వన-
గహనమునం దవిచలుఁడై,

పూని తనపని లీనుండై,-కిరి-
దారి చను ముదధీనుండై. ౨3

తే. పృథునితంబుండ నీవు నాపృథునితంబ
సంగతానంగ శృంగారమంగళాంగ
పర్వసన్నత నోయి పర్వతవిభుండ
యణుకుచాంతర గంటె వనాంతరమున. 87

ఏమి ఊరక యున్నది! దూరము చేత నామాట వినఁబడలే దని శంకించెద. సమీపమునకుం బోయి యడిగెదను.
[అనంతరము చర్చరి]

[గేయము]

స్ఫటిక శిలాతల భాస్వర నిర్ఝర
బహువిధ సుమనో భర చిత శేఖర
కిన్నరమధు రోద్గీత మనోహర
కనఁబఱుపుము నాకాంతను భూధర. ౨౪

[అని [పరిక్రమించి] [అంజలిసేసి]

తే. సర్వభూభృదధిప సర్వాంగసుందరి
రామ సన్నుతాభిరామకమునఁ
గాననాంతరమునఁ గానంగఁబడియెనే
నాకుఁ బాసినయది నీకుఁ [బ్రి]యుఁడ. 88

[ఆకర్ణించి, హర్షముతో] ఏమి యథాక్రమముగా 'చూచితిని' అని పలికినది. నీవును ఇంతకన్న ప్రియతరమును విందువుగాక. అటయిన నా ప్రియతమ ఎటనున్నది? [నేపథ్య

మున అదే వినఁబడును] హా! ఇసీ! నాశబ్దముననే గుహాముఖ మునుండి వెలువడిన ప్రతిశబ్దము! [విషాదమును రూపించి] బడ లితిని. ఈసెలయేటిదరిని నెలకొని, అలలగాలిని అనుభవించెద. క్రొత్తనీటిచేత కలఁగినదాని నైనను ఈయేటిని చూచుటచేత నాహృదయము ప్రీతి నొందుచున్నది.

ఉ. వీచులు గాఁగ భ్రూకుటులు,
విశ్వణదండజపంక్తి కాంచి గా,
వే చన జాఱుపైఁటవలె
ఫేనచయం బిటు నట్లు నీడ్చుచున్,
ఏచినమేటిసంస్ఖలిత
మెంచుచు క్షిప్ర పద ప్రయాత గ్రుు,
నాచెలి యోర్పు లేక పరి
ణామము నొందె నదీస్వరూపతన్. 89

కానీ, దీనిని యాచించెదఁగాక. [అనంతరము కుటిలిక]

[గేయము]

దయ గొనుమా ప్రియతమ సుందరి నది,
క్షుభితాకరుణశకుంతికా, నది,
ద్వ్యసరి త్తటసముత్సుకా, నది
కల మధుకర ఝుంకారితా, నది. ౨౧

[కుటిలికాంతమున చర్చరి]

[గేయము]

ప్రథమదిశాపవనహత♦ప్రబలోర్మికోర్ధ్వభుజముల

నరించు సలలితుఁ డుదధి♦నాథుఁడు మేఘాంగకముల
శకటాంగహంసకుంకుమ♦శంఖకృతమండనముల
కరిమకరాకులకృష్ణ♦కమలకృతావతంసముల
తటసలిలోద్వేల్లిత♦దత్తహస్తతాళుండు
అవతరించెడి దశదిశల♦నలమునవాంబుకాలుఁడు. ౮౯

[అని దఱిసి [కేలు మోడ్చి]

తే. ప్రియమె పల్కితి, నీయందె ప్రీతి యిడితిఁ,
బ్రణయభంగవిముఖ; వపరత నుంటి;
నే మదపరాధలేశంబు నీవు గంటి?
దాసు నను విడనాడితి వీసుఁ బూని. 90

కాక, ఇది వాస్తవనదియే గావలయు, ఉర్వశి పురూ
రవుని వదలి సముద్రుని అభిసరింపదు గదా. అనిర్విణ్ణతచే
శ్రేయస్సులు కలుగును. కాని ఎచట సువదన నాకంటి కగ
పడక దిచ్చు మొగమయినదో అచ్చోటికే ఏఁగెదను. [పరిక్ర
మించియు చూచియు] ఆహా! ప్రేయసిమార్గముయొక్క గుర్తు
కనఁబడినది.

ఆ. ఎఱ్ఱకడపపుష్ప మిది, దీనిఁ బ్రేయసి
సిగను దోడవుగాఁగఁ జెరివికొనియె
ఎండకారుతుదను హెచ్చరించెడు నని
యఱయకరుల విషమ మైనను ధృతి. 91

[విలోకించి] పరుండియున్న యీ సారంగమును ప్రియా
వృత్తాంతమునకై ప్రార్థించెదను.

[గేయము]

నూతనకుసుమ స్తబకమండితా♦నోకహపర్యంతమున
మదకలకూజతో కోకిలఝుంకృ ♦ స్మధుకరమనోహరమున
ప్రాణాధికనిజకరిణీవిరహ ♦ జ్వాలాకృతతాపమున
విచరించెడి నైరావతద్విపము♦వేల్పులయుద్యానమున. ౯౨

[గళితకము, మో కారించి]

తే. కృష్ణసార ప్రభం బిది కేరు నిచట
గనులపండువు నభినవఘాసపటలి,
గానసేందిర తాఁ దమకమునఁ జూడ
జాఁచినట్టినిడుదకటాక్షం బనంగ. 92

[విలోకించి] ఏమి యిది! నన్ను సరకు సేయనియట్లు పెడమొగం బయినది. [చూచి]

క. కన దీని వచ్చుహరిణిని
జనుగుడువఁగ లేఁగ నడుమఁ జయ్యన నిలుపన్,
అనితరదృష్టుల నిడియున్
గను దానినె తాను భుగ్నకంఠం బగుచున్. 93

[అని నర్తించి, చర్చరి]

[గేయము]

వేలుపుభామిని జఘనభరాలస పీనోత్తుంగ స్తనియు
స్థిరయౌవనయుఁ దనుశరీరయు శ్రీలహంసగతియు [యేని
మింటినొరయుకాననమున దిరుగుచు మృగనేత్రఁ గంటివ
నాకుఁ బలికి యీవిరహాబ్ధి బడిన ననుఁ దేల్పుమ యిఁక నేని.

[తఱిసి కేలు మోడ్చి] ఓయోయి కదుపు నాయకుఁడా,

తే. కంటివో నాప్రియను నీవు కాననమున ?
మానినికి విను చెప్పెద నానవాలు ;
నీదయిత యీమె యెట్లొ యాపై దలియును
సొబగురాలు పృథులనేత్ర సుమ్ము మిత్ర. 94

ఏమి నామాటను ఆదరింపక పెండ్లామువైపు మొగము త్రిప్పుకొన్నది! న్యాయ్యమే. దశావిపర్యాసము పరిభవాస్పదము. ఇటనుండి నేను—[పరిక్రామితకముతో చూచి] ఇది యెట్టిది రాతిపగులులో కనబడుచున్నది ?

ఉ. కాదు మృగేంద్రకృత్తకరి
రక్తవ్యలవంబు, ప్రభాప్రలేపి యా;
కాదు వెలుంగునిప్పుకయు,
గాన సమస్తము దోఁగ వానచే ;
[పరికించి]
ప్రోఁదిగ రక్తవంజుళము
బోలెడి రక్తిమ, బద్ధరాగ మా;
నాదట దీని నెత్తబలె
నరుఁడు దా గమించెం గరంబులన్. 95

ఇది నామనస్సును కారించుచున్నది.

[గేయము]

ప్రణయనీబద్ధాకాంక్షుండు
బాష్పాకులనిజాక్షుండు

గజపతితిరుగు దుఃఖాన
తూమితాస్యుడు కానలోన. 29

[ద్విపదికచేఁ దతిసి, కైకొనుటను నటించుచు.] దీనిం గైకొనియెద. అయినను ఏల యిది!

తే. ఎవతుకకుఁ బారిజాతంపు బువులతావి
గుబులుకొనుసిగలో దీని గూర్పఁ దగునొ
ఆమనోనాయిక యలభ్య యయ్యె; నింక,
నశ్రునిహతంబు దీనిఁ జేయంగ నేల? 96

[నేపథ్యమున-వత్సా! పుచ్చుకో పుచ్చుకో.

క. ఇది సంగమనీయాఖ్యక
గదితం బగుమానికము, నగప్రభుపుత్రీ
పదరాగజనిత; యిది దా
ల్ప దయితజనసంగమంబు పరగుక దోడ్తోక.] 97

రాజు.—[చెవి యొగ్గి] ఎవరు నన్నిట్లు శాసించుచున్నారు? [దిక్కులు గని] అహో! ఎవరో భగవానుడు-మృగచారి ముని నన్ను కనికరించుచునాఁడు. భగవానుఁడా, నీ యుపదేశమువలన నేను అనుగృహీతుడను. [మణిని కైకొని] ఓహో సంగమనీయమా!

తే. అబల నను బాసె నయ్యు మగ్నావలగ్న,
మమ్ము గూర్చెద వేని యో మణిశరీర,
నిను శిఖామణిగ ధరించుకొనెద నేను,
బాలునిం జంద్రు నలమహేశ్వరుడు వోలె. 98

[పరిక్రమించి చూచి,] ఏమి యిది? ఆహా! పూవులు లేనిదానినే అయినను ఈతీగను చూడఁగా నాకు రతి కలిగి నది! కాకేమి? యుక్తమే ఇది నామనోరమయగుట. ఏలన, నిది.——

తే. వర్షమునఁ దోఁగియున్నట్టిపల్లవంబు
బాష్పధౌతం బయినమోవి వడువు దాల్ప,
తనదుతఱి గామిఁ బూవక తనరుతీరు
భూషణంబులఁ దాల్పనిపోలుపు చూప,

తే. మధులిహంబులయులివ్రులు మాని యుంట
చింతచే నైనమౌనంపుఁజెన్ను నెరప,
ప్రణతు ననుఁ ద్రోచి యనుతాపభరము గొన్న
తన్వని మదీయ నిలత తన్వి పోలు. 99

ప్రియానుకారిణిని దీనిని కౌఁగిలింపఁ గోరెదను.

[గేయము]

తీవా, కనుమా మొద లేకయె నేఁ దిరిగెద నీవనమందు,
దైవయోగమునఁ గందుస యేని దయితారత్నము నిందు,
మఱి కృతాంతమున నీయరణ్యమున మానిని నుంపను క్షణము,
కొని చని చేయుదు వెండి దీనిఁ గనఁ గోర నీని రక్షణము. ౩౦

[అని (చర్చరికచేఁ దఱిసి) లతను ఆలింగనము చేయును.]

[అంతట దానితావున నుర్వశి ప్రవేశించును.]

రాజు.——[కన్నులు మూసికొనియే స్పర్శసుఖమును రూపించి] ఏమి యిది? ఉర్వశి నెమ్మేనిసంపర్కమునం బోలె

నాశరీరము నిర్వృతిం జెందినది! అట్లయినను, నాకు విశ్వాసము జనింపకున్నది. ఏలన—

తే. కందు నే దోల్త దేని నాకలికిఁ గాఁగ,
నిముసమున నది వే ఱయి నెగులు గొల్పె;
కాన స్పర్శవిభ్ర వితఁ గాంత దీనిఁ
గనఁగఁ దెలివను దెలివను గన్నుఁగవను. 100

[మెల్లఁగా కన్ను దెఱచి] ఏమి! సత్యముగా ప్రియతమయే!

ఉర్వశి.—[బాష్పములు విడిచి] జయంజయం నీకు మహారాజా.

రాజు.—

తే. తమమున భవద్వియోగజాతమునఁ జండి
మునిఁగి యడు గంటుచున్నావనట దీఱ
భాగ్యవశమున వెండి ని న్బడసినాఁడ,
నపగతాసుండు చేతన నందినట్లు. 101

ఉర్వశి.—మహారాజా, ఆలాగే; అంతఃకరణంచేత నీ వృత్తాంతాన్ని సాక్షాత్కరిస్తూనే వుంటిని.

రాజు.—అంతఃకరణము అన్నమాట నాకు బోధపడకున్నది.

ఉర్వశి.—విను. ఇందుకు మహారాజు నన్ను క్షమింపవలెను. ఎందు కనగా, నేను కోపవశనై మహారాజును ఈ యవస్థాంతరము పొందించితిని.

రాజు.—కల్యాణీ, నన్ను ప్రసన్నం జేయ నక్కఱ లేదు. నిన్నుఁ గన్నంతనే నాయాత్మ ప్రసన్నబాహ్యాంతఃకరణ మయినది. చెప్పుము చెప్పుము. ఇంతకాలము నేను లేక నీవు ఎట్లు ఉంటివి ?

[అనంతరము చర్చరి]

[గేయము]

అసితకంఠముఁ, బికి, నంచ, రథాంగముఁ
దుమ్మెదఁ, గరి, గిరి, ధునిని, గురంగము,
నినుఁగూర్చి వనిలోన నేను భ్రమించుచుఁ
బరువడి నడిగితిఁ బరిదేవించుచు. 30

ఉర్వశి.—అవధారు మహారాజా. కుమారస్వామి శాశ్వతకుమారవ్రత మవలంబించి అకలుష మనే పేరిగంధమాదనకచ్ఛాన్ని ఆశ్రయించినాడు. ఈవిధి యేర్పఱిచినాడు.

రాజు.—ఏమివిధి?

ఉర్వశి.—ఈచోట ఎవతె ప్రవేశిస్తుందో అది లతయై పోతుంది. గౌరీచరణసంజాత మయినమణిచేత తప్ప తొంటి రూపాన్ని పొందదు. అట్లుండగా నేను గురుశాపవిమోహితాత్మనై దేవతావిధిని మఱచి నీయనునయాలకు లోఁగక ఈ కుమారవనాన్ని చొచ్చితిని. చొచ్చినంతనే బండిగురివెంద తీవ నయితిని.

రాజు.—సర్వము ఉపపన్నము.

క. నను సురతఖేదసుప్తని
వనిత విదేశగతుఁగాఁగ వగచెదు సెజ్జన్,
ఎన లేని యీచిరవియు
క్తి నీదృశము నెట్టు లోర్చితివి చెప్పు సఖీ. 102

నీవు చెప్పిన యీమణిని నీసంగమకారణమును ముని వలనం బొంది మణిప్రభావమున నిన్ను మరల నేను పొందితిని. (అని మణిని చూపును.

ఊర్వశి.—అహో! సంగమనీయమా! అందువల్లనే గదా మహారాజు నన్ను కౌగిలించినమాత్రాన తొంటిరూపు పొందితిని. (మణిని కైకొని ఔదలం దాల్చును.

రాజు.—సుందరీ, ఇటె క్షణమాత్ర ముండు.

క. నుదుటం బెట్టినయీమణి
నుదయించినరాగ మొలయ నొప్పారెడి నీ
వదనము లేయెండకుఁ గెం
పొదవిన నెత్తమ్మిలక్ష్మి కుపమానం బై. 103

ఊర్వశి.—ప్రతిష్ఠానమునుంచి నీవు వచ్చి చిరకాల మయినది. ప్రకృతులు నాపై అసూయ వహింతురు. కావున మరలుదాము.

రాజు.—నీ వాజ్ఞాపించినట్లు.

ఊర్వశి.—మహారాజు ఎట్లు పోగోరును.

రాజు.—

క. స్ఫురియించుమించు సిడముగ
సురచాపము నూత్నచిత్రశోభగఁ గ్రొమ్మ
బ్బు రహించువిమానముఁ జే
సి రయంబున నన్ను వసతిఁ జేర్పుము తరుణీ. 104

[చర్చరి

[గేయము]

సహచరితోడను సంగతుఁడై
అఖిలగాత్రపుల కాంకితుఁడై
స్వేచ్ఛాప్రాప్తవిమానమున
హంసయువ చను విహారమున. 3౨

[అని ఖండధారచే నిష్క్రమింతురు.

చతుర్థాంకము సమాప్తము.

పంచమాంకము

[అంతట పరితుష్టుఁడు విదూషకుఁడు ప్రవేశించును.]

విదూ.—సంతోషం సంతోషం! చిరకాలము ఉర్వశీ సమేతుఁడై నందనవనం మొదలైనదేవతారణ్యములలో విహరించి ప్రియవయస్యుడు మరలివచ్చినాడు. ఇప్పుడు సత్కారోపచారాలతో ప్రకృతులచేత అనురంజనం పొందుతూ రాజ్యము చేస్తూవున్నాడు; సంతానము లేమి తప్ప ఆతనికి ఏకొరతా లేదు. ఈదినము తిథివిశేషమని గంగాయమునాభగవతుల కూడలిలో దేవేరులతో స్నానమాడి రాచగూడారం ప్రవేశించినాడు. కనక ఆతని యలంకరణసమయంలో తొలివాడ నౌతాను.

[అని పరిక్రమించును.

[నేపథ్యమున]

అయ్యో! అయ్యో! విసనకఱ్ఱమీద తెల్లపట్టువస్త్రం మీద ఉంచి తీసుకొనివెళ్ళుతున్న దానిని అంతఃపురవిలాసినులు మౌళిలో ధరించడానికి యోగ్యమయిన మణిని ఎరచి భ్రమచేత గద్ద తన్నుకొనిపోయింది.

విదూ.—[చెవియొగ్గి] అక్కటా! అక్కటా! అది సంగమనీయమనే చూడారత్నము, వయస్యునికి అత్యంతం ప్రియం గదా. అందువల్లనే గదా ఆయన ముగియని నేపథ్యముతోనే ఆసనమునుండి లేచి ఇటే వస్తున్నాడు. ఇతనిని కలసికొంటాను.

[అంతట ససంభ్రమపరిజనుఁడు రాజు ప్రవేశించును.]

రాజు.—

తే. ఎక్కడను జూపుమా పక్షి తెక్కలీఁడు?
ఎవఁడు ప్రాణంబు చేఁ దయి మృత్యు వెనయ
తనమొదలి-చోరకృత్యంబు దా నొనర్చె
శాసకునియింటనే పటుసాహసమున. 105

కిరాతి.—ఇదుగో, ఇదుగో, నోటికొనను తగులొని వున్న బంగారంపుదారములోని మణితో ఆకాశాన్ని చిత్రిస్తూ వున్న దనేలాగ సుడుస్తున్నది.

రాజు.—నాకును కనఁబడుచున్నది.

తే. నోర మణివేత్రులజాళు, దార మొప్ప,
మింట వడి మండలముల భ్రమించుకతనఁ,
గొలవి గిలగిలఁ ఇరిగెడి తెలుఁగు దోఁప
రాగరేఖావలయము లేర్పఱుచుఁ బులుఁగు. 106

ఇప్పుడు ఏమి చేయవలయును?

విదూ.—[సమీపించి] దీనిమీద కనికరింపరాదు. ఇది దండనీయము.

రాజు.—నీవు చెప్పినమాట సరి. విల్లు విల్లు విల్లు!

[ధనుర్గ్రాహిణి యవని నిష్క్రమించును.

రాజు.—వయస్యుఁడా, పక్షి అగపడలేదే.

విదూ.—ఇటనుండి దక్షిణపుతుదమీదుగా పోయి నది దండనీయమైన పీనుగుమేతరి.

రాజు.—[తిరిగి చూచి] ఇప్పుడు కనఁబడుచున్నది.

తే. నిగ్గు లిపురులఁ బోలుమానికముచేత
వంజుళపువిరిగు త్తిచే బలె ఖగంబు
దిగ్వధూ వక్త్రమునకు సాధించెఁ జూడఁ
జారుతరము వతంస ప్రసాధనంబు. 107

యవని.—[చాపహస్త ప్రవేశించి] ప్రభూ, ఇదుగో, విల్లు, అత్తెముకూడ.

రాజు.—ఇఁక నిపుడు వింటివలన నేమి కార్యము. ఆ పాలతిండి బాణమార్గమును దాటిపోయినది. అట్లే గదా.

తే. ఖగము దవ్వుగఁ గొనిచన్న కారణమున
మెఱసెడిని మానికం బది మింట నిపుడు,
పరుషజలధరచ్ఛేదంబుదరిని రాత్రిఁ
గ్రాలుచుండునంగారక గ్రహము వోలె. 108

[అంగజాలను గాంచి] లాతవ్యా, మామాటగా చెప్పుము నాగరికునితో సాయంకాలమున నివాసవృక్షమును చేరు నీదొంగపక్షిని వెదకు మని.

కంచుకి.—ఏలినవారియాజ్ఞ. [అని నిష్క్రమించును.

విదూ.—ఇప్పుడు నీవు కూర్చుండు. ఈరత్నపుదొంగకు ఎక్కడికిపోతే నీ శాసనము తప్పుతుంది?

రాజు.—[విదూషకునితోఁగూడ కూర్చుండి] వయస్యా,
క.రతన మ్మని గాదు పతగ
హృతమునకై నాప్రయాస, హృదయసఖీసం

గతు: జేసి చేసి ననుఁ బ్రా
ణితు సంగమనీయ మనుమణి యిది వయస్యా. 109

విదూ.—ఈయర్థమును పూర్వమే నాకు చెప్పి యున్నావు.

[అంతట బాణమును మణిని తెచ్చుచు కంచుకి ప్రవేశించును.]

కంచుకి.—జయము జయము దేవరకు.

క. రోపత నొందిననీయా
కోపముచే వ్రస్సి పులుఁగు కూలెను మణితోఁ,
బ్రాపించి నేరముస కను
రూపం బగువధము ధర్మరూఢిగ దేవా. 110

[అందఱు ఆశ్చర్యము రూపింతురు.

కంచుకి.—నీటితోఁ గడిగిన యీమణిని ఎవరిచేతి కిత్తును ?

రాజు.—కిరాతీ, దీనిని అగ్ని శుద్ధము గావించి పెట్టెలో నుంపుము.

కిరాతి.—ఏలినవారియాజ్ఞ.

[అని మణిం గొని నిష్క్రమించును.

రాజు.—లాతవ్యా, ఈబాణము ఎవనిదో నీ వెఱుఁగుదువా ?

కంచుకి.—చెక్కిన పేరు కనఁబడుచున్నది, గాని నా దృష్టికి అక్షరములను కనిపట్టుశక్తి లేదు.

రాజు.—అటయిన ఆబాణము ఇటు తెమ్ము.

[కంచుకి అట్లు చేయును.

[రాజు నామాక్షరములం జదువుకొని సంతానవంతుఁ డయినట్లు రూపించును.

కంచుకి.—నాపని నేను చూచికొనెదను.

[అని నిష్క్రమించును.

విదూ.—ఏమి విచారిస్తున్నావు ?

రాజు.—విను మఱి ఏసినవాని పేరి యక్షరములను.

[చదువును]

తే. ఔర్వశేయుండు విలుదాలు పైలసుతుఁడు
ఆయువు కుమారుఁ డవనిలో నతిబలుండు
ఆతనిది యని మెఱుఁగుఁ డీయాశుగంబు;
అపహరించును బగతురయాయువులను. 111

విదూ.—[పరితోషముతో] ఆహాహా! నీవు సంతానవంతుడవై వర్ధిల్లుతున్నావు!

రాజు.—సఖుడా, ఇది యెట్లు ? నైమిశేయ యాగసమయమునఁ దక్క నేను ఉర్వశిని ఎడఁబాయలేదు, నేను గర్భవ్యక్తిని కనిపట్టియేని యుండలేదు. మఱి ప్రసవమే ఎట్లు? అయినను,

క. నలు పెక్కెను జన్నుమొనల్,
తెలుపెక్కెను లవలిదళము తెఱఁగున మొగముం,

చెలువ కొంకకొన్ని దినములు
వలయంబులు జాఱినట్లు వపువు దలిర్చెఁ. 112

విదూ.—నీవు దివ్యస్త్రీలకి అన్నిటను మానుషీధర్మమే అని తలచకు. వారి చరితములు ప్రభావముచేత దాగివుండును.

రాజు.—కానీ నీవన్నట్లే అగునుగాక. మఱి పుత్రుని దాఁచుటలో ఆమహాశయకు కారణ మేమి?

విదూ.—దేవతారహస్యములు ఎవరు తర్కించగలరు?

కంచుకి [ప్రవేశించి].—జయము జయము దేవరవారికి. దేవరా, చ్యవనాశ్రమమునుండి కుమారుం దోడ్కొని దేవరను కాంచుటకై తాపసి వచ్చియున్నది.

రాజు.—ఇరువురను అవిలంబితముగా ప్రవేశపెట్టుము.

కంచుకి.—దేవరయాజ్ఞ. [అని నిష్క్రమించి చాప హస్తుఁడగు కుమారునితోను తాపసితోను ప్రవేశించును.

కంచుకి.—అమ్మా ఇటు ఇటు.

[అందఱు పరిక్రమింతురు

విదూ.—[చూచి] ఏమి? గద్దను గుఱిపెట్టి యేసిన ఆ అర్ధనారసాన చెక్కిన పేరిఁవాడు ఆక్షత్రియకుమారుడు ఇతడేనా? అట్లే; నిన్ను బహుతరంగా పోలివున్నాడు.

రాజు.—అట్లే ఉండును. అందువలననే—

తే. అశ్రులుబుకును వీని. గన్గొంతఁ గనుల,
స్వాంతమునఁ బ్రేమ, మదిని బ్రసాద మొలయు,

గళితధైర్యుఁడ, వడఁకునంగములతోఁడ
సదయముగఁ గౌఁగిలింపఁ గోరెదను వీని. 113

కంచుకి.—భగవతీ ఇట్లుండుఁడు.

[తాపసీకుమారులు అట్లే ఉందురు.

రాజు.— అమ్మా నమస్కారము.

తాపసి.—మహారాజ, సోమవంశవర్ధనుఁడవు కమ్ము. [ఆత్మగతము] అహాహా చెప్పకుండనే తెలియవచ్చుచున్నది. ఈరాజర్షికి వీనితోడి యౌరససంబంధము [ప్రకాశము] బాల కా, మీనాయనకు మ్రొక్కుము.

[కుమారుఁడు చాపగర్భముగా అంజలి సేయును.

రాజు.—ఆయుష్మంతుఁడవు కమ్ము.

కుమా.—[ఆత్మగతము]

ఆ. ఇతఁడు నాయన యని సుతుఁడను నే నని
వినఁగ నిట్టిప్రేమ ప్రిదిలె నెదను;
ఒడులయందుఁ బెరుఁగుబుడుత కెంతటిప్రేమ
గురువుదేలుకొనదొ గురులమీఁద ? 114

రాజు.—భగవతీ, ఏప్రయోజనమునకై మీరాక ?

తాపసి.— వినుము మహారాజా, ఈదీర్ఘాయువును ఆయువును పుట్టినప్పుడే ఉర్వశి ఏనిమిత్తముననో నాచేతిలో ఇల్లడ యుంచినది. క్షత్రియకుమారునికి వలసిన జాతకర్మాది విధానమును సర్వమును ఇతనికి భగవానుఁడు చ్యవనముని

గావించినాఁడు. ఇతర విద్యలు నేర్పి ధనుర్వేదమందును నేర్పించి గావించినాఁడు.

రాజు.—సనాథుఁడ నైతిని గదా.

తాపసి.—ఇప్పుడు పుష్పసమిధలకొఱకు ఋషి కుమారులతోఁ గూడ ఇతఁడును వచ్చి ఆశ్రమవిరుద్ధ మాచరించినాఁడు.

విదూ.—[ఆవేగముతో] ఏలాగు?

తాపసి.—మాంసము తెచ్చుకొని గద్ద చెట్టుకొనను వాలుచుండ గా వీఁడు దానిని కోలకు గుఱిచేసినాఁడు.

[విదూషకుఁడు రాజును చూచును.

రాజు.—తర్వాత తర్వాత ?

తాపసి.—అంతట ఆవృత్తాంతము నెఱింగి భగవంతుఁడు చ్యవనముని నన్నాజ్ఞాపించినాఁడు:—'నీ చేతి యీయిల్లడను పంపివైపుము' అని. కావున, దేవిని ఉర్వశిని చూడఁ గోరుచున్నాను.

రాజు.—అటయిన, అమ్మగారు కూర్చుండ ననుగ్రహింపవలయును.

[తెచ్చియుంచిన యాసనములో తాపసి కూర్చుండును.

రాజు.—లాతవ్యా, ఉర్వశిని పిలుచుకొనిరా.

కంచుకి.—దేవరయాజ్ఞ. [అని నిష్క్రమించును.

రాజు.—[కుమారుం గాంచి] రా రమ్ము వత్సా ;

తే. సుతతనుస్పర్శ సకలాంగహిత మటంద్రు,
గాన నాదుకుమారక చాని నొసఁగి
నన్ను నాహ్లాదభరితు నొనర్పు వేగ
కాంత మిందుకర మిందుకాంతము బలె. 115

తాపసి.—జాతా, నాయనకు ఆనందము సేయుము.

[కుమారుఁడు రాజును దఱిసి పాదములం బట్టుకొనును.

రాజు.—[కుమారుని కౌఁగిలించి, పాదపీఠమునఁ గూర్చుండ బెట్టి,] ఇతనిని నీతండ్రికి ప్రియసఖుని బ్రాహ్మణుని అశంకితముగా ప్రణమిల్లుము.

విదూ.—ఏల శంకిస్తావు? శాఖామృగము ఆశ్రమవాసమున పరిచితమే.

కుమా.—[చిఱునవ్వుతో] బాబూ, నమస్కారము.

విదూ.—నీకు స్వస్తి,

[అంతట ఉర్వశియు కంచుకియు ప్రవేశింతురు.]

కంచుకి.—ఇటు ఇటు దేవి.

ఉర్వశి.—[కుమారుం గాంచి] ఎవ రితఁడు? కేల విల్లున్నది, మహారాజు స్వయంగా పాదపీఠాన పిల్లజుట్టు ముడుస్తున్నాడు. [తాపసిని గాంచి] ఆహాహా! సత్యవతితోటి నా పుత్రకుడు ఆయువు; పెద్దవాడయినాడు. [పరిక్రమించును.]

రాజు.—[ఉర్వశిం గాంచి]

క. చనుదెంచెను గౌతుకమున
నినుఁ గని కనుబండు వొంద నీజనని సుతా,

అనురక్తి మొయిం జేఁపిన
చనుఁగవ పాలకుఁ దడిసిన చనువలిపముతోన్. 116

తాపసి.—జాతా, రా, లేచి అమ్మకు ఎదురేగుము.

[కుమారుఁడు ఉర్వశికి అభ్యుద్గమనము సేయును.

ఉర్వశి.—అమ్మా, నీపాదములకు మ్రొక్కెదను.

తాపసి.—బిడ్డా, భర్తకు బహుమతవు కమ్ము.

కుమా.—అమ్మా, అభివాదనము చేసెదను.

ఉర్వశి.—[కుమారుని ఉన్నమితముఖుని కవుంగిలించి] వత్సా, నాయనను ఆరాధించువాడవు కమ్ము. [రాజును దఱిసి] జయము జయము నీకు మహారాజా.

రాజు.—పుత్రవంతురాలికి స్వాగతము. ఇట కూర్చుండుము. [అర్ధాసన మొసంగును.

[ఉర్వశి కూర్చుండును. అందఱు యథోచితముగా కూర్చుందురు.

తాపసి.—ఓసి వత్సా, ఈతఁడు ఆయువు విద్యలు నేర్చినాఁడు, ఇప్పుడు కవచధరుఁడయినాఁడు. కావున ఇదె నీవుంచిన చేతియిల్లడను నీభర్త సమక్షమున నీకు అప్పగించి వైచితిని. నాకు సెలవిందు; నేను పోయివచ్చెదను. నా యాశ్రమధర్మము నిర్బంధించుచున్నది.

ఉర్వశి.—చిరకాలానికి ఆర్యను చూచి బొత్తిగా తనివి దీఱకున్నాను. పోయి రమ్మననేరను. నిర్బంధించి నిలపడం న్యాయంగాదు. కనక ఆర్యా పోయిరా, మళ్ళీ దర్శనం కలుగును గాక.

రాజు.—అమ్మా, భగవంతునికి చ్యవనమునికి నా ప్రణామమును నివేదింపుము.

తాపసి.—అట్లే చేసెదను.

కుమా.—ఆర్యా, నిజముగా పోదువేని నన్నుకూడ ఆశ్రమమునకు కొనిపొమ్ము.

రాజు.—ఓయి బాలకా, ప్రథమాశ్రమమున అటనే యుంటివి. ఇప్పుడు రెండవ యాశ్రమమునం బ్రవేశించుటకు నీకు సమయము.

తాపసి.—జాతా, పితృవాక్యమును పాలింపుము.

కుమా.—అటయిన,

క. నాయొడిలోఁ జూడాకం,
డూయనసుఖసుప్తమయ్యెడుఁ శితికంఠం,
బోయన బురిమొలచినయా,
నాయర్మిలి నెమలిబోదనాకుఁ బనుపుమా. 117

తాపసి.—(విహసించి) అట్లే చేసెదను. మీకు స్వస్తి యగుఁగాక! (అని నిష్క్రమించును.

రాజు.—కల్యాణీ.

క. ఈనీసుపుత్రునిచే
నైనా డను బుత్రవంతు లాదఁ అలోనఁ
నే నగ గణ్యుఁడ శచీ
సూను డగుజయంతుచేత సురపతివోలెఁ. 118

(ఉర్వశి స్మరించి ఏడ్చును.

విదూ.—ఏమి యిది? ఈ మహనీయురాలు ఒక్క-మ్మడిని అశ్రుముఖి యయినది?

రాజు.—[సావేగము]

తే. చెలియ యేడ్తేల నేఁ గులస్థితిని బొంది
హర్షవారాన్నిధిని నోలలాడుచుండ,
నిండుపాలిండ్ల కురలుకన్నీటిధార
మించు ముత్తెసరుల నిన్మడించు నట్లు. 119

[అని ఆమెయొక్క- కన్నీళ్ళను తుడిచివైచును.

ఉర్వశి.—చిత్తగింపుము మహారాజా. మొదల పుత్రదర్శనముచేత మఱచిఉంటిని, ఇప్పుడు మఱి మహేంద్ర సంకీర్తనముచేత ఏర్పాటు నాగుండెను తల్లడపెట్టుతున్నది.

రాజు.—ఆయేర్పాటును చెప్పుము.

ఉర్వశి.—పూర్వము నన్ను మహారాజగృహీతహృదయను మహేంద్రుడు ఆజ్ఞాపించెను.

రాజు.—ఏ మని ?

ఉర్వశి.—"ఎప్పుడు ఈతఁడు నా ప్రియసఖుడు రాజర్షి నీయందు జనించిన వంశకరుని ముఖము చూస్తాడో అప్పుడు నీవు మళ్ళి నా సమీపానికిరావలశినది" అని. అందువల్ల నేను మహారాజవియోగానికి వెఱచినదాననై జాతమాత్రుని వీనిని విద్యాప్రాప్తినిమిత్తము చ్యవనభగవంతుని యాశ్రమపదంలో సత్యవతమ్మచేతిలో అప్రకాశంగా ఇల్లడ వుంచితిని. ఇప్పుడు తండ్రిని కొలవడానికి సమర్థు డయినాడని ఆలోచించుకొని

ఆమె మళ్ళీ నాకు దీర్ఘాయువును అప్పగించింది, కనక నాకు ఇంతపాటిదే మహారాజుతోటి సంవాసము.

[అందఱు విషాదము రూపింతురు.

రాజు.—[నిట్టూర్పుతో] ఆహా! దైవముయొక్క సుఖవిరోధిత!

తే. ఆశ్వసిలితినో లేదో పుత్త్రప్రాప్తిచేత,
వెంటనే, నను సకిరో, నీవిరహ మంటె;
ప్రథమవృష్టికి నాతపజ్వర మెడసిన
వృక్షము నిరభ్రదపువహ్ని యేర్చినట్లు. 120

విదూ.—ఈయర్థము అనర్థానుబంధి యయినది. నాకు తోస్తుంది ఈయన ఇకమీద నారచీరలు ధరించి తపోవనాన్ని సేవించవలశినదని.

ఉర్వశి.—కృతవిద్యుణ్ణి పుత్రుణ్ణి బడసి మహారాజు మందభాగ్యను నన్ను స్వర్గానికి పో సెలవిచ్చి కృతార్థనుగా భావింపవలెను.

రాజు.—వలదు వలదు.

చ. తనకుఁ బ్రియంబు సేసికొన
దక్షుతఁ జెందదు నాథవంత మా
జనము వియుక్తభాజనము,
సల్పుము నీ వధినాథునానతిఁ;
నిను నెడఁ బాసి యీబుడుత
నీసుతు రాజ్యమునందు నిల్పి నే

వనముల నాశ్రయింతు సకి,
వన్యమృగంబులె సంగడీలుగాన్. 121

కుమా.—మేటివృషభము మోచినభారమును లేఁత కోడెమీఁద మోపుట నాయనకు తగవుగాదు.

రాజు.—ఓయి వత్సా,

చ. కలభమ యయ్యునుం జమవు
గంధగజం బితరద్విపంబులన్,
వెలయును ద్రాఁచుఁగందువిష
వేగము తీవ్రతరంబుగాఁ గడున్,
ఇల నెకిమీఁడు బాలకుఁడ
యేనియు నేల సమర్థుఁడే యగున్,
వలదు వయస్సు, పుట్టుక నె
వర్గ మిం దాత్మకృతిక్షమంబగున్. 122

లాతవ్యా, నామాటగా అమాత్యపరిషత్తునకుం జెప్పుము. ఆయువునకు రాజ్యాభిషేకసంభారములను సమకూర్పుఁడని.

కంచుకి.—దేవరయాజ్ఞ.

[అని దుఃఖితుఁడై నిష్క్రమించును.

[అందఱు కనులు మిఱుమిట్లుగొనుటను సూపింతురు.

రాజు.—[ఆకాశముం గని] ఏమి యిది! మేఘము లేకయే మెఱపుల ముత్తము పడుట!

ఊర్వశి.—[విలోకించి] అహో! భగవంతుడు నారదుడు.

రాజు.—ఆహా! భగవంతుఁడు నారదుఁడు! ఈయన,

చ. జడగుమి గోరజంపునిక
    మంపుఁబిశంగిమతో విరాజిలన్,
  గడలుకొనంగ జన్నిదము
    కైరవబంధుకలామలచ్ఛవిన్
  తొడిగినతారహారములు
    తోరపుఁగాంతిని గ్రాల, నేఁగుదెం
  చెడిని బసిండియూడలను
    జెందినజంగమకల్పకంబు నాన్. 123

ఈయనకు అర్ఘ్యము!

ఊర్వశి.—[చెప్పినట్లు తెచ్చి] ఇదుగో, భగవంతునికి పూజ.

[అంతట నారదుఁడు ప్రవేశించును.]

నారదుఁడు.—విజయము మధ్యమలోకపాలునికి.

రాజు.—[ఊర్వశిచేతినుండి అర్ఘ్యమందుకొని వంచి] భగవంతుఁడా, అభివాదనము చేయుచున్నాను.

ఊర్వశి.—భగవానుడా, ప్రణమిల్లుతున్నాను.

నార.—ఎడఁబాయనిదంపతుల రగుఁడు.

రాజు.—ఆత్మగతము ఆహా! ఇట్లగునా! [ప్రకాశము కుమారుని కవుంగిలించుకొని], వత్సా భగవానునికి నారదునికి ప్రణమిల్లుము.

కుమా.—భగవానుఁడా! ఔర్వశేయుఁడను ఆయువును ప్రణమిల్లుచున్నాను.

నార.—ఆయుష్మంతుఁడ వగుము.

రాజు.—ఇదె యాసనము, అలంకరింపవలయు.

[నారదుఁడు కూర్చుండును. అందఱు నారదునిపిమ్మటఁ గూర్చుందురు.

నార.—రాజా, మహేంద్రునిసందేశమును వినుము.

రాజు.—అవహితుఁడను.

నార.—ప్రభావదర్శి శతమఖుఁడు అటవికేఁగ సంకల్పించుకొన్న నిన్ను ఇట్లు అనుశాసించుచున్నాఁడు.

రాజు.—ఏమి యాజ్ఞాపించుచున్నాఁడు ?

నార.—త్రికాల్యదర్శులు మునులు ఆదేశించినారు-సురాసురసంగ్రామము కలుగనున్నదని. నీవు నాకు యుద్ధములలో గడిదేరినసహాయుఁడవు. కావున, నీవు ఇపుడు శస్త్రసన్న్యాసము చేయఁగూడను. ఈయుర్వశియు యావజ్జీవము నీకు సహధర్మచారిణిగా నుండవలసినది.

ఉర్వశి.—[అపవారించి] అహా! నాహృదయంనుంచి శల్యము ఉద్ధృతమయినది!

రాజు.—ఇంద్రునిచేత నాథవంతుఁడను.

నార.—యుక్తము.

ఆ. నిర్వహించుగాక నీకార్యమును వజ్రి,
యీవొనర్పు మతనియిష్టములను ;

పెనుచుచుండు నినుఁడు వీతిహోత్రు నివెల్గు,
వీతిహోత్రుఁ డినుని వెల్గుఁ బెనుచు. 124

[మింటివైపు చూచి] రంభా, కుమారునికి ఆయువునకు మహేంద్రుఁడు స్వయముగా పంపిన యౌవరాజ్యాభిషేక సంభారములను తెండి.

[యథోక్తహస్తలు అచ్చరలు ప్రవేశింతురు.]

అచ్చరలు.—భగవంతుడా, ఇవుగో అభిషేకసంభారాలు.

నార.—భద్రపీఠమున ఆయుష్మంతుని కూర్చుండఁబెట్టుడు.

రంభ.—వత్సా, ఇటు.

[కుమారునిఁ గూర్చుండఁబెట్టును.

నార.—[కుమారునిశిరమున కలశమును కుమ్మరించి] రంభా, కడమవిధానమును నెఱవేర్పుము.

రంభ.—[యథోక్తము కావించి] వత్స, భగవంతునికిన్ని అమ్మకూ నాయనకున్ను ప్రణమిల్లు.

[కుమారుఁడు వరుసగా ప్రణమిల్లును.

నార.—నీకు స్వస్తి.

రాజు.—కులధురంధరుఁడవు కమ్ము.

ఉర్వశి.—నాయనను ఆరాధించేవాడవు కమ్ము.

[నేపథ్యములో వైతాళికులు]

ప్రథముఁడు.—విజయము యువరాజునకు.

తే. అజుని సురమౌని యత్రి, యా యత్రిని శశి,
శశిని సౌమ్యుఁడు, సౌమ్యు భూజానివోలె,
అయ్యు ననుకరింపుము లోకహారిగుణత,
నెల్లయాశాస్యములకు మీయిల్లె యిల్లు. 125

ద్వితీయుఁడు.—

ఉ. ఉన్నతులందు నీజనకుఁ
డున్నతుఁ, డీవును నప్రకంప్యతన్
మున్నయి మేర దప్పనిసు
పుత్రుఁడ, నీవిముఁ గొల్చు చిర్వ్వర్వన్,
పన్నుగ రాజ్యలక్ష్మి ప్రవి
భక్త వహించెఁ దుషారశైలవా
రాన్నిధులందు వ్యాప్తిఁ గొని
రాజిలుగంగను బోలుభాగ్యమున్. 126

అప్సరలు.—[ఉర్వశిని దటిసి] ఆహాహా! పుత్రుని యువరాజశ్రీచేతను భర్తతోటి అవియోగంచేతను వర్ధిల్లుతున్నావు!

ఉర్వశి.—ఈయభ్యుదయం అందటిదిన్ని, [కుమారుని కేలంగొని] వత్సా రా, మీ దొడ్డమ్మకు నమస్కారంచేయి.

[కుమారుఁడు లేచును.

నార.—ఉండు, సమయాన ఆమెకడకు పోయెదవు.

క. నీయాత్మజుఁ డగునాయుని
శ్రీయువరాజత స్మరింప జేయు ననున్ స్వ

ర్నాయకుచ్ఛే సురసేనా
నాయకతం బూన్పఁబడు పినాకితనూజు౯. 127

రాజు.—భగవంతుని చేత ఇట్లు అనుగ్రహీతుఁ డయిన వాఁడు యోగ్యుఁడు కాకుండు టెట్లు?

నార.—నీకు పాకశాసనుడు ఇంక నేమి ప్రియము చేయవలయును ?

రాజు.—మఘవంతుఁడు నాకు ప్రసన్నుఁడై యుండఁగా అంతకన్న ఏమి కోరుదును. అయినను ఇట్లగుఁగాక.

[భరతవాక్యము.]

క. సిరికి సరస్వతికిఁ బర,
స్పరవిద్వేషిణుల కేకసంశ్రయమునయం
దరు దగుసంగతి తఱచై,
పొరయించును గాత సాధువుల కుద్భూతి౯. 128

మఱియు.—

క. ఎల్లరు నిడుములు గడచుత,
నెల్లరుఁ గల్యాణముల రహింతురు గాత౯,
ఎల్లరకోర్కులు దీఱుత,
నెల్లరు నందింత్రు గాత నెల్లధరిత్రి౯. 129

పంచమాంకము సమాప్తము.

విక్రమోర్వశీయనాటకము సమాప్తము.

చెన్నపురి: చంద్రికాప్రెస్సునముద్రితము.—1946.
Q. H. M. S. 114 B.—2000—17-6-1946.